


# గాజుపల్లకి

పి. ఎస్. నారాయణ

---

## నవల

# గాజుపల్లకి

## (నవల)

స్వాతి

మాసపత్రికలో

అనుబంధ నవలగా

1975 వ సంవత్సరంలో

ప్రచురింపబడింది.

**వెల:రు. 70**

గమనిక

ఈ నవలలోని పాత్రలు, సంఘటనలు–
అన్నీ కల్పితాలు, ఎవర్నీ ఉద్దేశించినవి కావు.
ఎక్కడయినా పోలికలు, సామ్యాలూ
కనిపించినా అవి యాదృచ్ఛికమే.

–రచయిత

# గాజుపల్లకి

జోరున వానపడుతోంది. తలుపు తీసి, ఒక్క అడుగు వెనక్కు– మీదకొస్తున్న జల్లును తప్పుకుందామా అన్నట్లుగా– వేస్తుండగానే, దానంత విసురుగానూ ఓ స్త్రీ కంఠం, "కాస్త చేయి పట్టుకోండి!" అంటూ వినబడింది.

గిరిబాబు ఉలిక్కిపడ్డాడు.

ఆలోచనారహితంగా చేయి అందించాడు.

ఆమె పెట్టెలోకి దూకింది.

ఆమె తడిసి ముద్దయి, ఓ తడిగుడ్డల మూటలా వున్నది. జుట్టులోనుంచి ముఖం మీదకు నీళ్ళు కారుతున్నాయి. పెట్టుకున్న కుంకుమ బొట్టు చెదిరి ముఖమంతా అల్లుకొని వికృతంగా వున్నది.

ఆమెకు ఇరవై సంవత్సరాలకు మించి వుండవు.

జల్లుకు అడ్డు పెడుతున్నట్లుగా తలుపును మూస్తున్న గిరిబాబును, "ఏఁవిటి– ఈ పెట్టె మీ ఒక్కరి కోసమేనా?... లోపల బోల్టల్లా బిగించారు?" అన్నది.

గిరిబాబు తలెత్తి ఆమె ముఖంలోకి చూచాడు.

"ఇది రెండొవ తరగతి..."

అతడి మాటలు పూర్తవ్వకుండానే, "భారతదేశంలో మీరు తప్ప ఇంకెవ్వరూ ఈ

పెట్టెలో ఎక్కలేరనా?" అన్నది.

"కాదు... కాదు..." తడబడ్డాడు గిరిబాబు.

నిజమే... తలుపు కొడుతున్న చప్పుడవ్వగానే తెరిచి వుండవలసింది!

"క్షమించండి!"

"దానివలన చేసిన పాపం పోతుందనా మీ ఉద్దేశ్యం?" తల ఎగరవేసింది, కళ్ళు చికిలించి చూస్తూ. "నా ఆరోగ్యం మీద నాకు అంతగా అనుమానం లేదుగాని... తడినీళ్ళు కారుతున్న ఈ తలతో, ఈ తడిగుడ్డలతో ఇలా క్షమాపణలు వింటూ కూర్చుంటే నాకు జలుబు చేయదనే గ్యారంటీ మాత్రం ఇవ్వలేను... ఆ తరువాత యే జ్వరమో వచ్చి, అది ఏ న్యుమోనియాలోకో దించి, నేను చచ్చిపోవటమే తటస్థిస్తే, దానికి మీరే సంపూర్ణంగా బాధ్యులవుతారు!" ఫక్కున నవ్వింది.

గిరిబాబు తత్తరపాటు నుండి కోలుకోకముందే ఆమె సూట్‌కేసు తెరవడం, మరో చీర, జాకెట్టు తీసుకోవడం, బాత్‌రూంలోకి వెళ్ళి దాని తలుపు మూయటం కూడా జరిగిపోయింది.

గిరిబాబు ఆమె మాటల్లోని విసురును తలుచుకుంటూ తలవంచుకు కూర్చున్నాడు.

కొద్ది నిముషాల తరువాత ఆమె "ఇక తలయెత్తవచ్చు!" అన్నమాటకు ఉలిక్కిపడి తలెత్తాడు కూడా.

ఆమె లేత నీలంరంగు చీర కట్టుకున్నది. అదే రంగుజాకెట్టు తొడుక్కున్నది. తన పొడువైనజుట్టును విడదీసుకొని, ముందుకు వేసుకొని టర్కీ టవల్‌తో తుడుచుకుంటోంది.

ఆమె నవ్వితే చాలా అందంగా వుంటుందనిపించింది. ఎర్రటి మనిషి... ముదురు గులాబీరంగు పెదవులు... చిన్న నోరు!

గిరిబాబు అడిగాడు: "ఇంత వానలో ఒంటరిగా బయల్దేరారు... ఎక్కడిదాకా వెళుతున్నారు?"

"తెలియదు!"

ఉలిక్కిపడ్డాడు గిరిబాబు.

ఎంత లోతుగా ఆలోచించినా అర్థంకాని దానిలా వున్నది, ఆమె ముఖం ఆ క్షణంలో.

"అదేఁవిటి?"

ఆమె నవ్వింది. "నాకు గమ్యమంటూ వుంటే ఇలాంటి వాతావరణంలో ఇలా ప్రయాణం పెట్టుకుండేదాన్నే కాదు... రెండొవ తరగతి పెట్టెలో ఒంటరిగా ఎక్కేదాన్నే కాదు!"

"నాకు అర్థం కావటంలేదు!"

"నేను ఇక ఎవ్వరికీ అర్థం కాదలుచుకోలేదు!"

ఇక ఆమెతో ఏం మాట్లాడాలో అర్థంకాలేదు గిరిబాబుకు. పక్కనే పడేసిన పెర్రీమేసన్‌ను చేతిలోకి తీసుకున్నాడు. ఇంతలోనే ఏదో గుర్తుకు వచ్చినవాడిలా, "మీరు ఎక్కిన స్టేషన్ ఏది?" అని అడిగాడు.

"ఉఁహూఁ... తెలియదు!" తల అడ్డంగా ఊపుతోంది.

మళ్ళీ ఆశ్చర్యపోవటం గిరిబాబు వంతే అయింది. కొద్దిక్షణాల తరువాత తేరుకొని, "పోనీయ్... మీ కభ్యంతరం లేకపోతే మీరెక్కడనుండి బయల్దేరారో చెప్పగలరా?" అన్నాడు చిన్నగా నవ్వి.

"తెలుగుదేశంలో ఓ చిన్న పట్టణం... ఇక్కడకు వందమైళ్ళ దూరంలో... అయినా పోనీయండి... గడిచిపోయిన దాన్ని గుర్తుకు తెచ్చి నన్ను బాధ పెట్టబోకండి!" ఆమె ముఖం మీద నల్లటి మబ్బు తెరలు పారాడుతున్నట్లనిపించింది. "నా గతాన్ని నన్ను మర్చిపోనివ్వండి, ప్లీజ్!" దీనంగా ఉన్నట్లనిపించింది ఆ కంఠం.

"అంటే–"

ఆమె ఒక్క క్షణం ఆగింది.

"– నేను ఇంట్లోంచి పారిపోయి వస్తున్నాను!"

గిరిబాబు ఆశ్చర్యంగా ఆమె ముఖంలోకి చూచాడు.

"నిజంగానా?"

"మీతో అబద్ధం ఆడటం వలన నాకు వచ్చే లాభంలో సగం మీది!" నవ్వింది.

అలా నవ్వితే ఆమె బుగ్గల్లో పడే సొట్టలు ఎంత అందంగా వుంటాయి!

ఆ అమ్మాయిని నవ్విస్తూ ఎంత సేపైనా అలా కూర్చోగలడు తను.

"మీ పేరు మీకు తెలుసా?" అన్నాడు కొద్దిగా కొంటెగా, చనువు ఏర్పరుచుకుంటున్నట్లుగా.

"తెలిసినవన్నీ మీకు చెప్పాలని వున్నదా?" మళ్ళా నవ్వింది.

వదులుగా జడ అల్లుకోసాగింది.

ఆమె ప్రశ్నకు నిజంగా గిరిబాబుకు సమాధానం దొరకలేదు.

– మొట్టమొదటిసారిగా ఆ అమ్మాయి తనని ఏడిపిస్తున్నదేమోననే భావన రాగా అతడి ముఖం నల్లబడింది.

"నేను మనుష్యులను చదవగలను!" అన్నది.

"ఏ విషయంలో?" అన్నాడు ముఖానికి గంటుపెట్టుకొని తలవంచుకుంటూ.

"అలక ఎప్పుడూ ఆడవాళ్ళ ముఖానికే అందాన్ని ఇస్తుంది!" అన్నది కవ్విస్తున్నట్లుగా.

తలెత్తాడు.

ఆమెతో వాగ్వివాదానికి దిగడం ఇష్టం లేదన్నట్లుగా "నేను పడుకుంటాను!" అన్నాడు.

అని ఆలస్యం చేయకుండానే సీటుమీద పరిచివున్న దుప్పటిమీద నడుం వాల్చాడు.

"మీ ఇష్టం!" అంటూ కొద్దిగా మిగిలిపోయిన జడను త్వరత్వరగా అల్లుకోసాగింది.

ఇంకా వర్షం పడుతూనే వున్నది.

నిశ్శబ్దంగా వున్న ఆ సమయంలో రైలు మోత, వాన మోతకూడా భరించలేనివిగానే వున్నాయి. తను ఎంతగా కళ్ళుమూసుకొని పడుకున్నా నిద్రపట్టటంలేదు. కళ్ళు తెరుచుకు కూర్చుంటే ఆ అమ్మాయితో మాట్లాడకా తప్పటంలేదు ... సంభాషణ సహజంగా జరగటంలేదు... వంకరటింకరగా నడుస్తోంది.

కళ్ళు తెరిచి ఓరగా ఆ అమ్మాయి ముఖంలోకి చూచాడు.

– అజంతా శిల్పంలా వున్నది!

తెల్లగా... లేత నీలంరంగు చీరలో...

జడ చివర్లను గుండ్రంగా తిప్పి వదిలేస్తోంది.

– ఇంతకీ ఆ అమ్మాయి ఎక్కడిదాకా వెళుతున్నదో చెప్పనేలేదు... ఇంట్లోనుంచి పారిపోయి వస్తున్నానన్నది కదా ... మరి... అధాట్టుగా అతడికో అనుమానం వచ్చింది.

ఎందుకు పారిపోయి వస్తున్నది?

– ఎవరితోనైనా?...

అయితే ఆ మహా పురుషుడేడి?

లేకపోతే సినిమాలల్లో జేరటానికా?... సవితి తల్లి బాధలు పడలేకనా?... కారణం ఏమిటి?...

ఏదో అడగాలన్న ఉత్సుకతతో లేవబోయాడు కాని ఏమడగాలో అర్థంకాలేదు. ఎలా అడగాలో అర్థంకాలేదు...

"మీరు...?!" అంటూ అర్థోక్తిలో ఆగిపోయాడు.

"నాపేరు మల్లిక!" అన్నది అతడి ప్రతి చర్యనూ గమనిస్తున్నట్లుగా తాపీగా. అతడు మాటాడీ మాటాడకముందే సమాధానం చెప్పింది.

"థాంక్స్!" అన్నాడు గిరిబాబు.

ఆమె తన ముఖంలోకి చూస్తూ నవ్వుతోంటే తడబడ్డాడు. ఆమె అన్నట్లుగా తనని స్టడీ చేస్తున్నదేమో ననిపించగా కొద్దిగా గాభరాకూడా పడ్డాడు.

"మిమ్మల్ని చూస్తే నాకు భయంగా వున్నది!"

"నేను అంత భయంకరంగా వున్నానా?"

"ఆ విషయంలో కాదు!"

"మరి?"

"ఏం లేదులేండి!"

"లేచొచ్చిన మనిషిని కదా... మీ కొంపేమైనా ముంచుతాననుకుంటున్నారా?"

మల్లిక తనను చదివేస్తున్నదనటంలో ఏమాత్రం సందేహమూ లేదు!

ఇబ్బందిగా నవ్వి, "అబ్బే! ఆలాంటిదేఁవీ లేదు!" అని, "అయినా మీరు నన్నేం చేస్తారని!" బింకంగా అన్నాడు.

– ఓ పరాయి ఆడదానిముందు తను ఓడిపోవటం జరగని పని!

నవ్వింది మల్లిక!

ఆమె ఒక్క క్షణం శూన్యంలోకి చూస్తున్నట్లుగా ఆగింది. "పాడువాన! నా జీవితంలో జరిగిన దుర్ఘటన ఎంత భయంకరంగా వున్నదో– ఈ వానా అంత భయంకరంగానే వున్నది!"

"మీకు జరిగిన దుర్ఘటన ఎంత భయంకరంగా వున్నదో నాకయితే తెలియదుగాని– వాన వలన మనకు వచ్చిన నష్టమేమిటో నాకు అవగతం కావటంలేదు. మనం రైలు పెట్టెలో కూర్చున్నాం... హైద్రాబాద్‌లో సావధానంగా దిగ గలుగుతాం... ఆపైన

టాక్సీ చేసుకుంటే తడవకుండా ఇంటికి వెళ్ళవచ్చు!"

"నేను కూడానా?"

"ఏం?"

"నేను ఎవరింటికి వెళ్ళగలను?"

"తెలిసినవాళ్ళెవరూ లేరా?"

"ఎవరైనా వున్నా నన్ను రానిస్తారా?"

"పోనీ హోటల్‌కు వెళ్ళండి!"

"డబ్బులు అక్కరలేదా?"

"లేవా?"

"ఉంటే టిక్కెట్టు లేకుండా ఎందుకు ప్రయాణం చేస్తాను?"

ఉలిక్కిపడ్డాడు గిరిబాబు. కళ్ళు పెద్దవి చేసుకొని ఆ అమ్మాయి ముఖంలోకి చూడసాగాడు.

"నిజంగా మీ దగ్గర టిక్కెట్టు లేదా?" నమ్మలేనట్లుగా అడిగాడు.

"ఉంటే ఊరూ, పేరూ తెలియని ఆస్టేషన్‌లో నన్ను టిక్కెట్ కలెక్టరు ఎందుకు దించివేస్తాడు?... వానలో, ఈదురు గాలిలో ఆ రేకుల షెడ్డులాంటి స్టేషన్‌లో గంటల తరబడి ఎందుకు చలిలో ముడుచుకు కూర్చుంటాను?"

ఆ క్షణంలో మల్లిక ముఖంలోకి చూస్తుంటే గిరిబాబుకు అమితమైన జాలి కలిగింది. ఏంవీ మాట్లాడలేకపోయాడు.

"నేను చెబుతున్నది నిజం!" అన్నది తల అటూ ఇటూ ఊగిస్తూ. "నేను ఉదయం పదకొండు గంటలకు భోజనం చేశాను!"

"అరె!"

"తరువాత పచ్చి మంచినీళ్ళు కూడా తాగలేదు!"

"ఎలా ఉండగలిగారు?"

"ఏం చేయాలి... చేతిలో నయాపైసా లేనప్పుడు భరించక తప్పదు!"

గిరిబాబు దబదబా లేచి సూట్కేసు తెరిచి, అందులోనుంచి బిస్కెట్ ప్యాకెట్టు తీస్తూ, "తినండి!" అన్నాడు.

"నా మీద జాలితో అయితే ఇస్తున్నారు... మీకు అవసరం కలిగితేనో...?" మాటలు చాలా ముద్దగా వున్నయి.

"తెల్లవారేటప్పటికి హైద్రాబాద్‌కు వెళ్ళిపోతాను. ఈలోగా ఏంవీ ఆకలి కాదు... ఏదో ఉంటాయిలే అని కొని సూట్కేసులో పడేశాను!"

"దురదృష్టంలో అదృష్టం అంటే ఇలాగే వుంటుంది!"

"ఇంత చిన్నదాన్నే అదృష్టంగా భావిస్తారా?"

"మరికాక... ఉదయాన తిన్న కడుపు!" ఆమె నవ్వితే ఈసారి చాలా నీరసంగా వున్నట్లనిపించింది.

ప్యాకెట్టులోనుంచి సగం బిస్కెట్లు తీసుకుంటూ, "మిగతావి మీకు?" అన్నది అతడి పక్కగా పెడుతూ.

"నాకు ఆకలి కావటంలేదు!"

"అయినప్పుడే తిందురుగాని!"

అక్కడే ఉంచేశాడు గిరిబాబు.

నాలుగు బిస్కెట్లు తిని మిగతావి పక్కన పెడుతూ, "మీ దగ్గర గ్లాసేమైనా వున్నదా?... మంచి నీళ్ళు కావాలి!" అన్నది.

"లేదు!"

"పక్కనే ఎవరో ఉన్నట్లున్నారు... పిల్లలు కూడా ఉన్నారు కదా!... వాళ్ళ దగ్గర ఉంటుంది!" అంటూనే దబదబా వాళ్ళ దగ్గరకు వెళ్ళి, "గ్లాసుంటే ఒక్కసారి ఇవ్వండి!" అన్నది.

ఆమె లేచి గ్లాసు ఇస్తుంటే, "మంచినీళ్ళుంటే... అవిగూడా, ప్లీజ్!" చిన్నగా నవ్వి అన్నది మల్లిక

ఆలాంటి వాతావరణంలో ఆమె మంచినీళ్ళు కోరటాన్ని ఎంత వింతగా చూచిందో– తరువాత మల్లిక గ్లాసు తరువాత గ్లాసు త్రాగేస్తున్నప్పుడూ అంత వింతగానూ చూచింది ఆవిడ.

త్రాగి గ్లాసు తిరిగి ఇచ్చివేస్తూ, "కృష్ణనీరా?... చాలా తియ్యగా వున్నయి!" అని ఓ కాంప్లిమెంట్ ఇచ్చేసి, కృతజ్ఞతా సూచకంగా ఓ చిరునవ్వు నవ్వి, వచ్చి తన సీట్లో కూర్చున్నది మల్లిక.

రైలు ఏదో స్టేషన్‌లో ఆగింది. టైం చూసుకున్నాడు.

పన్నెండు గంటలయింది.

"ఇక్కడ టీ ఏఁవైనా దొరుకుతుందేమో?" అన్నది మల్లిక ఆశగా గిరిబాబు ముఖంలోకి చూస్తూ...

"ప్రయత్నించమంటారా?"

"ప్లీజ్..."

గిరిబాబు లేచి తలుపు దగ్గరకు వెళ్ళి, బోల్టు లాగి, హ్యాండిల్ తిప్పాడు. గాలి విసురుకు తలుపు వెనక్కు నెట్టుకు వచ్చింది. తూలిపడబోయాడు.

"అబ్బా!" ముఖానికి చేయి అడ్డుపెట్టుకున్నాడు.

"ఏఁవైంది?" మల్లిక లేచి నిలబడింది. "మైగాడ్! ఇంత గాలా? తుఫానులా ఉన్నది!" ముందుకు వచ్చింది.

ఇద్దరూ కలిసి తెరుచుకున్న తలుపును బలంగా ముందుకు నెట్టి బోల్టు బిగించేశారు.

చలి నరాల్ని కొరుక్కుతింటోంది.

"సారీ!" అన్నది.

"ఫరవాలేదు!" అన్నాడు గిరిబాబు పేలవంగా నవ్వి.

'ఇది తుఫానేమో?' అనుకునేటప్పటికి రైలుపెట్టె కూడా అటూ ఇటూ ఊగుతున్నట్లే అనిపిస్తోంది. పెట్టెను పైకీ క్రిందకూ బిక్క మొహాలతో చూస్తూ కూర్చుండిపోయారు ఇద్దరూ.

"రైలుకు ఏ ప్రమాదమూ ఉండదంటారా?"

"అలాంటిదేమైనా వుంటే నడుపుతారా?"

ఇద్దరి మధ్యా మౌనం రాజ్యం చేస్తోంది.

"మీరు భయపడుతున్నారా?"

ఆమె ఒక్కక్షణం సర్వం పోగొట్టుకున్నదానిలా శూన్యంలోకి లోతుగా చూచి తల అడ్డంగా ఊపింది. "నాకు భయం దేనికి?... నిన్న రాత్రి వరకూ నాకు జీవితంలో ఎన్నో భయాలుండేవి... కాని ఒక్కరోజు... ఇరవై నాలుగు గంటల కాలం... నన్నూ నా జీవితాన్ని మార్చివేసింది... ఆ ఇరవైనాలుగు గంటలలోనే నేను సర్వం అనుభవించాను ... బాధను అనుభవించాను... భయాన్ని అనుభవించాను... అనుమానాన్ని, అవమానాన్ని అనుభవించాను... హేళనను, అసహ్యాన్ని, తూష్ణీకార భావాన్ని అనుభవించాను... కుక్కలాగా తరిమి వేయబడ్డాను... మనుష్యులు తోటి మనుష్యులను– అందునా స్త్రీలు తోటి స్త్రీలను ఎంత అసహ్యంగా, ఏహ్యంగా చూస్తారో ఆ ఇరవైనాలుగు గంటలే నాకు నేర్పింది... ప్రేమని, ఆప్యాయతని, స్వర్గాన్ని, సౌఖ్యాన్ని– నా సర్వస్వాన్ని ఎప్పుడైతే విడిచి మా గృహంనుండి బయట కాలుపెట్టానో, అప్పుడే నేను మరో మనిషినయ్యాను... ఆ మరో మనిషి, తరువాత ఒక్క ఇరవై నాలుగు

గంటలలోనే ఒక గండు శిలయి దేనికీ చలించని ఓ మహోన్నత శిఖరంలా స్థిరపడిపోయింది... ఆమే ఈ మల్లిక!"

వేడి నిట్టూర్పు వెలువడింది.

"నాకు భయంలేదు!" అన్నది మల్లిక ఒత్తి పలుకుతూ.

"అసలు ఏమైంది?" అన్నాడు చాలా నెమ్మదిగా గిరిబాబు.

"మీకు చెప్పాలనే వున్నది. కాని జరిగిన ప్రతిక్షణం గుర్తుకు తెచ్చుకుంటుంటే నాలో కోపం ప్రజ్వరిల్లుతోంది... అసహ్యాన్ని ఆపుకోలేనేమో... ఆవేశానికి అవధులే ఉండకపోవచ్చు... ఆ భయంకర దృశ్యాలను కళ్ళముందు కదిలించుకుంటే ఈ చేతులు ఇనుప ఊచలయి ఎదుటి మనిషి మెడను నులిమి వేస్తాయేమోననిపిస్తోంది!" ఆమె కళ్ళు ఎర్రబడినాయి. ఆమె ఒణికి పోతున్నది.

సానుభూతితో ఆమెను చూడసాగాడు గిరిబాబు.

"అతడు పశువు!" అన్నది కఠినంగా.

ఉన్నట్లుండి లైట్లు ఆరిపోయినాయి. చీకటి రాకాసిలా పెట్టెనంతటినీ చుట్టివేసింది– వాళ్ళ నోళ్ళు నొక్కుకు పోయినట్లుగా మాటలూ ఆగిపోయినయి.

రెండు నిముషాల వరకూ ఆమె మాట్లాడకపోవటంతో, గిరిబాబు సీటు మీద వున్న సూట్కేసును ఒక పక్కకు నెట్టి, దానిమీద పడేసివున్న రగ్గును చేతిలోకి తీసుకుంటూ, "నేను పడుకుంటాను!" అన్నాడు.

"అదృష్టవంతులు!"

"మీరూ పడుకోండి!"

"కణకణలాడే నిప్పులతో నిండిన కొలిమిలా వున్నది నా మనస్సు ఈ క్షణంలో... పెట్టెలోకి ఎక్కేటంతవరకూ నిగ్గతీసుకుని వున్న నేను తిరిగి ప్రజ్వరిల్లుతున్న ఆ మంటలను ఆర్పలేనేమో ననిపిస్తోంది!"

“కష్టాలు మనుష్యులను కృంగదీస్తయ్యనేది నిజమే గాని... మనం ఓర్చుకోక తప్పదు!”

“సానుభూతి ఏ మాత్రం చూపించవద్దు. అది నన్ను మరింత తికమక చేస్తుంది!”

అతడికి మరేం మాట్లాడాలో తెలియలేదు.

మౌనంగా చీకట్లో కించత్ వెలుగేమైనా దొరుకుతుందేమో నన్నట్లుగా వెతుక్కోసాగాడు. వెలుగు దొరకలేదు గాని ... నీలి రంగు చీరలో, నీలిరంగు జాకెట్టులో, వదులైన వాలు జడను ముందుకు వేసుకొని బుగ్గలు సొట్టలు పడేలా నవ్వుతున్న మల్లిక మాత్రం కనబడింది.

ఆ అమ్మాయిని మోసం చేయటానికి అతడికి మనస్సెలా వొప్పింది?

“నిద్రపోతున్నారా?” మల్లిక గొంతు.

“లేదు!”

“నా గురించి ఆలోచిస్తున్నారా?”

తడబడ్డాడు.

ఆ చీకట్లో సింప్లెక్స్ ఉన్ని దుప్పటిని కావాలని తలనిండా కప్పుకున్నాడు.

మల్లిక నవ్వింది!

“ప్రశాంతంగా పడుకున్న మిమ్మల్ని చూస్తుంటే నాకు చాలా ఈర్ష్యగా వున్నది!”

నిండా కప్పుకున్న దుప్పటిని కాస్త తొలగించాడు కానీ చూపులకూ, చీకటికీ నడుమ తెరలు ఏ మాత్రమూ తొలగ లేదు.

“మరొకరి సుఖాన్ని చూచి ఈర్ష్యపడటం అంత శ్రేయోదాయకం కాదు!”

“నాకు ఇంతకుమించి కలిగే నష్టమేం వున్నది?” చీకట్లో పెదవిని నొప్పిపుట్టేలా కొరుక్కున్నది.

"దుప్పటి కప్పుకొని, కళ్ళుమూసి చీకటిలో ఏంవీలేదనుకుంటూ పడుకోండి... అలాగే నిద్రపట్టేస్తుంది!"

"చీకటిలో నలుపు భయంకరంగా వున్నది!" గొంతు దిగులుగా వున్నది.

గిరిబాబు అధాట్టుగా లేవబోయాడు.

"కాసేపు భయంలేదు అంటారు... కాసేపు భయం వేస్తున్నది అంటారు... నాకు అర్థంకావటంలేదు!"

ఒక్క క్షణం మాట్లాడలేదు మల్లిక.

"నాకు ధైర్యం లేదు అని అనను గాని... నేనూ ఆడదాన్ననే ఒప్పుకోక తప్పదు!"

"ఇందాక వెలుగులో చూచాను కాబట్టి నేనూ కాదనలేను!" గిరిబాబు ఎగతాళిగా నవ్వాడు.

మల్లికా నవ్వింది.

"భయం వేస్తే ఏం చేయమంటారు?"

"మీ ఇంట్లో ఏం చేసేవారు?"

"భయం పోయేటంత వరకూ మెళుకువతో కూర్చుండేదాన్ని!"

"ఇక్కడా అదే చేయండి!"

"ఇంత చీకట్లోనా... ఇంట్లో అయితే లైటు వుండేది!"

"మరి నన్నేం చేయమంటారు?"

"నాకు భయం తీరేటంతవరకూ మీరు మాటలు చెబుతూ కూర్చోండి!"

'అలాగే!' అని అనలేకపోయాడు గిరిబాబు.

నిద్ర కనురెప్పల మీద బరువుగా వాలుతోంది.

"మీ కిష్టం లేదన్నమాట... తోటి ప్రయాణీకురాలికి ఆ మాత్రం సహాయం

చేయటం తప్పా!"

గిరిబాబు నోరు విప్పబోయాడు.

"మీరు జనంతో కిక్కిరిసివున్న పెట్టెలో ఎక్కారనుకోండి... ఒంటికాలిమీద కొంగలా జపం చేయవలసి వస్తే భరించేవారా, కాదా?"

"దిగిపోయి వుండేవాడిని!"

"మీరు వెళ్ళదలుచుకున్న పనిని గంగలోకలిపా... ఆఁ... ఇంతకీ అడగనేలేదు... మీరు ఎక్కడిదాకా వెళుతున్నారు?... ఎక్కడనుండి వస్తున్నారు?"

మల్లిక ప్రశ్నకు సమాధానంగా కళ్ళముందు తన మిత్రుడు చంద్రం నిలబడ్డాడు. జరగబోతున్న వాడి పెళ్ళి గుర్తుకు వచ్చింది. ఆ జోరున వానలో ఆ పెండ్లి ఇంట్లో ఎంత హడావుడిగా వున్నదో... బంధువులు పిల్లలతో...

తను వెళ్ళకపోతే చంద్రం ఊరుకోడు... అందుకే తప్పలేదు... వాతావరణం అనుకూలంగా లేకపోయినా తను బయల్దేరాడు.

మల్లిక రెండు మూడుసార్లు పిలిచిందిగాని– గిరిబాబు చంద్రాన్ని, సరోజనూ కళ్ళముందు కూర్చోబెట్టుకోవటంతో ఆమె పిలుపును వినిపించుకోలేదు.

* * *

తెల్లవారింది. గిరిబాబు కళ్ళు తెరిచాడు. మల్లిక లేచిందేమో నన్నట్లుగా ఆసక్తిగా అటు చూస్తే మెడ వరకూ పమిటను కప్పుకొని పడుకొని వున్నది.

'ముఖం కడుక్కొని కాఫీ త్రాగుదామన్నా ఇప్పుడు ఎక్కడ దొరికేను?... మల్లిక లేస్తే బాగుండు... మాటలయినా చెబుతూ కూర్చుంటుంది!'

సూట్కేసు కదిలిస్తుంటే మల్లిక కళ్ళు తెరిచింది.

"గుడ్మార్నింగ్!"

"గుడ్మార్నింగ్, మేడమ్!"

"ఎంత సేపయింది లేచి?"

"పది నిముషాలు!"

"మరి కాఫీ ఏర్పాట్లేవైనా చేస్తున్నారా?"

నవ్వి ఊరుకున్నాడు గిరిబాబు. మెదలకుండా సూట్కేసు తెరిచి, బ్రష్ బయటకు తీసి దానిమీద పేస్టు వేశాడు. టవల్ భుజాన వేసుకొని వాష్ బేసిన్ దగ్గరకు బయల్దేరాడు.

"లేచివచ్చిన మనిషి అంటే ప్రతి వాళ్ళకీ లోకువే!"

విభ్రాంతిగా ఆమె వైపుకు చూచాడు.

"నేనే మీ ఆత్మీయురాలినైతే, నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయేవారా?" బేలగా నవ్వింది. "నాకు ఊహ తెలిసినప్పటినుండీ ఇంతవరకూ ఎప్పుడూ నేను కాఫీ త్రాగని ఉదయం లేదు!"

"ఏం చేద్దాం మరి?" జాలిగా అన్నాడు.

"నాకు తలనొప్పి వస్తుంది!"

గిరిబాబుకు ఏం చెప్పాలో తెలియలేదు.

"నాకు తలనొప్పి వస్తుందంటున్నాను... మీకు వినబడటం లేదా?" అన్నది కాస్త విసురుగా.

"మీకు తలనొప్పి వస్తే నేను ఏం చేసేది?" ఆమె ప్రవర్తనకు ఆశ్చర్యపోతూ అడిగాడు సౌమ్యంగానే.

"మీరు మగవారు... కష్టాలలో వున్న ఓ ఆడకూతురుకు ఆ మాత్రం సాయం చేయలేరా?"

"ఈలాంటి భీభత్స వాతావరణంలోనా?"

"మీకే ఆ అలవాటు వుంటే మీరేం చేసివుండేవారు?"

"భరించి వుండేవాడిని!" కటువుగా అని, ఇక అక్కడ ఉండటం ఇష్టంలేనట్లుగా వాష్‌బేసిన్ దగ్గరకు వచ్చేశాడు.

కావాలని చిన్నగా మొహం కడుక్కుంటూ చాలాసేపు అక్కడే ఉండిపోయాడు. పదినిముషాల తరువాత ముఖాన్ని తువ్వాలతో తుడుచుకుంటూ వస్తే, మల్లిక తలను మోకాళ్ళమీద పెట్టుకు కూర్చొని వున్నది. చిన్నగా తలను అటూఇటూ ఊపుతున్నది కూడా.

ఏడుస్తున్నదేఁవో అనుకుండేటప్పటికి ఆమె మీద జాలివేసింది.

"ఏడుస్తున్నారా?"

మల్లిక తలెత్తి, "ఏడిస్తేగాని మీరు కాఫీ తెచ్చి ఇవ్వరా?" నవ్వి అన్నది.

గిరిబాబుకు కోపమొచ్చింది. ముఖం ముడుచుకొని తన సూట్కేసు దగ్గరకు వెళ్ళాడు.

వెనుకనుంచి, "కాస్త మీ పేస్టు ఇవ్వండి... వేలుమీద వేసుకొని రుద్దుకొని నీళ్ళు పుక్కిలించి ఉమ్మేస్తాను!" అన్నది.

విసురుగా పేస్టును ఆమె దగ్గర పడవేశాడు గిరిబాబు.

"ఆడదాన్ని కోపగించుకునే మగవారు ఎన్నడూ బాగుపడరు!"

రోషంగా ఆమె ముఖంలోకి చూచాడు.

బుగ్గలు సొట్టలు పడేలా నవ్వినా, అవి ఆ సమయంలో అంత అందంగా ఉన్నట్లనిపించలేదు– అలా నవ్వేసి ముఖం కడుక్కునేందుకు వెళ్ళిపోయింది.

'ఈమెకు ఎంత దూరంలో వుంటే అంత మంచిదిలా వున్నది!' అనుకున్నాడు గిరిబాబు.

మల్లిక ముఖం కడుక్కువచ్చి సీటుమీద బాసికపట్టు వేసుకు కూర్చుంటూ, "ప్లీజ్! నా కోసం బయటకు వెళ్ళి ఒక్కసారి ప్రయత్నించండి... ఇప్పుడు బండి కదిలితే మళ్ళీ

స్టేషన్ ఎప్పటికి వచ్చేనో...?" అన్నది జాలిగా గిరిబాబు ముఖంలోకి చూస్తూ.

గిరిబాబు విసురుగా లేచి నిలబడ్డాడు.

"మీ సుఖమూ, మీ సౌఖ్యమే మీకు కావాల్సింది... అంతేనా? ఈ వానలో నేను తడిసి ముద్దయినా ఫర్వాలేదు... కాని, మీకు కాఫీ కావాలి... కాఫీ లేకుండా మీరు ఒక్కక్షణం గడపలేరు!" కోపంతో అరిచాడు.

ఏదో చెబుదామని నోరు తెరవబోతున్న మల్లిక మీదకే, తుఫాను గాలిని వదిలినట్లుగా చటుక్కున తలుపు తీసి, బయటకు దిగుతూనే గిరుక్కున మూసివేశాడు.

మల్లిక అతడు వెళ్ళిన వైపుకే నోరు తెరుచుకు చూస్తూ వుండిపోయింది.

తరువాత చిన్నగా లోలోనే నవ్వుకున్నది.

గిరిబాబు కేకలకు పక్కభాగంలో ఆమె తల ఇవతలకు పెట్టి, 'ఏంవైంది?' అన్నట్లుగా చూచింది.

మల్లిక అది గమనించి నవ్వుతూ, "నేను కాఫీ లేందే బ్రతకలేను... తలపోటు వచ్చేస్తుంది... తెమ్మన్నానని ఆయనకు కోపం!" అన్నది.

ఆమె నవ్వింది. "ఆయనకు లేదా ఆ అలవాటు?"

"ఉన్నా మగవాళ్ళు కదా..ఆపుకోగలరు!" ముఖం ప్రక్కకు తిప్పుకొని నవ్వుకున్నది.

"కావాలంటే ఫ్లాస్క్ వున్నది... తీసుకోండి!"

"థాంక్స్... మీ పిల్లలకు ఏం చేస్తున్నారు?"

"ఏదో ఏర్పాటు చేయాలి. బయటకు వెళ్ళాలంటే భయంగా వున్నది!" ఆమె అదోలా నవ్వింది.

"వారెలాగూ వెళ్ళారు... ముందు చెబితే తెచ్చేవారు కదా!"

ఆమె పెద్దగా నవ్వింది. "మీకంటే తప్పదు... మాకోసం కూడా ఆయనను

ఎక్కడ తిప్పలు పెడతారు... మావారు వెళ్ళి వస్తారు లేండి!"

తలుపు తెరుచుకున్న శబ్దమవ్వటంతో ఆశగా అటు ముఖం తిప్పింది మల్లిక. గిరిబాబు లోపలకు వస్తూనే తలుపు బిగించి, దానికి ఆనుకొని నీరసంగా నిలబడిపోయాడు కళ్ళు మూసుకొని.

మల్లిక ఆదుర్దాగా లేచి నిలబడింది.

"ఏ౦వైంది?"

కోపంతో ఒక్కసారి మల్లిక ముఖంలోకి చూచి భారంగా శ్వాసపీల్చాడు.

"తడిసి ముద్దయ్యారు... గుడ్డలు మార్చుకొని తల తుడుచుకోండి!"

"కృతజ్ఞుణ్ణి... ముందు కాఫీ తెచ్చారా అని అడుగుతారేమో అనుకున్నాను!"

"కాఫీ ఎక్కడా దొరకలేదని మీ ముఖమే చెబుతోంది... ఇంకా అడగటం దేనికి?" చిన్నగా నవ్వింది.

పుండు మీద కారం చల్లినట్లుగా కసిగా చూచాడు ఆమె మొహంలోకి.

"గుడ్డలు మార్చుకోండి ముందర... తరువాత చూపిద్దురుగాని మీ కోపాన్నంతా నా మీద!"

మల్లికే చొరవతీసుకొని గిరిబాబు సూట్కేస్ తెరిచి లుంగీ, చొక్కా తీసింది. ఓ టవల్ అతని వైపుకు విసిరింది. దాన్ని అందుకొని తల తుడుచుకోసాగాడు.

"నేను పాపిష్టిదాన్ని... మిమ్మల్ని కష్టపెట్టాను!"

"మీకూ హృదయమున్నదన్నమాట!"

"నేను మనిషిని కాదా?" నవ్వింది మల్లిక.

"మీలో వున్నది మగ గుండె అయివుండాలి"

"నాకు తెలిసినంత వరకూ గుండె మార్పిడీ ఇంతవరకూ జరగలేదు!"

గిరిబాబు మాట్లాడకుండా తడిసిన ప్యాంటు విప్పేసి లుంగీ కట్టుకున్నాడు. నీళ్ళుకారుతున్న చొక్కాను వాష్‌బేసిన్ దగ్గరకు తీసుకు వెళ్ళి మెలితిప్పి పిండబోయాడు.

"నేను పిండుతానివ్వండి!" అన్నది వెనగ్గా వచ్చిన మల్లిక.

"అఖ్ఖర్లేదు!"

"నా మీద ఒట్టే!"

వెనక్కు తిరిగి మల్లిక ముఖంలోకి తీక్షణంగా చూచాడు.

"నా మూలంగా మీరు తడిసి ముద్దయ్యారు... ఈ కాస్త పనికే నేను కందిపోను... ఇటివ్వండి!"

విసురుగా వాటిని క్రిందపడేశాడు గిరిబాబు.

ఒక్క క్షణం తరువాత–

"ఇంత శ్రమపడ్డా ఫలితం దక్కలేదు... నా అదృష్టం అంతలో ఉన్నదన్నమాట!" నవ్వింది మల్లిక.

తల తుడుచుకుంటున్నవాడల్లా ఒక్క క్షణం ఆగి మల్లిక ముఖంలోకి చూచాడు.

"మరింకేం చేస్తారు ఇప్పుడు?"

"భరిస్తాను!"

"నన్ను ఇబ్బంది పెట్టకుండా భరించి వున్నట్లయితే చాలా సంతోషించేవాడిని కదా!"

మల్లిక బుగ్గలు సొట్టలు పడేలా నవ్వింది.

"మగవాళ్ళంటే నాకు పరమ అసహ్యం!... అందుకే మిమ్మల్ని ఏడిపిద్దామని... ఈ వానలో, గాలిలో మీరు తట్టుకోలేరని తెలిసీ బయటకు నెట్టాను... ఇప్పుడు నాకు ఎంతో హాయిగా వున్నది!" స్వర్గంలో తిరుగుతూ తాదాత్మ్యం చెందుతున్నట్లుగా

కళ్ళు మూసుకున్నది.

గిరిబాబు వెర్రెత్తిపోయాడు. నిప్పులు కురిపిస్తూ మల్లిక ముఖంలోకి చూశాడు. ఆమెను చూడటమన్నా, ఆమెతో మాట్లాడటమన్నా అసహ్యమనిపించింది. సీటుమీద మరోవైపు తిరిగి తలను చేతులతో చుట్టివేసుకొని పడుకున్నాడు.

మల్లిక పెద్దగా నవ్వింది.

“మీరు మగవారు... అలా అలిగితే ఏం బాగుంటుంది?”

గిరిబాబు మాట్లాడలేదు.

మల్లిక తనలో తానే హేలగా నవ్వుకున్నది.

“లేవండి... మీరు మంచివారు గదూ! నన్ను క్షమించండి!... నేను నోరు జారితే నన్ను తిట్టండి... అంతేగాని ఇలాగే మౌనంగా కోపంతో పడుకుంటే నేను భరించలేను... గడిచిన స్మృతులన్నీ నన్ను చుట్టుముట్టి బేలగా చేస్తయి ... నేను ఏడ్వవలసి వస్తుంది!”

కంఠం గద్గదిగమయింది మల్లికకు.

ఒక్కసారి విసురుగా గిరిబాబు ఆమె ముఖంలోకి చూచి మళ్ళీ పడుకున్నాడు.

మల్లిక అతడి చర్యను ఓరగా చూచింది.

“నాకెవ్వరూ లేరు... నాకున్న వాళ్ళనందరినీ వదిలి ‘దేఁవుడనుకున్న ఆ మనిషితో ఇంటినుండి వచ్చేశాను... ఆ దేఁవుడు రాక్షసుడయి నన్ను నమిలి మింగివేశాడు... అర్ధరాత్రి రైలులో సర్వం మరిచి నిద్రపోతున్న నన్ను ఒంటరిగా వదిలేసి పారిపోయాడు... బి.ఎ.చదివిన నేను ఎంత పిచ్చిదాన్ని అంటే రైల్లో వంటిమీద అన్ని సొమ్ములెందుకు అని దేఁవుడంటే నిజమే కాబోలనుకొని అన్నీ వలిచి ఆ రాక్షసుడి పెట్టెలోపెట్టాను... ఇంతఘోరంగా జీవితంలో మోసపోయిన నేను ఏ ముఖం పెట్టుకొని..ఎవరి దగ్గరయితే నన్ను నేనుగా తయారు చేసుకున్నానో.వాళ్ళ దగ్గరకు వెళ్ళగలను? వాళ్ళను తిరిగి ‘అమ్మా’, ‘నాన్నా’ అని పిలవగలను?... ఉఁహూఁ...

నాకు ఎవ్వరూ లేరు... ఈ భారతదేశంలో నా అంత దురదృష్టవంతురాలు మరొకరు ఉండరు... అటువంటి నా మీదనా మీకు కోపం!... వద్దు... నన్ను క్షమించండి! నాతో నవ్వుతూ మాట్లాడండి, ప్లీజ్!"

గిరిబాబు గుండెల్ని ఆమె మాటలు కదిలించినాయి. జాలి కలిగించినాయి.

"మాట్లాడరుగదూ!... ఇంతగా బ్రతిమలాడుతున్నా మాట్లాడరుగదూ?!" ఆమె కంఠంలో దుఃఖం పొంగుతున్న ట్లనిపించింది.

మనస్సు మాట్లాడమనే పీకుతున్నా, కావాలని బిగుసుకు కూర్చున్నాడు.

"పోనీ, నన్ను ఈ పెట్టెలోనుండి దిగిపొమ్మంటారా?"

గిరిబాబు సమాధానం చెప్పలేదు.

"మౌనం అంగీకారమేగదా!... వెళ్ళిపోతున్నాను... దిగిపోతున్నాను!" సూట్కేసును శబ్దమయ్యేలా చేతిలోకి తీసుకున్నది. "శలవ్!... మీతో గడిపిన ఈ కొద్ది గంటలను మర్చిపోవటం నాకిష్టం లేదు... హృదయంలో భద్రపరుచుకుంటాను... మీకేంవైనా అభ్యంతరమా?"

గిరిబాబు అప్పటికీ మాట్లాడలేదు.

"శలవ్!" విసురుగా అడుగులు వేయసాగింది.

గిరిబాబు ఇక ఆపుకోలేనట్లుగా చటుక్కున లేచి కూర్చున్నాడు.

"మల్లికా!"

మల్లిక ఆగి తల వెనక్కు తిప్పింది.

"ఆ గాలికి నేనే ఆగలేకపోయాను!"

"మీకు బ్రతుకు మీద ఆశ వున్నది గనుక..."

"అంటే?"

దిగులుగా నవ్వి, "నేను ఆ గాలిలో కొట్టుకుపోయినా వచ్చే నష్టమేఁవున్నది... నా కోసం దుఃఖించే వాళ్ళు ఎవరున్నారని... నాకు నేనే దుఃఖిద్దామన్నా కంటిలో నీరుకూడా కరువయిపోయిందే!" అన్నది.

"మల్లికా!"

"అవును... అందరిచే పరిత్యజింపబడిన నాకు ఈ భీభత్స వాతావరణం కలిగించే నష్టమేఁవున్నది?"

పెట్టెను ఊపేస్తున్న గాలిలో మాటలే సరిగ్గా వినబడటంలేదు.

"కూర్చో మల్లికా!"

"మీకు ఇబ్బంది కలిగిస్తూ దేనికి ఇక్కడ నేను!" ఓ అడుగు ముందుకు వేసింది.

"వెళ్ళబోకు, ప్లీజ్!"

ఒక్కక్షణం సంశయిస్తున్నట్లుగా ఆగి, "హృదయపూర్వకంగా అంటున్న మాటలేనా అవి!" అన్నది.

"అవును!"

"నేను తెలిసీ తెలియక చేసే పిచ్చి పనులకు– నా మీద కోపంతో ఇంకెప్పుడూ మాట్లాడకుండా వుండరు కదా?"

"ఉఁహూఁ..."

"నాతో నవ్వుతూ మాటలు చెబుతుంటారు కదూ!"

"తప్పకుండా!"

చాలాసేపు వాళ్ళ నడుమ నిశ్శబ్దమే రాజ్యం చేసింది. తరువాత మొదట నోరు విప్పింది మల్లికే.

"ఇప్పుడు టైం ఎంతయింది?"

"పదకొండు!"

"మరి, భోజనాలసంగతో?" పదకొండనేటప్పటికి కడుపులో ఆకల్వటం మొదలుపెట్టింది మల్లికకు. "మీరేమైనా అనుకోండి... ఇప్పుడు మీరు తిండి ఏర్పాట్లు చేయక తప్పదు!"

"నేనా?... ఇప్పుడా?"

"మీరు మగవారు... శాస్త్రరీత్యా మీరే గదా ఆ పని నిర్వర్తించవలసింది!" నవ్వింది మల్లిక.

పక్క భాగంలో పిల్లలు ఏడుస్తున్నారు.

ఆ పిల్లల తండ్రి లేచి వచ్చి, గిరిబాబు వంక నవ్వుతూ చూస్తూ, "ఇంతకీ ఇంకెంతసేపు మనకీ బందిఖానా మాస్టారూ?" అన్నారు.

"తెలియదు!" గిరిబాబు నవ్వాడు.

"చూస్తుంటే... లైన్లుకూడా కొట్టుకుపోయి వుండాలి!"

"అయితే మనం ఎలా వెళ్ళగలుగుతాం?" అన్నది మల్లిక ఆయన ముఖంలోకి చూస్తూ.

"అదే చూస్తున్నాను... ఇప్పుడేం చేయాలో నాకూ అర్థం కావటంలేదు... పిల్లలు ఆకలంటూ ఏడుస్తున్నారు!" దిగులుగా నవ్వారు.

"తింటానికి ఏంవీ లేవా?" గిరిబాబు ఆసక్తిగా అడిగాడు.

"అవసరమనుకోలేదు... తెల్లవారేటప్పటికి వెళతాం కదా అని ఏంవీ తేలేదు!"

"అరెరె..."

మల్లిక అన్నది: "చూడండి! మన దగ్గర బిస్కెట్టు ప్యాకెట్‌లో ఇంకా నాలుగయిదు బిస్కెట్లు ఉండాలికదా... అవి ఇవ్వండి!"

"ఉండనీయమ్మా! వాటితో కడుపు నిండేనా పాడా... కాస్త గట్టి పదార్థమే

కావాలి ఇప్పుడు!"

"ఏదో ఒకటి... కొంత ఉపశాంతి!" మల్లిక అని, లేచి గిరిబాబు సూట్కేసు తెరిచి పైనే పడేసి వున్న ప్యాకెట్టును తీసి ఆయన కిచ్చింది.

గిరిబాబు– చొరవగా తన పెట్టెను తెరుస్తున్న మల్లికను విచిత్రంగా చూడసాగాడు. కాని, ఆమెను ఆ ప్రయత్నం నుండి ఏ మాత్రమూ ఆపటానికి ప్రయత్నించలేదు.

"మరి మీకు...?" అన్నాడు ఆయన కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ.

"మేం చిన్నపిల్లలం కాదుగదా!" నవ్వింది మల్లిక.

గిరిబాబు నవ్వుతున్న ఆమె మీదనుండి చూపును మరల్చలేకపోయాడు.

"నా పేరు మల్లిక!... వారి పేరు గిరిబాబు!... మీ పేరు చెప్పండి... ఈ పెట్టెలో మనం చాలాసేపు గడపవలసి వున్నది!"

ఆయనా నవ్వాడు: "నా పేరు సూర్యనారాయణ మూర్తి...! నా భార్య పేరు దమయంతి... మాకిద్దరే సంతానం ... పెద్దమ్మాయి మంజుల... చిన్నవాడు సుధీర్!"

"థాంక్స్!"

సూర్యనారాయణమూర్తిగారు తన భాగంలోకి వెళ్ళిపోయాడు.

"నా తిండి సంగతి ఏమిటాలోచిస్తున్నారు?" అన్నది మౌనంగా తల వంచుకు కూర్చున్న గిరిబాబు ముఖంలోకి చూస్తూ మల్లిక.

"ఇప్పుడు మళ్ళా బయటకు వెళ్ళిరావాలా?..." భయం భయంగా అడిగాడు.

"మీరు భోజనం చేయకుండా ఉండగలరా?"

"అవసరమొస్తే..."

"నేను మాత్రం ఉండలేను!"

"ఇప్పుడు ఎక్కడ దొరుకుతుందని నన్ను ప్రయత్నించమంటారు?"

"స్టేషన్ పక్క ఊళ్ళేంవీ లేవా?"

"వాళ్ళు పెడతారా మనకు?"

"ఇళ్ళు ఉంటే హోటల్ వుండదా అని!"

"ఇందాక క్రిందకు వెళ్ళినప్పుడు చూచాను... కనుచూపు మేర నాకు ఇళ్ళెక్కడా కనబడలేదు!"

"అయితే నా ఆకలి ఎలా తీరుతుంది?"

"మరి బిస్కెట్లుకూడా ఇచ్చేస్తివి!"

"అవి వుండీ ఏ మూలకి... పాపం పిల్లలయినా తింటారు!"

"ఓ పని చేయండి... కడుపునిండా మంచినీళ్ళు త్రాగి, కాళ్ళు పొట్టలో పెట్టుకొని మీ సీటు మీద పడుకోండి... కావాలంటే నా రగ్గు ఇస్తాను... నిండా ముసుగు పెట్టేయండి!"

మల్లిక విషాదంగా నవ్వింది. "అలా చేసి ఆకలినయితే చంపుకోగలను కాని... పడుకోగానే ఆ రాక్షసుడు గుర్తుకు వస్తాడు... మానాన్న గుర్తుకు వస్తాడు... మా అమ్మ గుర్తుకు వస్తుంది... నాకు ఏడుపు వస్తుంది!"

"మల్లికా!"

"నిజం! నేను ఖాళీగా కూర్చుంటే నాకు పిచ్చెక్కుతుంది!... నన్నెప్పుడూ అలా వంటరిగా నా ఆలోచనలకు నన్ను వదలవద్దు!" తల అడ్డంగా ఊపసాగింది. మసక వెలుగులో చెవి రింగులు భయంతో అటూ ఇటూ ఊగుతున్నట్లుగా చూచాడు.

అతడి హృదయాన్ని మల్లిక మీద జాలి ఆవరించింది.

తదేకంగా ఆమె ముఖంలోకి చూస్తూ కూర్చున్నాడు.

"ఏంవిటి ఆలోచిస్తున్నారు?"

"నీ మాటలు వింటుంటే నాకు దిగులు వేస్తోంది!"

"నా కంటే కూడానా?"

"నీకెంత దిగులుందో నాకయితే తెలియదుగాని... నీ మాటలు మాత్రం నన్ను కదిలించి వేస్తున్నాయి!"

శూన్యంలోకి చూస్తూ మల్లిక, "మీరు నా మీద అంత ఆత్మీయత కురిపించవద్దు... నాకు ఏడుపు వస్తోంది!" అన్నది బరువుగా.

"మల్లికా!"

"అవును గిరిబాబూ!... నా మీద అంత జాలి కురిపించవద్దు... తరువాత మీరే ఇబ్బందులో పడతారు... అసలే నేను మంచిదాన్ని కాదు!" గుండె రాయి అవ్వగా నొక్కినొక్కి అన్నది.

పక్క భాగంలో మంజులా, సుధీర్ ఏడుస్తున్నారు.

"వాళ్ళకు బిస్కెట్లు చాల లేదల్లే వున్నది... ఇంకా ఏడుస్తున్నారు!" అన్నది మల్లిక జాలిగా.

"ఎలా చాలతయి... నిన్న సాయంత్రం తిన్న తిండ్లు... నీకే అంత ఆకలిగా వుంటే... చిన్నపిల్లలు వాళ్ళు..."

"మీరు ఒక్క పని చేయగూడదు... కాస్త నాలుగు పెట్టెలూ తిరిగి ఎవరి దగ్గరైనా పాలపిండి దొరుకుతుందమో తెస్తే... పాలు కలిపి ఇవ్వవచ్చుగదా!"

"వేడి నీళ్ళు మాత్రం ఎక్కడ దొరుకుతయి... పాలు కలిపేటందుకు!"

మల్లిక నవ్వింది. "మీకు జనరల్ నాలెడ్జి చాలా తక్కువ స్మీ... ఇంజన్ దగ్గర దొరకవా?"

గిరిబాబు ముఖం కొద్దిగా ఎర్రబడింది.

అతడు కోపంతో ఏదో అనబోయేలోగానే మల్లిక చటుక్కున చీర చెంగును తలమీదకు లాక్కొని, పెట్టెలోనుండి దిగి ప్లాట్‌ఫాం మీద కాలు పెట్టింది.

గిరిబాబు కోపాన్ని నిగ్రహించుకోలేకపోయాడు.

మల్లికకు ఇక ఏమాత్రము అలుసివ్వకూడదు... ఏం చూసుకొని ఈ విధంగా మాట్లాడుతుంది... ఎంత పరిచయ మున్నదని అలా మాట్లాడుతున్నది?

ఛ! ఛ! ఈ ప్రయాణం తనకు ఎంత ఇబ్బంది కలిగిస్తున్నదో, ఈ మల్లికా అంతగా కలిగిస్తున్నది!

చంద్రానికి కోపమొచ్చినా ఈ వివాహానికి బయల్దేరకుండా వుండవలసింది... ఈ వానలో, ఈ తుఫానులో, ఈ భీభత్స వాతావరణంలో ఎప్పటికి తాను హైద్రాబాద్ జేరగలుగుతాడు... అందునా గంట క్రితమే లగ్నం అయిపోయి వుంటుంది!

తలుపు తెరుచుకున్న చప్పుడయింది. లోపలకు కొద్దిగా వెలుగుకూడా జొరబడింది.

కళ్ళమీద చేతులు తీయబోయి కావాలని మానుకున్నాడు.

మల్లికతో మాటలు తగ్గించాలి!

"చూశారా! ఇదుగోండి పాలపొడి... వెంటనే ఇంజన్ దగ్గరకు వెళ్ళి నీళ్ళు పట్టుకురండి!"

గిరిబాబు మాట్లాడలేదు./

"అదేమిటి... అప్పుడే నిద్రకూడా పట్టిందా?"

గిరిబాబు కదలలేదు.

"నిద్ర పడితే సరే! కోపంతో పడుకుంటే మాత్రం ఊరుకునేది లేదు... లేవండి!" అని గిరిబాబు చేయి పట్టుకు లాగింది.

గిరిబాబు విసురుగా, "ఏంవిటి?" అన్నాడు.

మల్లిక నవ్వింది. బుగ్గలు సొట్టలు పడేలా నవ్వింది.

"లేవరా?"

"దేనికి?" ఇంకా కోపంగానే వున్నది కంఠం.

"నీళ్ళు పట్టుకురండి... పాపం! పిల్లలు ఎలా ఏడుస్తున్నారో చూడండి!"

"నువ్వు తేగలవు కదా... నేను దేనికి?"

"ఇంజనులో మగవాళ్ళుంటారు బాబూ... నల్లగా... వాళ్ళను చూస్తే నాకు భయం!"

"నీకు భయమా?"

"కాదా మరి!" మురిపెంగా అన్నది.

కొద్దిగా గిరిబాబులో కోపం తగ్గగా... మల్లిక చేతిలో వున్న తన చేతిమీదకు దృష్టి మరల్చాడు!

–బంగారు తీగల్లా వున్న ఆమె వేళ్ళు తన వేళ్ళను నొక్కుతున్నాయి.

చెయ్యి లాగేసుకున్నాడు.

కలవరపడింది మల్లిక.

"క్షమించండి!"

"నన్ను విసిగించబోకు... నేను నీళ్ళు తీసుకురాను!"

"నిద్ర వస్తున్నదా?"

"నీకు అనవసరం అదంతా!"

"అంటే నేనంటే కోపంగా వున్నదన్నమాట... అయితే మీరే తీసుకురావాలి! ఉఁహూఁ... తప్పదు!"

అతడికి మరో మాటకు అవకాశమివ్వకుండా మళ్ళీ పక్క భాగంలోకి వెళ్ళింది.

"చూడండి సూర్యనారాయణమూర్తి గారూ! మీ దగ్గరున్న ఆ మరచెంబును ఆయన కివ్వండి... ఇంజన్ దగ్గర నీళ్ళు పట్టుకు వస్తారు... నేను ఫస్ట్‌క్లాస్

కంపార్టుమెంట్‌లో వున్న ఎవర్నో బ్రతిమలాడి కాస్త పాలపిండి, పంచదార తీసుకు వచ్చాను... కలిపి పిల్లలకిద్దాం!"

"నేను తెస్తానమ్మా!... పడుకున్నారేమో ఆయన్ను ఇబ్బంది పెట్టటం దేనికి!"

"ఇబ్బంది ఏం వున్నది... వెళ్ళి వస్తారు లేండి... మీరు ఆ బురదలో వెళ్ళలేరు!"

ఆయన నవ్వారు. "ఆయన మాత్రం ఎలా వెళ్ళ గలుగుతారు?"

ఆయన చెప్పేది వినిపించుకోకుండానే మరచెంబును తీసుకు వచ్చి గిరిబాబు పక్కగా పెడుతూ, "ఊఁ... ఇక లేవండి!" అన్నది.

గిరిబాబుకు ఏం చేయాలో అర్థం కాలేదు.

కోపం కట్టలు తెంచుకు ప్రవహిస్తున్నా, పక్కనున్న మనుష్యుల ముందు లోకువవ్వటం ఇష్టం లేదన్నట్లుగా ఆ మరచెంబును తీసుకొని లేచి నిలబడ్డాడు!

* * *

సాయంత్రం మూడుగంటలు దాటి అరగంటయింది. ఉదయాన ఉన్న జల్లు ఇప్పుడు లేదు. గాలీ అంతగాలేదు.

పన్నెండు గంటలప్పుడు కోపంతో బయటకు వెళ్ళిన గిరిబాబు తరువాత అంత కోపంతోనూ పెట్టెలోకి వచ్చి– దుప్పటి కప్పుకు పడుకున్నాడు.

మల్లిక అతడి చర్యకు లోలోనే నవ్వుకున్నది. కానీ మాట్లాడించలేదు.

కంపార్టుమెంటు తలుపు తీసి వున్నది. ప్లాట్‌ఫాం వైపుకున్న కిటికీ తలుపులు తీసి వున్నాయి.

జనం అటూ, ఇటూ నిస్పృహతో, నిరాశతో నల్లబడిపోయిన ముఖాలతో, ఎప్పటికి వెళతామో, ఎట్లా వెళతామో అనే దిగుళ్ళతో వడలిపోయి తిరుగుతున్నారు.

ఉన్నట్లుండి జనంలో అలజడి మొదలయింది.

"విమానం... విమానం..." అంటూ కేకలు వేస్తూ జనం గుంపులు గుంపులుగా

కూడసాగారు.

మల్లిక తలుపు దగ్గరకు వచ్చి నిలబడి మ్రోత అవుతున్న వైపుకు చూచింది...అక్కడ ఒక హెలీకాప్టర్ ఎగురుతూ కనబడింది.

అది రైలు మీదగా అటూ ఇటూ తిరుగుతోంది.

గిరిబాబు కిటికీలోనుంచి బయటకు తొంగి చూచాడు.

మల్లిక అడిగింది: "ఏఁవిటది... హెలీకాప్టర్ ఎందుకు వచ్చింది?"

"ఏఁవో... ఇందాక ఎవరో అన్నం పొట్లాలు వస్తయి అనుకుంటున్నారు... అవేనేమో!"

జనంలో కొంతమంది కుర్రవాళ్ళు నాలుగయిదు పెద్ద గుడ్డలు తీసుకు వచ్చి ఎత్తుగా, అంతగా బురదలేని ప్రదేశంలో పరిచారు.

"మీరెళ్ళి రెండు ప్యాకెట్లు తీసుకు రాగూడదూ...!" అన్నది ఆశగా గిరిబాబు ముఖంలోకి చూస్తూ.

"ఏం, నువ్వు తెచ్చుకోలేవా?" ఇంకా మనిషిలో కోపం తగ్గలేదు, కంఠంలో కరుకుతనమూ తగ్గలేదు.

"తెచ్చుకోలేకనే కదా... మిమ్మల్ని పట్టుకు వేలాడటం!" అన్నది.

గిరిబాబు తదేకంగా మల్లిక ముఖంలోకి చూచాడు.

రాత్రి మొట్టమొదటిసారిగా చూచిన దానికీ, ఇప్పటికీ ఆ ముఖంలో చాలాతేడా వున్నదనిపించింది. ఆ చెంపల్లో రాత్రి నునుపు లేదు. కళ్ళల్లో ఆ వెలుగు లేదు... నిరాహార మవ్వడంతో, డీలాపడిపోయి, నీరసంగా కనబడుతోంది.

సరిగ్గా ఆ సమయంలోనే ఓ యువకుడు కిటికీ దగ్గర నిలబడి లోనుండి లోపలకు చూస్తూ, "ఎవ్వరూ బయటకు రావద్దు... మేమే పొట్లాలు తెచ్చి ఎంతమంది వుంటే అన్ని ఇచ్చి వెళ్తాం!" అంటూ వెళ్ళిపోయాడు.

"హమ్మయ్య! భగవంతుడు నా యందు వున్నాడు!" నిట్టూర్పు విడిచి అన్నది మల్లిక.

గిరిబాబు మాట్లాడకుండా ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

"వినబడలేదా?... మీరు తీసుకురానంత మాత్రాన నేను నిరాహారంగా చచ్చిపోతాననుకున్నారా?" అన్నది కవ్వింపుగా.

"నేనెప్పుడూ అలా అనుకోలేదు... నీముందు నేనెంత?" అన్నాడు ముఖానికి గంటుపెట్టుకొని.

చాలాసేపు ఇద్దరూ మాట్లాడుకోలేదు.

తరువాత మల్లిక తటపటాయిస్తూ, "నా మూలకంగా మీకు చెడ్డపేరు వచ్చేలా వుంది!" అన్నది తలవంచుకొని.

పైపంటితో ఎర్రటి క్రింద పెదవిని నొక్కిపట్టి దిగులుగా నవ్వింది.

"ఏ విషయంలో?"

"ఏ విషయంలో వుంటుంది!... మీరు మగవారు... నేను ఆడదాన్ని!"

ఆమె మాట పూర్తికాకుండానే నలుగురయిదుగురు పెట్టెలోపలకు జొరబడ్డారు. "ఇక్కడ ఎంతమంది వున్నారు... చెప్పాలి త్వరగా, "ప్లీజ్!... ఇవుగోండి మీ ఇద్దరికీ!" అంటూనే ఏవేవో పొట్లాలు వాళ్ళ పక్కన పడేశారు.

మల్లిక వాటిని చూస్తూనే, "థాంక్స్!" అన్నది.

గిరిబాబు పొట్లాలు కూడా తీసి తన వాటి పక్కనే పెట్టింది. "ఇంకా నలభై ఎనిమిది గంటల వరకూ ఈ రైలు కదలకపోయినా నాకు దిగులు లేదు!" అన్నది తేలిగ్గా శ్వాస పీలుస్తూ.

గిరిబాబు ఆమెలోని సంతోషాన్ని ఈర్ష్యగా చూశాడు.

పక్క భాగంలో కూడా పొట్లాలు ఇచ్చి వాళ్ళు వెళ్ళిపోయారు.

మల్లిక తలుపును దగ్గరకు వేసివచ్చి, "ఇక కానీయండి మాస్టారూ! కోపతాపాలు ఎప్పుడూ మనుష్యుల మీదే చూపించాలి... తిండి మీద కాదు... లేవండి!" అన్నది నవ్వి– అప్పటివరకూ తమని ఆవరించిన గంభీర వాతావరణాన్ని తేలిక పరుస్తున్నట్లుగా.

"నాకు లక్షసార్లు చెప్పే అలవాటు లేదు... నేను తినను... నేనేం నీలాగా ఆకలితో చచ్చిపోవటం లేదు!"

"నిజం! నన్ను మాత్రం ఆకలి చంపేస్తోంది... నేను ఆగలేను... నేను తింటున్నాను!" మనస్సు కష్టపెట్టుకున్నది. గతం కళ్ళముందుకు దొర్లుకు రాసాగింది. దుఃఖం పొర్లుకు వచ్చింది. ఆ 'దుర్మార్గుడు' గుర్తుకు వచ్చాడు. "స్వర్గమే మన ముందు జీవితమంతా– అంటూ రమ్మనమన్నాడు... రాజ్యాలు ఏలుదామన్నాడు... తాను రాజయితే నేనే రాణిని అన్నాడు... దౌర్భాగ్యురాలిని వచ్చేదాన్ని వట్టి చేతులతో రాక... ఇంట్లోవున్న సొమ్ములన్నీ ఊడ్చుకు వచ్చాను... నిజాలని నమ్మిన అతడి మాటలన్నీ కల్లలయినయి... రాయంచలా విహరిస్తున్న నన్ను టిక్కెట్టు కలెక్టర్ లేపి టిక్కెట్టు అడిగేంత వరకు నన్ను నేనే గుర్తించలేకపోయాను... అలా గుర్తించేటప్పటికి మిగిలింది ఈ బురదలో ఒంటరినైన నేను..." తలను అటూ ఇటూ బరువుగా ఊపసాగింది.

గిరిబాబు మాట్లాడలేదు.

ఆమె మాటలు అతడిని ఏ మాత్రమూ కదిలించలేదు.

ఒక్కక్షణం అతడి మొహంలోకి రోషంగా చూచి, గతాన్నంతా మర్చిపోయినంత ధీమాగా ఒక్కసారి తల ఎగరవేసి, "నేను మల్లికను... మరొకరికి లొంగే మనిషినికాను!" అంటూనే సాంబారుపొట్లం విప్పి హడావుడిగా రెండు ముద్దలు తిన్నది.

ఒక్కసారిగా కొరబోయినట్లయింది. ఎందుకో వెగటు వేసింది. నిరాశగా శూన్యంలోకి చూస్తూ, "నేను తినను... నా నోటికి అసహ్యంగా వున్నది!" అన్నది నీరసంగా.

గిరిబాబు నవ్వాడు.

మల్లిక విసురుగా లేచింది.

"నాకు అన్నం సహించక నేను ఏడుస్తుంటే మీరు నవ్వుతున్నారా?... నా బాధ మీకు తెలియదు... లోపల ఆకలి పేగుల్ని కొరుక్కు తింటోంది... పొట్ట ఎండుకుపోయి మంటతో మాడిపోతోంది... అటువంటి నన్ను జూచి మీరు నవ్వుతున్నారా?... మీకు జాలిలేదూ?... మీరు మనుష్యులు కారూ!" తలను అటూ ఇటూ విసురుగా ఊపసాగింది.

విభ్రాంతిగా గిరిబాబు ఆవేశ పడుతున్న మల్లిక ముఖంలోకి చూచాడు.

"మీ మగవాళ్ళెంత రాక్షసులో ప్రతి సంఘటనా నాకు ఋజువు చేస్తోంది... ఆకలితో నకనకలాడుతున్న నేను ఈ పొట్లంలో కూడు తినలేక విలవిలలాడుతోంటే ఎగతాళిగా నవ్వుతున్నారు కదూ... నవ్వండి... నవ్వండి!" తల ఎగరవేసింది విసురుగా.

ఆమె కళ్ళనుండి కారుతున్న నీరు అతడిని తన తొందరపాటుకు పశ్చాత్తాప పడేలా చేసింది.

"మల్లికా! క్షమించు!"

"మీ మగవాళ్ళకు ఇది మాత్రం తెలుసు!"

ఏడుపు ఆగలేదు.

గిరిబాబు ఆదుర్దాగా, "మల్లికా! ఏడ్వబోకు!" అన్నాడు నెమ్మదిగా.

గిరిబాబు లేచి ఆమె భుజం మీద చేయి వేస్తూ, "ఏఁవిటిది?... చిన్న పిల్లవా నువ్వు... పరిస్థితులు ఇలా ఉన్నప్పుడు ఓర్చుకోక తప్పదు మరి!" అన్నాడు అనునయంగా.

"ఉఁహూఁ... నా కడుపంతా మంటతో నిండిపోయి వున్నది... నేను భరించలేనంత బాధగా వున్నది!"

"అది వదిలేసి... కాస్త పెరుగన్నం తిను!" మనిషిని సంపూర్ణంగా జాలి

ఆవరించగా, గిరిబాబు పెరుగు పొట్లం విప్పదీసి ఆమె ముందు ఉంచాడు. "తిను!"

"నాకొద్దు!"

"కొద్దిగా..చూసి బాగుంటేనే ఇంకాస్త తిందువుగాని!"

గుడ్లనీరు కుక్కుకుంటూనే కొద్దిగా తిని, "అబ్బ... పుల్లగా వున్నది!" అన్నది.

గిరిబాబుకు మల్లిక చిట్లించిన ముఖంతీరు నవ్వు తెప్పించింది. అయినా బిగపట్టుకుంటూ, "నీకు ఇప్పుడు తోడు పెట్టిన పెరుగుతో అన్నంకలిపి, పొట్లాలు కట్టి పంపిస్తారనుకున్నావా... ఇవైనా దొరికినయి... సంతోషించు!... అందులో కాస్త నీళ్ళు పోసుకున్నావంటే ఆ పులుపు విరుగుతుంది... మాకు హాస్టల్లో ఎప్పుడూ అలవాటే ఇది!" అన్నాడు.

మల్లిక కసిగా గిరిబాబు ముఖంలోకి చూచింది.

* * *

ఆరోజు ఎలా గడిచిపోయిందో వాళ్ళకు తెలియలేదు. నీరసం శరీరాలను ఆవరించగా నిద్రకు దాసులయ్యారు. కళ్ళు తెరిచేటప్పటికి ఇంకా అంతా చీకటిగానే కనిపించింది. రేడియం డయల్ ఆటోమేటిక్ గడియారం ఆరు గంటలు చూపిస్తోంది.

గిరిబాబు సీటుమీదనుంచి లేచి తలుపు దగ్గరకు వచ్చి, హ్యాండిల్ మీద చేయివేసి, పై బోల్టును క్రిందకు లాగి, తలుపును లోపలకు లాగాడు.

తెల్లవారింది... ప్లాట్‌ఫాం మీద జనం తిరుగుతున్నారు!

ఓ పది నిముషాలు ఆ చల్లగాలిలో స్వేచ్ఛగా బయట అటూ ఇటూ తిరిగి పెట్టెలోకొచ్చేటప్పటికి మల్లిక లేచి కూర్చొని వున్నది.

"హమ్మయ్య! వచ్చారు గదా!" అన్నది గిరిబాబును చూస్తూనే ఓ దీర్ఘనిశ్వాసం విడిచి.

"ఏంవైంది?" అన్నాడు ఆదుర్దాగా, ఆమె ముఖంలోకి చూస్తూ.

"లేవగానే కనబడకపోతే భయపడ్డాను!" అన్నది నవ్వి.

"భయం దేనికో?!" అన్నాడు రెట్టిస్తున్నట్లుగా. చేతిలో వున్న వేప పుల్లను ఆమె ముందు పడేశాడు.

"ఏంవో నాకు తెలియదు... మన పరిచయం అయి కొన్ని గంటలే అయినా, నా గుండెల్ని మీమీద ఆత్మీయతే చుట్టివేస్తోంది... మిమ్మల్ని నాకు చాలా దగ్గరి వారినిగా చేస్తోంది!" నిరాశాపూరిత కంఠంతో చిన్నగా గొణగసాగింది.

గిరిబాబుకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఆమె మాటలు అతడిలో కొద్దిగా సంచలనాన్ని కలిగించినయి. తదేకంగా ఆమె ముఖంలోకి చూచి, తన సీటుమీద కూర్చుంటూ, "మొహం కడుక్కో!" అన్నాడు ఆత్మీయంగా.

"కడుక్కొని?..." ఒక్కక్షణమాగి, "కాఫీ ఏమైనా ఇప్పించే ఏర్పాటు చేయగలరా?" అడిగింది నవ్వుతూ.

గిరిబాబు నవ్వాడు.

"ఎక్కడనుంచి తెచ్చేది?"

కిటికీలోనుంచి బయటకు చూస్తూ, "ప్రస్థుతం వాన లేదు... ఈ ప్రదేశాన్ని ఆవరించిన వెలుగును చూస్తే ఇప్పుడిప్పుడే అలాంటిది వచ్చేటట్లు కూడా లేదు... ప్రక్కనే ఎక్కడైనా ఊరు ఉన్నదేమో వెళ్ళి వద్దాం పదండి!"

రెండు రోజులబట్టీ బంధిఖానాలా వున్న ఆ రైలు పెట్టెకు కాసేపు దూరంగా తిరగాలని అతడి మనస్సూ కోరుకుంటోంది. అందుకే, "పద... అలాగే వెళ్దాం!" అన్నాడు ఉత్సాహంగా.

మల్లికా హుషారుగా లేచింది. ముఖం కడుక్కున్నది. సూట్కేసులోనుంచి అద్దాన్ని, దువ్వెనను తీసింది.

గిరిబాబు నవ్వాడు. "ఇప్పుడు అలంకరణ దేనికి?"

"నేను ఆడదాన్ని... అందునా లేచి వచ్చిన దాన్ని!" జాలిగా నవ్వింది.

"నేనా ఉద్దేశ్యంలో అనలేదు!" చిన్నబుచ్చుకున్నాడు గిరిబాబు– ఆమె ఎదురుగా కూర్చోవటం ఇష్టం లేదన్నట్లుగా వచ్చి తలుపు దగ్గర నిలుచున్నాడు.

మల్లిక లోలోనే నవ్వుకున్నది.

తల దువ్వుకొని, ముఖం కడుక్కు వచ్చి, చెంపలు సరిచేసుకొని, పౌడరు రాసుకొని, కుంకుమ పెట్టుకున్నది.

గిరిబాబు వెనగ్గా నిలబడి, "రెడీ!" అన్నది.

గిరిబాబు పెట్టె దిగాడు.

మల్లిక మళ్ళా లోపలకు వచ్చి పక్క భాగంలోకి వెళ్ళి, "మేం అలా ఊళ్ళోకి వెళ్ళి వస్తాం... మా పెట్టెలు కాస్త చూస్తుండండి... లోపల బోల్టు వేసుకుంటారా?" అని చెప్పేసి, అప్పటికే కప్పులేని స్టేషన్ ఆవరణలో నడుస్తున్న గిరిబాబును కలుసుకున్నది.

* * *

వాళ్ళ అదృష్టమా అన్నట్లుగా అక్కడికి మైలు దూరంలో ఓ ఊరు ఉన్నది. ఆ ఊరికి ఓ దేఁవుడులాంటి ప్రెశిడెంటు ఉన్నాడు. ఆ ప్రెశిడెంటుకు ఓ కామధేనువు, కల్పవృక్షము కూడా వున్నయి. అంతకు మించి పెద్దలు సంపాదించి ఇచ్చిన ఓ అక్షయపాత్రా వున్నది.

ఇంకేం కావాలి?

ఉఁహూఁ... కావాల్సిందే ఆయనకు లేదు. ఆయనకు అచ్చట్లు ముచ్చట్లు తీరనేలేదు. ఆయన అతి ముఖ్యమైన కోరిక ఈడేరనే లేదు. ఆయన దిగులుకు అంతమే లేదు. ఆయన పూజించని దేఁవుళ్ళే లేరు. ఆయన కట్టించుకోని తాయిత్తులే లేవు... ఆయనకు పిల్లలు లేనే లేరు!

ఆగిపోయిన రైలు, అందులోని ప్రయాణీకుల సంగతీ తెలియగానే ఆ ఇంటిని సత్రం చేశాడు. ఇంట్లో వున్న బియ్యాన్ని అన్నంగా మార్పించాడు. ఊళ్ళో వున్న కూరలు అన్నీ తెప్పించాడు. రోజురోజుకూ పెరిగిపోతున్న డబ్బును ఓ ధర్మకార్యానికి

ఖర్చు పెడుతున్నంత ఆనందంగా మంచి నీళ్ళలా ఖర్చుపెట్టసాగాడు.

మల్లికను, గిరిబాబునూ చూస్తూనే, “ఆది దంపతుల్లా వున్నారు… రండి! రండి!… మీ ఇద్దరి నడుమా ఒ పాప తప్పటడుగులు వేస్తుంటే ఇంకెంత బాగుండేదో!” అంటూ మురిసిపోయాడు.

ఆయన మాటలు వింటూనే గిరిబాబు శిలయిపోయాడు. మల్లిక ముఖం ప్రక్కకు తిప్పుకున్నది. గిరిబాబు ఏదో అనబోయాడుగాని మల్లిక అతడి చేయి పట్టుకు లాగుతూ కాఫీ కప్పుల వంక నడవసాగింది. గిరిబాబు విదిలించి వేశాడు– ముఖమంతా కందగడ్డలా అవ్వగా.

లోపలకు వెళ్ళినా ముళ్ళమీద కూర్చున్నట్లే ఫీలవ్వసాగాడు. ‘ఇదెక్కడి ఖర్మ తనకు’ అని పదేపదే అనుకోసాగాడు.

మల్లిక అంటే ద్వేషం కళ్ళల్లోనుండి పొగలా వెలికి వస్తోంది.

“ఛ! ఛ! నలుగురూ ఓ లేచి వచ్చిన మనిషిని తన భార్య అనుకోవాలా?”

వళ్ళు గగుర్పొడిచింది. ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా ఈ స్త్రీనుండి తను తప్పుకోవటం ఎంతయినా మంచిది!

దానికి తోడు ఆ గదిలో ఎవ్వరూ లేకుండా చూసి, “మీరు కాసేపు పడుకోండి! కాళ్ళు పీకుతున్నయ్యేమో… నేను ఒత్తుతాను!” అన్నది మల్లిక– నవ్వును బిగపట్టుకుంటూ.

“మల్లికా!” ఆవేశంగా అన్నాడు.

“ఉండండి బాబూ! నాకు నవ్వాగటంలేదు!” ఇక నవ్వును ఆపుకోవటం ఇష్టం లేదన్నట్లుగా నోరు తెరిచేసింది గిరిబాబు వంటికి కారం రుద్దుతున్నట్లుగా, “నలుగురి దృష్టిలో మీరే నాకు నాధులు ఈ క్షణాన!” అన్నది.

తరువాత అతడు అంత దూరం నుంచి వచ్చినా ఒక్క గుక్కెడు మంచినీళ్ళు కూడా త్రాగలేదు. పిడికెడు అన్నం తినలేదు. అంతేకాదు ఇక మల్లికతో తరువాత మళ్ళీ రైలు పెట్టె దగ్గరకు వచ్చేటంత వరకూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

– ఏ ముక్కూ, మొహం తెలిసినవాడో, తననూ మల్లికనూ చూచి, ఇలాగే అనుమానించి, నలుగురిలోనూ తన మీద జీవితాంతం చెరిగిపోని ఓ చెడు ముద్ర వేయవచ్చు కూడా!

శరీరాన్ని భయం వణుకులా ఊపింది.

పెట్టెలోకి ఎక్కుతూనే, అప్పటివరకూ మనస్సులో గూడుకట్టుకున్న ఆలోచనలకు ఓ రూపం ఇస్తున్నట్లుగా, సీటు మీద వున్న పుస్తకం, గుడ్డలు తీసి సూట్కేసులో కుక్కేశాడు.

గిరిబాబు ముఖంలోకి భయం భయంగా చూస్తున్న మల్లిక ఇక ఆగలేనట్లుగా, "ఏఁవిటది?" అన్నది.

గొంతులో భయపు జీర స్పష్టంగా వినిపిస్తోంది.

"నేను వెళ్ళిపోతున్నాను!"

"నన్ను ఈ సముద్రంలో వదిలా?"

"నీకూ నాకూ వున్న సంబంధమేఁవిటి?" అన్నాడు తీక్షణంగా చూస్తూ.

"లోకులు కాకులు... వాళ్ళు లక్ష అనుకుంటారు... వాళ్ళ మీద కోపమంతా నా మీద చూపించాలా?"

గిరిబాబు అసహ్యంగా ఆమెను చూస్తూ ఏదో అనబోయాడు గాని, సరిగ్గా ఆ సమయంలోనే సూర్యనారాయణ మూర్తిగారు ఆ పెట్టెలో కెక్కుతూ, "గిరిబాబుగారూ! ఇందాకటి నుండి మీ కోసమే ఎదురు చూస్తున్నాను!" అన్నారు.

గిరిబాబు ఆయన ముఖంలోకి ఏఁవిటన్నట్లుగా చూచాడు.

మల్లిక తలుపు దగ్గరకు పరుగెడుతున్నట్లుగా వెళ్ళింది.

తీసివున్న తలుపు దగ్గర రెండు చెవులూ మూసుకొని ముందుకు వంగి కూర్చున్నది. ఆమెకు కడుపులో తిప్పుతున్నది. ఆమె ముఖం భయంతోనూ, బాధతోనూ,

అసహ్యంతోనూ, దిగులుతోనూ పీక్కుపోయింది. ఆమెకు కళ్ళు తిరుగుతున్నాయి. తలంతా బరువుగా, ఏదో కొండరాయి నెత్తిమీద పెట్టినట్లుగా వున్నది... ఆమెకు ఏ క్షణాననైనా వమనమవ్వవచ్చు!

సూర్యనారాయణగారు మల్లిక అవస్థను గమనిస్తూనే, "దమయంతీ! ఇలా రా త్వరగా!" అన్నారు భార్య నుద్దేశించి.

గిరిబాబుకు ఏం చేయాలో అర్థం కానట్లుగా మల్లికను చూస్తూ ఉండిపోయాడు. ఈ వానలో ఓ రోజంతా నిరాహారంగా వుండి తిన్నమీదట కాదుగదా?... అది ఏ కలరాలోకో దించితే!...

ముఖమంతా చెమటలు పట్టసాగింది.

మల్లిక తేరుకున్నట్లుగా లేచి వచ్చి, "అదేంవిటి... అలా దివాలా తీసిన ముఖం వేశారు... కాస్త డోక్కున్నంత మాత్రాన మీ మల్లికేం కందిపోదులేండి!" అని పెద్దపెట్టున నవ్వింది... అలా నవ్వినప్పుడు ఆమె మెదడులోని నరాలు భయంగా 'ఫట్ ఫట్' మనసాగినయి.

సూర్యనారాయణమూర్తిగారి భార్య, ముఖానికి చెంగు అడ్డుపెట్టుకొని, మల్లిక మాటలకు సిగ్గుగా, గిరిబాబు ముఖంలోకి ఓరగా చూస్తూ భర్తకేదో సైగ చేస్తూ నవ్వింది.

ఆయన భార్య సంకేతాల్ని అర్థం చేసుకున్నట్లుగా ఫక్కున నవ్వాడు. "ఏం భయం లేదులేవయ్యా గిరిబాబూ!... అది అంతేలే... నువ్వు గాభరా పడబోకు!"

పళ్ళు బిగపడుతూ, ముందుకో అడుగు వేసి, గిరిబాబు, "నేను... నేను..." ఏదో చెప్పబోతుండగానే, మల్లిక మరోసారి ఫక్కున నవ్వి, "సూర్యనారాయణమూర్తిగారు! చెప్పండి... చెప్పండి... ఇందాక ఏదో చెప్పబోయారు!" అంటూ గిరిబాబు ముందుకు వచ్చేసింది.

గిరిబాబు అసహనంగా తల విదిలించేసి, గొణుక్కుంటూ వెళ్ళి తన సీట్లో

కూర్చున్నాడు.

మల్లిక తీయగా, తేలిగ్గా నవ్వి, గిరిబాబు ముఖంలోకి చూస్తూ, "ఆయనకు నాకంటే కూడా భయం ఎక్కువ... అదంతా వాళ్ళ అమ్మ పోలికేలేండి... మీరేం ఖంగారు పడనక్కరలేదు... దానికితోడు ఆయనకు కొద్దిగా బి.పి. వున్నది ... వూరికే ఎక్సయిట్ అయిపోతుంటారు!" అన్నది.

గిరిబాబు కుతకుతా వుడికిపోసాగాడు– తనను మల్లిక ఆటపట్టించేస్తోంది!

ఆవేశంతో విసురుగా లేచి, "నేను నడిచివెళ్దాం అనుకుంటున్నాను!" అంటూనే సూట్కేసును చేతిలోకి తీసుకున్నాడు.

– ఈ పీడాను ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా వదిలించుకోవాలి!

ఛీ! ఛీ!

"నేనూ అదే చెప్పబోతున్నాను... ఒక్క రెండు మైళ్ళ దూరం రైలుపట్టాలమ్మటే నడిచారంటే ఇక మీరు మామూలు ప్రపంచంలో పడ్డట్లే! అందుకే సూట్కేసులు సర్దేయండి... నడుద్దురుగాని!" అన్నాడు సూర్యనారాయణమూర్తిగారు.

మల్లికకు ఆ మాటలు వింటూనే హుషారొచ్చింది. "మరి మీరు?"

ఆయన దిగులుగా నవ్వారు: "అటు వైపు చూడండి... సామానెంత వున్నదో... రైల్వేవారికి దయగలిగేటంత వరకూ మాకీ బంధిఖానా తప్పదు!"

గిరిబాబు ఇక అక్కడ వుండలేనట్లుగా చేతిలో సూట్కేసుతో ఒక్క అడుగు వేశాడు.

"బాబోయ్! ఒక్క క్షణం!" పెద్దగా కేకేసినట్లుగా అన్నది మల్లిక.

''రా అమ్మా రా! తొందరేమీ లేదు...'' పెద్దగా నవ్వారు సూర్యనారాయణమూర్తిగారు. "ఎందుకలా గాభరా పడతావ్?... ఆయన నిన్ను వదిలి వెళతారా ఏం?" అన్నారు.

గిరిబాబు త్వరత్వరగా ఆయన వైపుకు అడుగులు వేస్తూ, "మీరు పొరబాటు..."

అతడి మాట సగం నోట్లో వుండగానే, మల్లిక చేతిలో సూట్కేసుతో వాళ్ళిద్దరి మధ్యా వచ్చి నిలబడి, "పదండి... పదండి... ఆయన మాటల మీద నాకే మాత్రం నమ్మకం లేదు... నన్ను నట్టేట్లో ముంచేస్తారు ఎప్పుడో... నాకు తెలిసినప్పటినుండీ ఆయన తత్వమే అంత!" అని నవ్వింది.

గిరిబాబు పళ్ళు కొరుకుతూ ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

మల్లిక పెట్టె దిగింది. కిటికీలోనుండి చూస్తున్న సుధీర్, మంజులకు 'టాటా' చెప్పింది. దమయంతమ్మగారి వైపు చూస్తూ 'వెళ్ళస్తాం' అన్నట్లుగా తల ఊపింది.

ఆమె గుంభనగా నవ్వి ఊరుకున్నది. మనస్సులోనే మరోసారి, 'విచిత్రమైన జంట' అనుకున్నది.

"నేనంటే కోపంతో కుతకుతలాడిపోతున్నారు కదూ!" అన్నది నవ్వును బిగపట్టుకుంటూ... పదడుగులు వేసిం తరువాత వెనుక నడుస్తున్నదల్లా పక్కకు వచ్చి.

ఆమెతో మాట్లాడటమే అసహ్యమన్నట్లుగా మౌనంగా ఉండిపోయాడు గిరిబాబు.

వాళ్ళిద్దరూ రైలుపట్టాల మధ్యగా వున్న స్లీపర్లమీద అడుగులు వేస్తూ– కాళ్ళు జారకుండా బిగపట్టి నడుస్తున్నారు.

ఫర్లాంగు దూరం వెళ్ళారో లేదో ఓ పెద్ద వంతెన... దాని క్రిందగా ఉరవళ్ళు పరవళ్ళతో పారుతున్న నీరు... దాని నిండా విరిగిన చెట్లకొమ్మలూ, చెత్తా చెదారం...

రోడ్డెక్కాలంటే వంతెనను జారుతున్న స్లీపర్లమీదగా ఎంత ఇబ్బంది పడైనా దాటక తప్పదు...

"కష్టాలలో వున్న ఆడదాన్ని అసహ్యించుకునే వాడెవడూ బాగుపడడు!" అన్నది.

చటుక్కున ముఖం తిప్పి ఆమె వైపుకు చూచాడు.

నవ్వింది మల్లిక.

"ఇందాకనే చెప్పాను... లోకులు కాకులు... వాళ్ళేదో అనుకుంటారు... అంత

మాత్రాన మీరు ఉడికిపోవడం దేనికి?" అంటూనే చేతిలోని సూట్కేసును, వాన నీటిలో నాని, నల్లబడిపోయి, అసహ్యంగా వున్న చెక్క స్లీపర్ మీద పెడుతూ, "నేను మొయ్యలేకుండా వున్నాను బాబూ!... కాస్త పట్టుకురండి... అసలే కాళ్ళు జారుతున్నాయి!" అన్నది.

గిరిబాబు ఒంట్లో కోపం సెగలు పొగలై ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. అందుకు నిదర్శనంగా గట్టిగా మూలిగాడు.

– అతడి తత్వమే అంత!

ఎదురు తిరగలేకపోతున్నాడు... అసలు ఎప్పుడో ఎదురు తిరిగి వుండవల్సింది... ఆమెను ఇంత దగ్గరగా రానీయ కుండానే వుండవలసింది!

తప్పలేదు... ఆమె సూట్కేస్ను కూడా మరో చేతిలోకి తీసుకున్నాడు.

అంత భయంకర వాతావరణంలోనూ పక్కనున్న మల్లికను చూస్తుంటే గిరిబాబుకు కంపరమెత్తుతోంది... ఆ వంతెన దాటుతూ స్లీపర్లమీద జారి, నీళ్ళల్లో పడి, గిలగిలా కొట్టుకు చస్తుంటే చూడాలనిపిస్తోంది.

మల్లిక ఉన్నట్లుండి అతని చేతిని మోచేతిమీదుగా పట్టుకొని, "నాకు కళ్ళు తిరుగుతున్నాయి బాబూ! అలా నన్ను వదిలి ముందుకు వెళ్ళిపోతే ఎలా?" అన్నది బుంగమూతి పెట్టి.

"మల్లికా!" కసురుకున్నట్లుగా అన్నాడు గిరిబాబు.

"ప్లీజ్!"

మల్లిక పట్టుకున్నంత మేరా సూదులతో పొడుస్తున్నట్లనిపించింది గిరిబాబుకు.

సరిగ్గా వాళ్ళిద్దరూ వంతెనకు మధ్యలో నిలబడి వున్నారు.

"ఇంక ఒక్క అడుగు వేయలేను... నాకు కళ్ళు తిరుగుతున్నాయి!" అన్నది ఏడుపు కంఠంతో మల్లిక.

తీక్షణంగా ఆమె ముఖంలోకి చూస్తున్న గిరిబాబుకు, ఆమె కళ్ళల్లో తిరుగుతున్న నీరు జాలి కలిగించింది.

"ఏం చేయమంటావ్ మరి?"

"నన్ను రెండు చేతులతోనూ పట్టుకోండి... లేకపోతే నేను చచ్చిపోతాను!"

"సూట్కేసులో?"

"పోతే పీడా వదిలిపోతుంది!"

"ఇంకెంత దూరం వున్నదని... సగం వచ్చేశాం కదా... కళ్ళు మూసుకు నడిచేశేయ్!"

"ఉఁహూఁ... మీరు తోసేస్తారు నన్ను!"

"మల్లికా!" ఆవేశంగా అన్నాడు.

"నిజం!... నా మీద కోపంతో ఉడికిపోతున్న మీరు నన్ను చంపేస్తారు!"

"ఏఁవిటి! పిచ్చెక్కిందా నీకు?" ఆవేశంగా ఆమె ముఖంలోకి చూచాడు.

ఒక్కక్షణం– నిజంగా ఆ పనే చేసేసి ఆ పీడా వదిలించుకుందామా అనిపించింది గిరిబాబుకు!

వెనుక ఓ నలుగురు కుర్రాళ్ళు వస్తూ వాళ్ళను చూస్తూనే ఆగిపోయారు.

"మీరు ఆ సూట్కేసులు మాకిచ్చి... వారిని పట్టుకు నడిపించండి!" అన్నాడు అందులో ఒకడు చొరవగా.

ఇబ్బందిగా వాళ్ళ ముఖంలోకి చూచాడు గిరిబాబు.

"ఏం ఫరవాలేదు... మా చేతుల్లోనూ అంతగా బరువులేం లేవుకదా... ఇవ్వండి!" అంటూనే ఆ రెండు సూట్కేసులనూ వాళ్ళ చేతుల్లోకి తీసుకున్నారు.

వాళ్ళకు వినబడీ వినబడనట్లుగా, నీరసంగా, "థాంక్యూ!" అన్నాడు గిరిబాబు.

వాళ్ళు పదడుగులు వేసిం తరువాత, "లే!" అన్నాడు మల్లికనుద్దేశించి కఠినంగా. స్లీపర్ మీద కళ్ళు మూసుకు కూర్చున్న మల్లిక చేయి పట్టుకొని గుంజుతున్నట్లుగా పైకి లాగాడు.

క్రింద పారుతున్న నీరు, పైన నడుస్తున్న మనుష్యులను ఊపేస్తున్నట్లుగా... జారిపోతున్నట్లుగా... భ్రమ కలిగిస్తోంది.

"నన్ను రెండు చేతులతో పట్టుకొని నడిపించండి!" అన్నది కళ్ళు రెండూ మూసుకొని, లేచి నిల్చున్న తరువాత.

మనస్సు ఎదురు తిరుగుతున్నా, ఆమెను ఆమె కోరినట్లుగా నడిపించక తప్పలేదు. "నువ్వెవ్వరివని నిన్ను ఇలా నడిపించాలి?" అన్నాడు నాలుగు అడుగులు వేసిం తరువాత.

"ఓ ఆడదాన్ని!... అందునా అందమైన ఆడదాన్ని!" కళ్ళు సగం మూసుకొని అన్నది.

"ఎందుకు... అడుక్కుతిన్నా!"

"కన్నెత్తి పిలిస్తే... ముందు నడుస్తున్న వాళ్ళను చూడండి... వాళ్ళే కాదు... ఎంత మహా పురుషుడయినా సరే.. ఈ నీళ్ళ మీద తేలుతూ, ఊగుతున్న స్లీపర్ల మీద తన ప్రాణాన్ని కూడా లెక్క చేయకుండా వెనక్కు తిరిగి వచ్చి ... నన్ను తన ప్రాణంలా కాపాడుకుంటూ, నా కాలును క్రింద ఆననీయకుండా తీసుకు వెళతారు... తెలుసా?" గీరగా చూచింది.

"ఇంకేం... పిలవరాదా?"

"మిమ్మల్ని వదలడం నాకిష్టం లేదు... మీ అంత మంచివారు నాకింకొకరు దొరకరు!"

"అయితే నేనే వదిలేస్తాను!"

"ఇప్పుడేనా?"

“అవును!”

“ఎలా వదిలేస్తారు?”

“ఇక్కడే వదిలేసి వెళ్ళిపోతాను!”

ఒక్క క్షణమాగి గంభీర కంఠంతో, “నేను రైల్లో ఊగిపోతున్న పెట్టెలో కూర్చొని, పగిలిపోతున్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ, ఏం చెప్పానో గుర్తున్నదా?” అన్నది.

“ఏం చెప్పావ్?”

“ఓ భయంకరమైన ఇరవైనాలుగు గంటలు నన్ను పూర్తిగా మార్చివేసినయి అని... ఓ గండశిలగా చేసి కూర్చో బెట్టినయి అని... ఓ బండరాయిలా...”

“అయితే నాకేం?...”

“సరే... మీరు నన్ను వదిలేసి వెళ్ళిపోండి!”

“బెదిరిస్తున్నావా?”

“చూస్తారుకదా!”

“ఏం చేస్తావ్?’ రెట్టిస్తున్నట్లుగా అడిగాడు.

“అరుస్తాను... కేకలు పెడతాను... జనాన్ని పోగు చేస్తాను!”

“చేసి?” అసహ్యంగా చూస్తూ అన్నాడు.

“మీ భుజం మీద తల ఆనించి, బుడిబుడి దీర్ఘాలు తీస్తూ ఏడుస్తాను...!” అన్నది.

“ఏడిస్తే కరిగిపోతాననుకుంటున్నావా?”

“మీరు కరిగితేనేం... కరగకపోతేనేం... మరో ఆడదాన్ని మరిగి, కట్టుకున్న భార్య ప్రాణాలు తీస్తున్నాడని గోల చేస్తాను... వీలు చిక్కిందిగదా అని నీటిలో తోసేసి పారిపోవటానికి ప్రయత్నిస్తున్నాడని... చూస్తున్న మనుష్యుల గుండెలు కరిగేలా

ఏడుస్తూ... చెప్పేస్తాను!"

"మల్లికా! ఏఁవంటున్నావ్?" ముందుకు వంగి ఆమె ముఖంలో తన ముఖం పెట్టి అన్నాడు.

"అంతేకాదు... లోలోపల మీమీద శాపనార్థాలు కురిపిస్తూ... పైకి అందరికీ కనబడేలా మీ కాళ్ళు పట్టుకొని... నన్ను చంపితే చంపారు, నా మీద కోపముంటే వున్నది, ఏఁవీతెలియని, ఇప్పుడిప్పుడే రూపుదిద్దుకుంటున్న నా కడుపు లోని మీ ప్రతిరూపం మీకేం అన్యాయం చేసింది, మీకేం హాని చేసింది... అంటూ భోరున విలపిస్తాను!"

"మల్లికా!"

వాళ్ళు వంతెనను దాటేంతవరకూ తిరిగి గిరిబాబు మనిషి కాలేకపోయాడు!

వాళ్ళకంటే ముందు వెళ్ళిన కుర్రవాళ్ళు సూట్కేసులను వంతెనమీద పెట్టి ఎదురు చూస్తున్నారు.

"థాంక్యూ వెరీ మచ్... నా మూలకంగా మీకు శ్రమ కలిగింది... ఏఁవీ అనుకోబోకండి... ప్లీజ్!" నవ్వింది... అందంగా, హాయిగా, బుగ్గలు సొట్టలుపడేలా మల్లిక.

గిరిబాబు, మల్లికా ఎవరి సూట్కేసులను వాళ్ళు అందుకున్నారు.

ఆ ఎత్తయిన వంతెన మీదనుండి నలువైపులా ఆశగా చూస్తే, దేవాలయంలో దీపంలా, దూరంగా వారికో గ్రామం ... చెట్లగుబుర్ల నడుమగా కనబడింది... ఆ గ్రామాన్ని కలుపుతూ రైలు పట్టాల పక్కగా ఓ తారు రోడ్డు కనబడింది.

వాళ్ళందరికీ ఆ రెండింటినీ చూస్తూనే ప్రాణాలు లేచి వచ్చినయి!

* * *

రెండు మైళ్ళు నడిచి ఊరిలో కాలు పెట్టేటప్పటికి చల్లటిగాలి ఆ ప్రదేశాన్నంతా

ఆవరించి ఏ క్షణాననైనా వాన పడవచ్చు అనేలా వున్నది.

మల్లిక, గిరిబాబు మాటిమాటికి ఆకాశం వైపు చూస్తూ ఒకళ్ళ మొహంలోకి ఒకళ్ళు చూసుకోసాగారు. వారిద్దరి మనస్సుల్లోనూ భూతాల్లాంటి నల్లటి మబ్బులు ఆకాశాన్ని పట్టినట్లే పట్టి వున్నాయి... ముఖ్యంగా గిరిబాబును!

ఊరి మధ్య కొచ్చేటప్పటికి ఓ పెద్ద పెంకుటి మండువా యిల్లు కనబడటమూ... ఆ పైన పైనుంచి జల్లు పడటమూ ఒకేసారి జరిగినయి.

హడావుడిగా ఇద్దరూ పరుగెడుతున్నట్లుగా అడుగులు వేస్తూ ముందు వసారాలోకి వెళ్ళి నిలబడ్డారు.

వీళ్ళ రాకకోసమే ఎదురు చూస్తున్నట్లుగా అక్కడ కూర్చొని వున్న ఓ ముసలాయన, "రండి... రండి... మీకిదే నా స్వాగతం!" అన్నాడు బోసినోటితో నవ్వుతూ.

"థాంక్స్!" అన్నారు ఇద్దరూ.

ఆయన నవ్వారు. "మీరు చాలా కష్టపడి వుంటారు... కాసేపు విశ్రాంతి తీసుకోండి... ఈలోగా వేణ్ణీళ్ళు పెట్టిస్తాను... శుభ్రంగా స్నానం చేసి, ఆపైన కమ్మటి పండుమిరపకాయల కారం, పెరుగు వేసుకు భోజనం చేయండి ... వద్దన్నా నిద్ర ముంచుకు వస్తుంది... ఇక మీ ఇష్టమొచ్చినంత సేపు నిద్రపోయి లేవండి... వాన తగ్గితే దారి బాగుంటే ముందుకు పోండి... లేదా మా ఇంటినే స్వర్గంలా చేసుకోండి... అయితే ఒక్కమాట!"

"చెప్పండి!" అన్నది మల్లిక ఉత్సాహంగా పండు మిరపకాయల కారాన్ని, పెరుగునూ ఊహించుకుంటూ.

"నన్ను మా ఊళ్ళో అంతా పీనాసీ అంటారు... అననీయండి... అన్నవాళ్ళు వాళ్ళ పాపాన వాళ్ళే పోతారు... కొందరు దురాశాపరుడంటారు... చూశారూ! మీకు ఇన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి నేను నాలుగు రూపాయలు పుచ్చుకుంటే తప్పేఁవైనా వున్నదా మాస్టారూ... ఆఁహాఁ... నాకు తెలియక అడుగుతాను... తప్పుంటే

చెప్పండి... మళ్ళా చస్తే ఆ మాట ఎత్తను... కాసిని మంచి తీర్థం తాగి వెళ్ళిపోండి... నాకేమీ అభ్యంతరం లేదు!"

"అబ్బెబ్బే! మీరు చెప్పింది చాలా బాగుంది... ఆకాశాన్ని ధరలంటుతున్న ఈ రోజుల్లో వెధవది నాలుగు రూపాయలకు ఇన్ని సదుపాయాలు ఎవరు చేస్తారు చెప్పండి!" మల్లిక చొరవగా ముందుకు వెళ్ళింది.

ఆయన విశాలంగా నవ్వారు. "ఒసేయ్ అమ్మీ! అతిథి దేఁవుళ్ళు వచ్చారు... ఏర్పాట్లు చేయి!"

గిరిబాబుకు ముసలాయన ప్రవర్తన కాస్తంత వింతగానే తోచింది. ఇప్పటికే తను ఓ ఊబిలో ఇరుక్కున్నాడు... ఇది మరొకటి కాదుగదా?... సంశయిస్తూ అక్కడే ఆగాడు.

"నా పేరు సీతాపతిరావు... స్కూలు మాస్టరుగా ముప్ఫయి సంవత్సరాలు ఏకధాటిగా చేసి రెండు సంవత్సరాల క్రితం రిటయిరయ్యాను... ప్రస్థుతం నశ్యం పీలుస్తూ ఈ ఊళ్ళో పిల్లలకీ, పిచ్చుకలకీ... పెద్దలికీ, పాపలకీ ఏ రోగ మొచ్చినా, రొష్టొచ్చినా, ఏదో ఆ పంచదార మాత్రలు నాలుగు నోట్లో వేసి నాకు చేతనయిన ప్రజాసేవ చేస్తున్న వాడిని... అయితే మనలో మనమాట... కానీ, ఏగానీ పుచ్చుకుంటున్న మాట వాస్తవమే... సరే... అది పోనీయండి గానీ... మీరేమీ సంశయించనక్కరలేదు... లోపలకు వచ్చి ఇది మీ ఇల్లుగానే వాడుకోండి!" ఆయన పక్కకు తప్పుకున్నాడు. "ఇప్పటికే ఒకాయన ఈ గృహంలో విడిదిచేసి వున్నాడు... ఇదుగో ఈ కారు ఆయనదే!"

గిరిబాబు అక్కడే ఆగివున్న అంబాసిడర్ వంక చూచి మరే ఆలోచనా లేకుండా లోపల కాలుపెట్టాడు.

ఇల్లంతా చీకటి గుయ్యారంలా వున్నది. అసలే పెంకుటిల్లు. దానికి తోడు ఎక్కడా కిటికీ లేదు. హాలులో ఓ పక్కగా నేలమీద రెండు పట్టాలు పరిచివున్నాయి. లోపలకు వస్తూనే దుప్పటి కప్పుకొని పడుకొని వున్న ఓ ఆకారాన్ని మంచం మీద చూచాడు. కాస్త మంచివాడైతే, వాన తగ్గగానే తననీ హైద్రాబాద్ చేర్చవచ్చు అనే ఆశ

మనసులో మిణుకు మిణుకు మన్నది.

వంట ఇంట్లోకి వెళుతూనే మల్లిక, "కాసిని కాఫీ కావాలి... ఎక్కడైనా తెప్పించి ఇవ్వగలరా బాబాయిగారూ!" అన్నది.

సీతాపతిరావుగారు మల్లిక మాట అందుకుంటూనే, "తెప్పించి ఇవ్వటం ఎందుకమ్మా! ఇది మీ ఇల్లే... ఇదుగో కుంపటి... ఆ డబ్బాలో కాఫీపొడి వుంది... ఈ గిన్నెలో పాలున్నాయి... మీరు కావాల్సినన్ని పెట్టుకు తాగండి..." అన్నారు ఆయన నవ్వి. "మా ఆడదానికి కాఫీ బాగా పెట్టటం చేతకాదు తల్లీ!"

"ఓయస్! ఇంకేం... నేనే పెట్టేస్తాలేండి!" మల్లిక హుషారుగా కొంగు బిగించింది.

"క్షమించాలి! మీకు అభ్యంతరం లేకపోతే నాకూ ఒక కప్పు కాఫీ!" పడుకున్న లావుపాటి పెద్దమనిషి కాఫీ మాట వినగానే ఆత్రంగా మంచం మీద లేచి, వంట ఇంటి వైపుకు చూస్తూ అన్నాడు.

"తప్పకుండానూ! ఓ పదినిముషాలు ఓపిక పట్టండి!"

ఆయన గిరిబాబు వైపుకు తిరిగి, "మీరు దేఁవుళ్ళా వచ్చారు... మంచి కాఫీ లేక తలనొప్పితో మధ్యాహ్నంపట్టీ చస్తున్నాను!" అన్నాడు. "ఇంతకీ మీరు ఎక్కడిదాకా వెళ్ళాలి?"

"హైద్రాబాద్ వెళ్ళాలి! రెండు రోజుల క్రితం ఆగిపోయిన రైలునుండి ఇప్పుడే బయటి ప్రపంచంలో పడ్డాను!" గిరిబాబు పెద్దగా నవ్వాడు. "మరోమాటలో చెప్పాలంటే మా మిత్రుడి అయిపోయిన పెళ్ళికి ఇంకా వెళ్ళాలి అన్నట్లుగా ముందుకు దారి వెతుక్కుంటున్నాను!"

"నా పనీ అంతే అయింది... గోదావరి ఒడ్డున షూటింగ్ పెట్టించి ఏకధాటిగా రెండు రీళ్ళు లాగించిపారేశాం... తిరిగి వెళుతూ ఉంటే ఇదీ రామాయణం!... ఇంకా నయం యూనిట్ అంతటినీ ఆపలా... నా ప్రాణానికి పడి ఏడ్చే వాళ్ళు!"

"మీరు ప్రొడ్యూస్ చేస్తున్నారా?... ఏం పిక్చరు?"

"అవునండీ... మామూలే! ఓ ప్రేమాయణం... బాక్సాఫీస్ సూత్రాలనన్నిటినీ గుప్పించి లాగిస్తున్నాను!" హాయిగా నవ్వాడు.

గిరిబాబుకు ఆ చీకటి హాల్లో క్రింద పట్టామీద కూర్చోవటం కాస్తంత ఇబ్బందిగా ఉన్నట్లనిపించింది. అందుకే బయటకు వచ్చేశాడు గాలయినా స్వేచ్ఛగా పీల్చుకోవచ్చు అన్నట్లుగా.

మల్లిక నవ్వు పెద్దగా లోపలనుండి వినబడుతుంటే, ఎంత కొత్త ప్రదేశమయినే ఈమె ఇట్టే ఇమిడిపోగలదు అనిపించింది గిరిబాబుకు. ఏది ఏమైనా ఆ అమ్మాయిని ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా వదిలించుకోవాలి. లేకపోతే తెలిసిన వాళ్ళెవరైనా తన ఖర్మకొద్దీ కంటబడ్డారంటే...

"క్షమించాలి!"

తాము బ్రిడ్జి దాటుతుండగా తమ సూట్కేసులను జేరవేసిన యువకుడు.

"ఈ ఇంట్లో వాళ్ళు గనుక మీకేంవైనా తెలిసివుంటే కాస్త సాయం చేయాలి... జ్వరంతో బాధపడుతున్నాను. మిగతా వాళ్ళతో ముందుకు వెళ్ళలేక వెనక్కు వచ్చేశాను. నాకు ఈ రాత్రికి ఆశ్రయం ఇప్పించారంటే..."

గిరిబాబు పేలవంగా నవ్వాడు.

"ముసలాయన మాటలనుబట్టి నాకర్థమయింది... నాలుగు రూపాయలు ఇవ్వగలిగిన ప్రతివాడికీ ఈ ఇంట ఆతిథ్యం దొరుకుతుంది... ఇందులో నా సహాయం ఏమీ అవసరం లేదు!"

"రియల్లీ! అయితే ఓ బెడద తప్పిపోయిందన్నమాట!" దబదబా మెట్లెక్కి స్వంత ఇంట్లోకిలాగా వెళ్ళిపోయాడు.

మల్లిక అతడిని చూస్తూనే, "మీరూ వచ్చారన్నమాట... స్వాగతం!" అన్నది.

"థాంక్యూ మేడమ్!"

"ఈ ఇంటి యజమానురాలిని నేను కాదండోయ్... గృహ యజమానులు వేరే

ఉన్నారు!... వారికి చెప్పండి... అయితే అమృతంలాంటి కాఫీ కావాలంటే ఓ కప్పు కలిపి ఇస్తా... కృతజ్ఞతలు చెబితే కాదనని మాత్రం అనను!"

చొరవగా కాస్త ముందుకు వెళ్ళాడు అతను. "మీ మాటలు వింటుంటే ఇక్కడనుంచి కదలబుద్ధి కావటంలేదు!" అన్నాడు.

మల్లిక దబదబా లేచి, అక్కడే వున్న పీట తెచ్చి, వంటింటి గడప దగ్గరగా వేసి, "నేనూ బోరుకొట్టి చస్తున్నాను ... ఏంవైనా మాటలు చెప్పండి, వింటాను!" అన్నది.

పక్క గదిలోకి వెళ్ళిన సీతాపతిరావుగారు ముందు గదిలోకి వస్తూనే, కొత్త వ్యక్తిని చూసి, "మరో అతిథిదేంవుడు వచ్చారన్నమాట... స్వాగతం... అమ్మీ! ఇంకొకరికి కూడా వంటలోకి బియ్యం జేర్చు!" అన్నారు పెద్దగా.

సీతాపతిరావుగారి మాటలు వింటూనే జేబులోనుంచి పర్సుతీసి, నాలుగు రూపాయలు బయటకు లాగి, "ఇవుగోండి! ఒక రోజుకు ఎడ్వాన్సుగా నాలుగు రూపాయలు!" అన్నాడు.

సీతాపతిరావుగారు నవ్వుతూనే, "ముందుకు దూకుతున్న లక్ష్మిని ఎప్పుడూ వద్దా అనకూడదు... ఇటియ్! కళ్ళ కద్దుకొని పెట్టెలో పెట్టి వస్తాను!" అంటూనే అందుకొని, కళ్ళకద్దుకొని, మళ్ళీ వచ్చిన గదిలోకే వెళ్ళిపోయారు.

మల్లిక ఆ వెళ్ళిన ఇంటి యజమాని వైపుకు చూచి, కళ్ళు ఎగరవేసి, పీటమీద కూర్చున్న యువకుడివంక చూచి నవ్వింది.

"మీ పేరు చెప్పనేలేదు!"

"కిరణ్!"

"కిరణ్ అంటే మెరుస్తుండాలి మాస్టారూ! ముఖం ఎంత కళకళలాడేదైనా నల్లటివారు... మీకాపేరు ఎలా సరిపోయిందో నా కర్థం కావటంలేదు!"

"పోనీయ్... నాకు సరిపోయే పేరేదైనా చెప్పండి... అదే పెట్టుకుంటాను!" అన్నాడు నవ్వి కిరణ్.

"నీలమేఘ శ్యాములకు మరోపేరు దేనికి... కృష్ణమూర్తి అనుకుంటే సరిపోదూ!"

"నాకు జీవితంలో రెండోసారి నామకరణం అయిందన్నమాట!" నవ్వాడు తియ్యగా, పీటమీద వెనక్కు జారిగిల పడుతూ.

ముందుకు పడ్డ జడను, ఠీవిగా ఒక్కసారి కిరణ్ ముఖంలోకి చూచి, వెనక్కు వేసుకున్నది మల్లిక.

కుంపటి మీద నీళ్ళు తెర్లినయి. కాఫీపొడి వేసింది.

ఇంటి యజమానురాలు పక్కగా తెచ్చిపెట్టిన పాలగిన్నెను కుంపటిమీద పెట్టింది.

మళ్ళా సీతాపతిరావుగారు వచ్చి, "వీరిగ్గూడా కాఫీ కలుపుతున్నావు కదా, అమ్మాయీ!" అన్నాడు.

"నాకు మాత్రం మీరు కొద్దిగా కన్సెషన్ ఇవ్వవలసి వుంటుంది బాబాయిగారూ!... మీరు నాచేత పనికూడా చేయించుకుంటున్నారు!" అన్నది నవ్వుతూ తలెత్తి.

''అమ్మా! పెద్దలకు సేవచేస్తే, స్వర్గంలో సుస్థిరమైన స్థానం దొరుకుతుందన్నమాట... నా అతిథిదేవుళ్ళకు సేవ చేస్తున్నావూ అంటే నాకు చేస్తున్నావన్నమాటే... నీకు స్వర్గంలో స్థానం లభించినట్లే!... కనుక ఇలాంటి అవకాశం కలిగించిన నాకే నువ్వు కొద్దిగా ఎక్కువ ఇస్తే..." ఆయన బోసినోరంతా తెరుచుకొని నవ్వేశారు.

మల్లికా నవ్వకుండా వుండలేకపోయింది. 'అమ్మో గడుసుపిండం!' అనుకున్నది.

కిరణ్ సరేసరి!

కాఫీ కలిపి, ఉన్న నాలుగు ఇత్తడి గ్లాసుల్లోనూ పోసి, ఒకటి కిరణ్‌కి, మరోటి సినిమా ప్రొడ్యూసర్‌కు ఇచ్చి, రెండు చేతులతోనూ రెండు గ్లాసులు పట్టుకొని బయటకు వచ్చింది.

"ఇదుగోండి కాఫీ!"

గిరిబాబు అందుకున్నాడు.

"ఏంవిటి ఆలోచిస్తున్నారు ఒంటరిగా నిల్చొని!" నవ్వి అన్నది.

"మీ నవ్వుల్ని వింటున్నాను!" నుదురు చిట్లించాడు.

మల్లిక ప్రవర్తన అతడికి వెగటుగా వున్నది. "ఆ కొత్త వాడితో ఏంవిటా పరాచికాలు?"

"మీకు ఈర్ష్యగా వున్నదా?"

"నాకు దేనికి?"

"మరి మీ బాధేంవిటి?" కళ్ళెత్తి సూటిగా చూస్తూ అడిగింది.

"నాకు బాధ దేనికి?" ఆమె మాటలు అతడిలో కోపాన్ని కూడా కలిగించినయ్. "కాని, ప్రతివాళ్ళకూ కొన్ని హద్దులుంటాయి... అవి దాటితే అసహ్యంగా వుంటుంది అంటున్నాను!"

మల్లిక దగ్గరగా వచ్చింది. ఒత్తి పలుకుతూ, "అవును! నాకు తెలియక అడుగుతాను... లేచి వచ్చిన ఆడదాని ప్రవర్తన ఇలా వుండక ఇంకెలా వుంటుంది?... ఈ క్షణాన నేనేం పతివ్రతనని చెప్పుకోలేను... తలమీద ముసుగు వేసుకొని, తలుపుచాటున నిలబడి నంగినంగిగా మగవాళ్ళతో మాట్లాడలేను!" ఆమె ఒక్కక్షణమాగింది. లోపల ఏదో కుతకుతలాడుతున్నట్లుగా తల అటూ ఇటూ తిప్పింది. "ఛీ! ఛీ!... పాడు మనుష్యులు... పాడు లోకం!" అంటూనే చేతిలోని కాఫీని రోడ్డుమీదకు విసురుగా పారబోసి గిరుక్కున వెనక్కు తిరిగింది.

"నన్ను క్షమించు మల్లికా!"

మల్లిక అతడి మాటలను వినిపించుకోనేలేదు.

ముందుకు రెండడుగులు వేసి చటుక్కున ఆగింది.

అక్కడ కిరణ్ కాఫీ త్రాగుతూ ఆమె వంకే చూస్తూ నిల్చొని వున్నాడు– అతడు

చిన్నగా నవ్వుతున్నాడు కూడా!

అతడిని పక్కకు తప్పుకొని పరుగెడుతున్నట్లుగా లోపలకు వెళ్ళిపోయింది మల్లిక.

కడుపులో తెములుతున్నది. కళ్ళు తిరుగుతున్నయి. వమనం ఏ క్షణానన్తైనా అవ్వవచ్చు అనేలా వున్నది. దబదబా దొడ్లోకి పరుగెత్తుకు వెళ్ళి బావి పళ్ళెం మీద కూర్చున్నది. మరుక్షణంలోనే అనుకున్నంతా అయింది.

కళ్ళమ్మట నీళ్ళు గిర్రున తిరిగినయి. పాడులోకం... మగ ప్రపంచం– తనకు విధించిన శిక్ష ఇది!

– వీళ్ళను సర్వనాశనం చేయాలి!

ఆనందంగా, హాయిగా అమ్మచేతి అన్నం తింటూ, తనమాటే నాన్న మాటగా చెల్లించుకుంటూ, ఇంటికి రాణిలా వెలిగిన తన బ్రతుకు ఇంతగా వీధిన పడాలా?

మగవాడిమీద కసి ఆమె నరనరాన్నీ పట్టుకు తిప్పసాగింది.

"ఏఁవిటమ్మా! ఏఁవైంది... ఒంట్లో బాగోలేదా... లేక ప్రత్యేకత..." ఇంటి యజమానురాలి ఆప్యాయపూరిత కంఠానికి ఉలిక్కిపడింది.

"మూడోనెల అనుకుంటాను!" అన్నది– ముఖంలో ఎలాంటి మార్పూ లేకుండా.

ఆవిడ నీళ్ళు తెచ్చి ఇచ్చింది.

ముఖం కడుక్కొని లేచి నిలబడితే చాలా నీరసంగా ఉన్నట్లనిపించింది.

ఆమె క్షణం సంశయిస్తున్నట్లుగా, అక్కడే మల్లిక ముఖంలోకి తదేకంగా చూస్తూ నిలబడిపోయింది.

"ఏఁవిటలా చూస్తున్నారు?" వింతగా అడిగింది మల్లిక.

"నీ మెళ్ళో మంగళసూత్రమేదమ్మా– కాళ్ళకు..." ఆమెకు నోరు పెగల్లేదు.

మల్లిక అదేదో తేలిక విషయంలా పెద్దగా నవ్వేసింది.

తల ఎగరవేసి, ముందుకు పడుతున్న జుట్టును, వెనక్కు నెట్టుకుంటూ, "అదో కథలేండి పిన్నిగారూ! నాతో వచ్చిన ఆయన మా బావ... మా పెళ్ళి మావాళ్ళ కెవ్వరికీ ఇష్టం లేదు... అందుకనే ఎవ్వరికీ చెప్పకుండా రిజిస్టర్డు మేరేజ్ చేసుకున్నాం... ఇంకా మా ఇళ్ళల్లో తెలియదు కూడా!" అన్నది.

సీతాపతిరావుగారు బావివైపుకు వచ్చారు. "ఇదేఁవిటి! మీరిద్దరూ ఇక్కడ ముచ్చట్లు చెప్పుకుంటూ నిల్చున్నారు ... వంటవుతున్నదా?"

"అబ్బే ఏఁవీలేదు... అమ్మాయికి కడుపులో తిప్పుతున్నదంటేనూ!" ఆమె అన్నది.

"ఏఁవైందమ్మా... డాక్టరు దగ్గర రోగం దాచిపెట్టకూడదు... అసలే మీ బాబాయి ముసలివాడు కూడా... లోపల మరో అతిథి దేఁవుడుగాని ఉన్నాడా ఏం?" బోసినోటితో నవ్వారు.

మల్లిక సిగ్గు పడుతున్నట్లుగా తలవంచుకు నవ్వింది.

"ప్రత్యేక వసతులేం కల్పించ నవసరం లేదు గనుక నా నాలుగు రూపాయల్లోనే సరిపుచ్చుకోవాలి!" అన్నది నవ్వుతూనే.

ఆయనా నవ్వారు. "అయితేనేం... ఆ పసిపాపడు గోలచేయకుండా వుండాలీ అంటే నాలుగు తీపి మాత్రలు పడాల్సిందే... అవి పడాలీ అంటే పొట్లానికి అర్ధరూపాయి ఇచ్చుకోవాల్సిందేనూ!"

మల్లికకు నవ్వు ఎంత ఆపుకుందామన్నా ఆగలేదు.

సీతాపతిరావుగారు లోపలికి వస్తూనే గిరిబాబు దగ్గరకల్లా వెళ్ళి, "మీకు అబ్బాయి కావాలా, అమ్మాయి కావాలా?" అని అడిగారు నవ్వుతూ.

వెనగ్గా వచ్చిన మల్లిక కలవరపడుతూ ఏదో చెప్పబోయింది.

అయినా ఆ ముసలాయన వినిపించుకోలేదు. "తల్లీ బిడ్డా క్షేమంగా వుండాలంటే కొన్ని నియమాలు ఏర్పరుచు కోవాలి..."

గిరిబాబు ఆయన ముఖంలోకి అయోమయంగా చూడసాగాడు.

మల్లిక చటుక్కున ముందుకు వచ్చింది.

“వంటయిపోతోంది... ఎవరయినా స్నానాలు చేస్తారా, మీరు కృష్ణమూర్తిగారూ!” అన్నది తొట్రుపడుతూ.

కృష్ణమూర్తి ఆమె కలవరపాటును పరిశీలనగా చూడసాగాడు.

సీతాపతిరావుగారు వదల్లేదు.

“అదికాదు మాస్టారూ!... హోమియోపతి వుంది చూచారూ... ఆ ఇంగ్లీషు మందులు దీనిముందు దిగదుడుపే ... నా సలహా ఏఁవిటంటే ముందు మీకు మగపిల్లవాడయితేనే ఎంతో మంచింది... ఓ ఇరవయ్యేళ్ళలో చేతికొచ్చి...”

గిరిబాబు విసురుగా లేచి నిలబడ్డాడు.

“ఏఁవిటి మీరంటున్నది?” ఏదో అసహ్యకరమైన విషయం వింటున్నట్లుగా ముఖం చిట్లించాడు.

“నాకు తెలుసు... ఎంత డాబుసరి పెరిగినా మనుష్యుల్లో ఇంకా సిగ్గుపోలేదు!” ఆయన నవ్వారు. “అమ్మాయికి ఇంతకీ ఎన్నో నెలో అడగటమే మర్చిపోయాను... ఇప్పటి నుంచే నేను చెప్పే మందులు వేశారో... కాన్పు చాలా సుఖప్రదంగా, తేలిగ్గా వుంటుంది!”

* * *

ఓ గంటసేపు పిచ్చిపిచ్చిగా ఆ బురదలో తిరిగినా– ఇంకేం చేయాలో తెలియనట్లుగా– ఇంకేం చేయటమూ చేతకాదన్నట్లుగా– తిరిగి ఆ ఇంట్లో కాలు పెట్టాడు గిరిబాబు. అందునా బయట సన్నగా జల్లు మొదలయింది.

మల్లిక అతడికి ఒక పెద్ద గుదిబండ అయింది.

వీలయినంత త్వరలో ఆమెను వదిలించుకు తీరాలి!

లోపలికి వస్తూనే తన పెట్టికోసం చూచాడు.

అది గమనిస్తూనే మల్లిక, “మీ పెట్టి ఆ పక్కగదిలో వున్నది!” అన్నది.

ముందు మల్లిక వెళ్ళగా గిరిబాబు అనుసరించాడు గదిలోకి. మల్లిక దబదబా అతడి పెట్టితెరిచి లుంగీతీసింది. తువ్వాల తీసింది. ఓ చొక్కా తీసింది.

తువ్వాల అతని చేతికి అందిస్తూ, సిగ్గుపడుతున్నట్లుగా నవ్వి, “మనకీ గది ఇచ్చారు!” అన్నది.

“దేనికి?” అన్నాడు ఆమె ముఖంలోకి విచిత్రంగా చూస్తూ.

“నాకేం తెలుసు?”

“మరి నువ్వడగలేదా?”

“నా కవసరం అనిపించలేదు!” అంటూనే జడను ముందుకు లాక్కొని చివరలను బిగుతుగా అల్లుకోసాగింది.

ఎంతగా పెదవులు బిగించినా, లోపలనుండి నవ్వు బయటకు రావటానికే ప్రయత్నిస్తున్నది.

ఒక్క క్షణమాగి, “తలను నేను తుడిచేదా?” అడిగింది.

తడి తలను తుడుచుకుంటున్నవాడల్లా ఆగి, “నాకు చేతకాదనా?” అన్నాడు కసిగా.

“చేతనయినవన్నీ మీరు చేసుకోవాలనేమున్నది... ఇంత తిండి, ఆశ్రయం దొరుకుతున్నందుకు గాను రోజుకు నాలుగు రూపాయలు నాకోసం వెచ్చిస్తున్నారు... అటువంటి మీకు ఇలాంటి చిన్న చిన్న సహాయాలు చేయటంలో తప్పేంవున్నది!”

“మల్లికా! నన్ను అనవసరంగా విసిగించబోకు... ముందు ఇక్కడనుంచి వెళ్ళిపో!”

“ఎక్కడకు వెళ్ళను నేను... ఈ ఇల్లు వదిలి పెట్టేటంత వరకూ ఈ గది మనిద్దరిదీను!” అన్నది కవ్వింపుగా.

"అంటే నీ ఉద్దేశ్యం?"

"దీంట్లో ప్రత్యేకంగా ఉద్దేశ్యాలేం ఉన్నాయి!" అన్నది వింతగా అతడి ముఖంలోకి చూస్తూ.

చికాగ్గా అతడు దుమ్ము, ధూళీ కొట్టుకున్న ఆ గదిలో నులక మంచం మీద కూలబడ్డాడు.

నీరసంగా వున్నట్లనిపించింది.

"నేనంటే మీకు అసహ్యమేస్తున్నది కదూ?" అన్నది మల్లిక దగ్గరిగా వచ్చి నిలబడి.

గిరిబాబు కావాలని మాట్లాడలేదు.

మల్లిక పక్కగా వున్న ఓ స్టూలును తెచ్చి, దాని మీద వున్న దుమ్మును గట్టిగా ఊదేసి, గిరిబాబుకు దగ్గరగా వేసుకు కూర్చున్నది.

అది మల్లిక కూర్చోవటంతో ఊగసాగింది.

మల్లిక నవ్వింది. "దీని బ్రతుకూ నా బ్రతుకు లాగానే వున్నది!"

ఒక్క క్షణం తలెత్తి మల్లిక ముఖంలోకి చూచాడు.

మల్లిక నవ్వింది.

"మీరొక విషయంలో నన్ను మన్నించాలి!" ఒక్క క్షణం శూన్యంలోకి చూస్తున్నట్లుగా ఉండిపోయింది.

"ఏమిటది?" విసుగ్గా అన్నాడు.

"ఇంత ఆశ్రయం కోసం, పిడికెడు కూడు కోసం ఘోరమైన అబద్ధమొకటి ఆడాను!"

"ఏమని?"

"నన్ను క్షమించగలరా?"

"అది అంత ముఖ్యమా నీకు?"

"నాకూ మానవత్వమున్నది... మనస్సు ఎంత శిలగా మారినా, స్త్రీ అయిన నాలో మృదుత్వం లేకపోలేదు... ఎంత దావానలాన్ని మింగగలిగినా... నా హృదయమూ అప్పుడప్పుడూ ఆక్రోశించక తప్పదు!"

గిరిబాబు పరీక్షగా ఆమె ముఖంలోకి చూడసాగాడు.

ఆ నవ్వే కళ్ళను, అందమైన ముఖాన్ని, గాలికెగురుతున్న ముంగురులనూ ఆలాగే చూస్తూ ఉండిపోయాడు.

"చెప్పండి... క్షమించగలరా?"

"మాట ఇవ్వలేను గాని... ప్రయత్నిస్తాను!"

"కాదు... మీరు మన్నించకపోతే నాకు మరణమే శరణ్యం!"

"నువ్వు అంత ఘోరమయిన తప్పిదం చేశావా?"

"అవును!"

"చేసేటప్పుడు ఆలోచించలేదా మరి!"

"కారణం చెప్పాను కదా!... ఇంత ఆశ్రయం... పిడికెడు కూడు... నా చేత ఆ తప్పిదాన్ని చేయించిందని!"

"ఏఁవిటది?"

చటుక్కున మల్లిక లేచి నిలబడింది.

"మీరు నా భర్త అని చెప్పాను!"

"మల్లికా!"

"నాలో పెరుగుతున్న పాపకు తండ్రి మీరని చెప్పాను!"

"మల్లికా!"

మరుక్షణంలో మల్లిక ఆ గదిలో లేదు.

* * *

"వడ్డన అయింది లేవండి!" తలుపు దగ్గర నిలబడి అన్నది మల్లిక.

"నాకు ఆకలి కావటం లేదు!"

"ఎందుకని?"

"ఆకలి కావటం లేదూ అంటున్నాను!"

"అదే ఎందుకని అని అడుగుతున్నాను!" కంఠంలో తీక్షణత తొంగి చూడసాగింది.

"మల్లికా! నీ వ్యవహారం నాకేంనచ్చటంలేదు... ఎందుకు ప్రతివిషయాన్నీ, నా గొంతుకు మెలివేసి బిగిస్తున్నావో అర్థం కావటం లేదు!"

మల్లిక ఒక్క అడుగు ముందుకువేసి, చిన్నగా, "ఏంవిటి మీ ఉద్దేశ్యం... నన్ను అనవసరంగా గోలచేసి, మిమ్మల్ని మీరు గోలచేసుకుంటారు?... మీ హితైషురాలిగా చెబుతున్నాను... లేవండి! ఆకలయినంతవరకే తినండి!" అన్నది.

"శాసిస్తున్నావా?"

"దాన్ని మీరెలా తీసుకున్నా నాకు అభ్యంతరం లేదు... నాకు భయం లేదు... నేను అన్నింటికీ తెగించినదాన్ని!" అన్నది దృఢంగా.

గిరిబాబు ఆమె కంఠానికి నిర్విర్ణుడయ్యాడు.

తేరుకోకముందే, "గిరిబాబుగారూ త్వరగా రావాలి... మల్లిక తల్లీ నువ్వొస్తేనేగాని ఇక్కడ పని అయ్యేలా లేదు!" సీతాపతిరావుగారి కంఠం పెద్దగా వినబడింది.

"ఊం... రెండు నిముషాలల్లో బయటకు వచ్చేయాలి!" గిరుక్కున తిరిగి బయటకు వచ్చేసింది మల్లిక.

గిరిబాబు సిగ్గుతో, అవమానంతో ఆమె వెనకే తలవంచుకొని అడుగులు

వేస్తున్నాడు.

సీతాపతిరావుగారు, సినిమా ప్రొడ్యూసర్‌గారూ అప్పటికే పీటల మీద కూర్చొని వున్నారు.

"కృష్ణమూర్తిగారేరి?" మల్లికే అడిగింది.

"ఆయనకు నూటమూడయినా జ్వరం ఉండివుంటుంది... భోజనం కూడానా! ఎకోనైట్ ఒక డోసు వేశాను ఇప్పుడే!" సీతాపతిరావుగారు సమాధానమిచ్చారు.

"అరె!"

గిరిబాబు కూర్చున్నాడు. మల్లిక వడ్డించుతున్నది.

సీతాపతిరావుగారు తాపీగా రెండు ముద్దలు తిని, విస్తట్లో అన్నాన్ని కెలుకుతూ కూర్చున్న గిరిబాబును చూస్తూనే, "మేం అంటే కొత్తవాళ్ళమే కాదనను... కానీ, మల్లికేగదా వడ్డిస్తోంది... అంత మొహమాట పడతావేమయ్యా బాబూ!" అన్నారు నవ్వుతూ.

గిరిబాబు చటుక్కున తలెత్తి సూటిగా ఆయన కళ్ళల్లోకి చూచాడు.

"మల్లిక తల్లీ! ఇలారా! ఆ కూరగిన్నె ఇలా తే... నువ్వయినా చెప్పవచ్చుగదమ్మా... ఆయన నలుగురిలో తినలేరని!"

గిరిబాబు ముఖం కందగడ్డలా అయింది.

మల్లిక చీరచెంగును ముఖం మీదకు లాక్కున్నది. ఆమెకు నవ్వు ఎంత ఆపుకుందామనుకున్నా ఆగటంలేదు.

ప్రొడ్యూసర్ కూడా నవ్వి, "ఆవిడ సాహచర్యంలో కూడా మీకింకా ఈ బిడియం వదల్లేదంటే నాకు చాలా విచిత్రంగా వున్నది!" అన్నాడు చొరవగా.

గిరిబాబుకు నోట్లోకి ముద్దపోలేదు. కళ్ళు ఎర్రబడ్డాయి రోషంతో.

అది గ్రహించిన మల్లిక జాలిగా దీనంగా అతడి ముఖంలోకి చూచింది.

“ఆయన అన్నం తినేటప్పుడు మాట్లాడరులేండి!” అంటూనే ప్రొడ్యూసర్ విస్తట్లో చారుపోసింది.

“మీరు ఏమీ అనుకోనంటే ఒకటి చెబుతాను!” అన్నాడు ప్రొడ్యూసర్ మల్లిక వైపుకు చూస్తూ.

మల్లిక మాటమారుస్తున్నట్లుగా, “ఇంతకీ మీ పేరు చెప్పనే లేదు!” అన్నది ప్రొడ్యూసర్‌తో.

“నా పేరు చక్రవర్తి!”

ఆ పేరు విన్నట్లే అనిపించగా ఆమె కళ్ళు కాస్తంత కాంతివంతమయినయి.

‘‘వారికి కోపం రాదంటే ఒక్క మాటంటాను!’’ అన్నాడు చక్రవర్తి సంశయిస్తున్నట్లుగా ఒక్క క్షణమాగి.

“వారి తరఫున నేను భరోసా ఇస్తున్నాను... చెప్పండి!” అన్నది మల్లిక ముద్దగా– ఎక్కడో ఆలోచనల నడుమ తేలుతూ.

గిరిబాబు చికాగ్గా తలెత్తాడు.

అతడి ముఖంలోని చికాకును పట్టించుకోకుండానే చక్రవర్తి, “మీరు ఊఁ అంటే చాలు... మీ శ్రీమతిని వెండితెరకు రాణిని చేస్తాను... వారిలో హీరోయిన్‌కు వుండాల్సిన లక్షణాలు చాలా వున్నయి... అ చొరవా, మాట తీరు, భావ ప్రకటనా... మరో మాటలో చెప్పాలంటే నా వచ్చే పిక్చర్‌కు ఆలాంటి అమ్మాయి కోసమే దేశమంతా గాలిస్తున్నాను!” అన్నాడు.

గిరిబాబు చటుక్కున విస్తరి ముందునుంచి లేచి, చేతిలోకి నీళ్ళగ్లాసు తీసుకొని బయటకు వెళ్ళిపోయాడు.

చక్రవర్తి, గిరిబాబు పోతున్న వైపే విభ్రాంతిగా చూస్తూ వుండిపోయాడు.

సీతాపతిరావుగారు, “గిరిబాబుగారూ! ఏఁవిటది?... ఏఁవిటది?” అంటున్నారు

ఇంకేం మాట్లాడాలో తెలియనట్లుగా.

మల్లిక ముఖం తెల్లగాపాలిపోగా చటుక్కున వంటయింట్లోకి వెళ్ళిపోయింది. శరీరాన్నంతా నీరసమావరించింది.

ఈ ప్రపంచమంతా తనమీద అల్లుకుపోతున్న ఓ భయంకరమైన వలలా అగుపించగా– తన జీవితమే చాలా గిజిబిజిగా కనిపించసాగింది.

తన ప్రాణాలు తీసే ఈ ఇనుపముళ్ళ తీగెల నడుమనుండి తానెన్నడైనా బయటపడగలదా?... ఉఁహూఁ... ఏఁవో?...

గిరిబాబు చేతులు కడిగేసుకొని తన గదిలోకి పోయి, మంచం మీద నులక వత్తుకుంటున్నా భరిస్తూ అలాగే కళ్ళు మూసుకు పడుకున్నాడు.

మల్లికకూ అన్నం సహించలేదు. అప్పటికే ఆ ఇంటి యజమానురాలు– చాలాతక్కువ మాట్లాడే స్త్రీ– పదేపదే ఒత్తిడి చేయగా, కొద్దిగా మజ్జిగన్నం తిన్నది.

చేయి కడుక్కుంటుంటే– తానెందుకు బాధపడాలి అనిపించింది. ఆ రాక్షసుడు చేసిన అన్యాయం కంటే– ఈ చిన్న సంఘటన తనకు మరింత బాధ కలిగించేలా వున్నదా?

ఆ రాక్షసుడు గుర్తుకు వచ్చాడు. తనను ఎలా తేనె పూసిన మాటలతో అందలమెక్కించి– ఆనంద హర్మ్యాల నడుమ పుటుక్కున ముంచి, తను తెచ్చిన బంగారు ఆభరణాలతో సహా మాయమయిందీ గుర్తుకు వచ్చింది. అమ్మా, నాన్నా గుర్తుకు వచ్చారు. నాన్న గుండె జబ్బు గుర్తుకు వచ్చింది.

ఈ క్షణాన తన ఇల్లు– ఊరిబయట– ఒకటి రెండుసార్లు చూచిన శ్మశానం గుర్తుకు వచ్చింది.

హృదయం విలవిలలాడింది.

ఇక గతాన్ని గుర్తుకు తెచ్చుకోవటమే ఇష్టం లేదన్నట్లుగా కళ్ళు గట్టిగా

మూసుకున్నది. చుట్టూ చీకటిని, మరో ప్రపంచాన్ని చుట్టుకున్నది. సర్వం నాశనమయిపోగా, శిధిలాలలో నడుస్తున్నట్లుగా తూలుతూ అడుగులు వేయసాగింది. అలా నడుస్తుంటే ఈ మగవాళ్ళంతా రాక్షసుల్లాగానే కనబడసాగారు.

తానెందుకు వీళ్ళ గురించి బాధపడాలి?

కోపంతో కళ్ళు ఎరుపెక్కినయి. శరీరం కంపించుతుండగా నరాలు ఫట్‌ఫట్ మనసాగినయి.

గిరిబాబేగాని, మరెవ్వరైనాగాని తానెందుకు జాలిపడాలి? ఆ జాతంటేనే తనకు పరమ అసహ్యం!

"మల్లికగారూ! క్షమించాలి!" చక్రవర్తి గొంతు విని ఉలిక్కిపడింది మల్లిక.

"దేనికి?" విసురుగా అన్నది.

"మీవారి మనస్సు కష్టపెట్టాను!"

"అయితే నాకు క్షమాపణలు దేనికి?" మెరుపులా గిరిబాబు పడుకున్న తనదనుకున్న గదిలో కాలుపెట్టి తలుపులు భళ్ళున మూసివేసింది.

గిరిబాబు ఆమె చేసిన పనికి విచలితుడవుతూ, "మల్లికా! తలుపుతీయి!" అన్నాడు నీరసంగా.

"దేనికి?"

"తలుపులు వేయటం దేనికి?"

"వేస్తే ఏమయింది?" కృద్ధ కంఠంతో వణుకుతూ అన్నది.

గిరిబాబు కోపాన్ని నిగ్రహించుకోలేకపోయాడు. చటుక్కున లేచి కూర్చున్నాడు. "వేస్తే ఏమౌతుందో చెప్పాలా?" అన్నాడు.

"అవును!" కఠినంగా అన్నది సూటిగా చూస్తూ.

"నలుగురూ ఇప్పుడు నవ్వుతున్నది చాలకనా?"

"మనలగురించి నలుగురూ నవ్వుతున్నారా?... ఎందుకట?"

"మల్లికా!"

"మనలను గురించి మరొకరు పట్టించుకోవాల్సిన అవసరం ఏమున్నది? మనలను చూచి నవ్వవలసిన అవసరం ఏవరికున్నది?"

"కనబడటం లేదా?"

"నాకేం కనబడటం లేదు!"

"పిల్లి కళ్ళు మూసుకొని పాలు త్రాగుతూ..."

"భుజాలు తడుముకొని దొంగ అని నిరూపించుకుంటున్నారు- అంతే!" తాపీగా అన్నది.

అలా అంటూనే తలుపుకు లోపల గడియ వేసేసింది.

"గడియగూడా వేస్తున్నావా?" అన్నాడు దిగులుగా.

నవ్వింది మల్లిక.

"మీరు పడుకోండి... రాత్రి సరైన నిద్రలేదు... పగలు చాలా దూరం నడిచారు... మీ కాళ్ళు ఒత్తుతూ నేను కూర్చుంటాను!" అన్నది నోట్లో చీర చెంగు కుక్కుకుంటూ.

"నాకేం నీ సేవలు అఖ్ఖర్లేదు!"

"ఋణగ్రస్థులు వచ్చే జన్మలో కుక్కయి పుట్టి అప్పు తీర్చుకోవాలట... దాన్నుండి తప్పించుకోవాలంటే ఈ జన్మ లోనే ఏదో విధంగా ఆ ఋణాన్ని తీర్చుకోక తప్పదు!"

"ఋణగ్రస్థులే కానఖ్ఖరలేదు... మగవాళ్ళను ఏడిపించినా..."

"అది పదహారు జన్మలనుంచి అలవాటే... అయినా ఆడపిల్లగానే పుడుతున్నాను... మీరేం భయపడబోకండి... మీరు నన్ను మాత్రం ఋణగ్రస్థురాలినిగా చేసి కూర్చోబెట్టపోకండి!" అంటూనే అతడి మంచం దగ్గరకు వచ్చి, "లేవండి... ఆ

నులకలో ఎట్లా పడుకుంటారు... దుప్పటి వేస్తాను!" అంటూనే అతడి సూట్కేసును తెరిచి దుప్పటి బయటకు తీసింది.

బయట మళ్ళా వాన మొదలయింది. మూలగా పెట్టి వున్న గుడ్డిదీపం ఏడుస్తున్నట్లుగా వెలుగుతున్నది. ఆ సన్నని వెలుగులోనే గిరిబాబు వైపుకు చూచింది. ఒక్కక్షణం అతనంటే జాలివేసింది.

అందుకే–

"వింటున్నారా?" అన్నది.

గిరిబాబు మాట్లాడలేదు.

"మిమ్మల్నే!" అంది కవ్వింపుగా.

అతడు కదలను కూడా కదలలేదు.

లేచి కూర్చొని అతడి చేయి పట్టుకు లాగుతూ, "అప్పుడే నిద్ర పట్టిందా?" అన్నది.

చికాగ్గా ఆమె వైపుకు ముఖం తిప్పి చూచాడు.

"నాకిచ్చిన మాట మర్చిపోయారు కదూ!" అన్నది జాలిగా చూస్తూ.

"ఏఁవిటది?" విసుగ్గా అన్నాడు.

"పాపిష్టిదాన్ని! మీ తల క్రింద దిండుకూడా లాక్కున్నాను కదూ... తీసుకోండి!" అంటూ దిండుతీసి అతని తల వైపు పెట్టింది.

గిరిబాబు తీసి దానిని విసురుగా అవతల పడేశాడు– "మాట్లాడకుండా పడుకుంటే ఎంతో బాగుంటుంది– నాకు అసలే చికాగ్గా వున్నది– తలనొప్పికూడా వస్తోంది!" అన్నాడు కటువుగా.

చటుక్కున మల్లిక లేచి వచ్చి, అతడి నుదుటిమీద చేయి వేసి చూస్తూ, "హమ్మయ్య! జ్వరంగాని వచ్చిందేమోనని భయపడ్డాను... అటు కృష్ణమూర్తిగారు కూడా మూసిన

కన్ను తెరవకుండా పడి వున్నారు!" అంటూనే క్రిందపడివున్న దిండును తీసుకు వచ్చి, "తలెత్తండి!" అన్నది.

గిరిబాబుకు దిండు పెట్టుకోక తప్పలేదు. అసహనంగానే తలెత్తాడు.

"నాకిచ్చిన మాటను మరోసారి గుర్తు చేద్దామనుకుంటున్నాను!"

"ఏం మాట అది?"

"నా మీద ఎంత కోపమొచ్చినా నాతో మాట్లాడకుండా వుండనన్నారు కదూ!"

గిరిబాబు మాట్లాడలేదు.

సరిగ్గా ఆ సమయంలోనే– తలుపు మీద దబదబా శబ్దమయింది. మరుక్షణంలోనే సీతాపతిరావుగారి గొంతూ వినబడింది.

"మల్లిక తల్లీ! ఒక్కసారి తలుపు తీసుకొని ఇలా రామ్మా!"

గిరిబాబు ఆయన కంఠం వింటూనే చటుక్కున రెండు చేతుల్లోనూ ముఖం దాచుకొని మంచం మీద అటు తిరిగి పడుకున్నాడు– సిగ్గుతో ఈ ప్రపంచానికే భయపడుతున్నట్లుగా కుంచించుకుపోతూ ముడుచుకు పడుకున్నాడు.

మల్లిక ఉలిక్కిపడింది. తనలోని ఆవేశాన్ని, దుఃఖాన్ని చంపేసుకుంటున్నట్లుగా బిగుసుకుంటూ శూన్యంలోకి చూడసాగింది. తరువాత తేరుకుంటున్నట్లుగా త్వరత్వరగా ముఖం తుడుచుకొని, తలుపు వైపుకు వెళ్ళ బోతున్నదల్లా ఒక్క క్షణమాగి, వెనక్కు వచ్చి, తనకోసం క్రింద పరుచుకున్న దుప్పటి తీసి, గిరిబాబు మంచం మీదకు గిరాటు వేసి వెళ్ళి తలుపు తీసింది!

* * *

సీతాపతిరావుగారు తలుపు తీసిన మల్లిక ముఖంలోకి చూస్తూ, "కాస్త నీ సహాయం కావాలమ్మా! కృష్ణమూర్తి గారి వళ్ళు సలసలా కాగిపోతోంది... కలవరిస్తున్నట్లుగా గూడా వున్నాడు...నాకు కళ్ళు సరిగ్గా కనబడవు తల్లీ! ఇక మా ఆడదానికా..."

ఆయన చెప్పుకుపోతున్నారు.

ఆయన మాటలు కొనసాగనీయకుండానే, "ఏం చేయమంటారో చెప్పండి!" అన్నది.

"కాస్త నువ్వు అతడికి జ్వరం తగ్గేటంతవరకూ దగ్గర కూర్చోవాలి!"

"అలాగే!"

కిరణ్ కళ్ళు మూసుకొని పడుకొని వున్నాడు. అతడి వళ్ళు సలసలా కాగిపోతోంది. అతడి నుదుటిమీద తెల్లటి తడిగుడ్డ వున్నది. అతడి పెదాలు వణుకుతున్నాయి– అతడు ఏదో గొణుగుతున్నట్లుగా వున్నాడు.

మల్లిక కుంపటి వెలిగించి ఓ పావుగంటలో కాఫీ కలిపేసి ఓ గ్లాసులో పోసి మూతపెడుతూ, కుంపటి ఆరిపోకుండా నాలుగు బొగ్గులు వేసివుంచింది.

'ఫ్లాస్కో వుంటే బాగుండు!' అనుకున్నది.

ఆమె మనస్సులోని మాట గ్రహించినట్లుగానే, చక్రవర్తి లేస్తూ, "నా కారు డిక్కీలో ఫ్లాస్కో వుండాలి... తెస్తాను!" అంటూనే ఆ వాన జల్లులో తలుపు తీసుకొని బయటకు వెళ్ళి రెండు నిముషాలల్లోనే ఓ పెద్ద బుట్ట, ఫ్లాస్కో పట్టుకు లోపలకు వచ్చాడు.

ఆ బుట్టనిండా పళ్ళు ఉన్నాయి.

"మీరు గుడ్డలు మార్చుకోండి!" అన్నది ఫ్లాస్కో అందుకుంటూ అతడి తడిసిన గుడ్డల్ని చూచి.

చక్రవర్తి సూట్కేసు తెరిచి తువ్వాల తీసుకొని తల తుడుచుకోసాగాడు.

"మీరు ఏ ఊరునుండి వస్తున్నారు?" చక్రవర్తి తల తుడుచుకుంటున్నవాడల్లా ఆగి అడిగాడు.

మల్లిక అధాట్టుగా తలెత్తింది.

"గుంటూరు!" అన్నది అనాలోచితంగా– ఏదో ఒకటి చెప్పాలన్నట్లుగా.

"మీవారి మిత్రుడి పెళ్ళి ఈపాటికి అయిపోయి వుంటుంది గదా... మరి మీ ప్రయాణం ముందుకా, వెనక్కా?"

"లేదు. హైద్రాబాదే వెళతాం!" ముఖంలో ఏలాంటి వికారమూ లేకుండా అన్నది.

చక్రవర్తి మాటలు పెంచలేదు. పొడిగుడ్డలు కట్టుకొని మంచం మీద కూర్చున్నాడు.

మల్లిక గుండెల్లో దిగులు గూడు కట్టుకోసాగింది.

తనకెన్నాళ్ళీ అబద్ధాల బ్రతుకు?

తన గమ్యమేమిటి?

తన భవిష్యత్తేఁవిటి?

సీతాపతిరావుగారు ఇచ్చిన సీసాలోనుంచి, ఓ చిన్న కాగితంలో నాలుగు మాత్రలు వేసి, "నోరు తెరవండి కృష్ణమూర్తిగారూ!" అన్నది.

అతడు నోరు తెరిస్తే ఆ నాలుగు మాత్రలు అతడి నోట్లో వేసింది.

అతడు మళ్ళా కదలకుండా పడుకున్నాడు.

"ఇంతకీ ఈ మందుతో వీరికి జ్వరం తగ్గుతుందంటారా?" అన్నది దిగులుగా కిరణ్ ముఖంలోకి చూస్తూ.

"చూద్దాం!" చక్రవర్తి నవ్వాడు. "హోమ్యోమీద అయితే నాకు అనుమానం లేదుగాని వీరి ట్రీట్‌మెంట్ ఎలా వుంటుందో!"

"ఇప్పుడు టైం ఎంతయింది?" అన్నది– చూపులు గడియారం లేని తన చేతిమీదకు మరలినయి.

"పదకొండు!"

పదకొండు అనుకుండేటప్పటికల్లా ఆవులింత పరామర్శించింది.

చక్రవర్తి చిన్నగా నవ్వి, "మీ వారికి కోపమొచ్చినా సరే మరోసారి ప్రయత్నించాలని వున్నది నాకు!" అన్నాడు.

"ఏవిషయంలో?" తడబడింది మల్లిక.

"మీకు తెలియదు... అదృష్టమంటూ కలిసివస్తే సినీ ప్రపంచమంత సుందరమయినది మరొకటి లేదు!"

"నన్నేం చేయమంటారు?"

"మీవారిని ఒప్పించ ప్రయత్నించండి– నాకు నమ్మకమున్నది... మిమ్మల్ని చూచిన మొదటి క్షణంలోనే అనుకున్నాను... మీరు వెండి తెరమీద చక్కగా రాణించగలరని!"

"ముందు జీవితంలో రాణించనీయండి!" అన్నది దిగులుగా– ఒక్కక్షణం తన జీవితంలో అంతకుముందు జరిగి పోయిన ప్రతిక్షణాన్నీ అతని ముందు పరిచి వుంచాలనిపించింది.

"మీ మాటలు నాకు అర్థం కావటంలేదు!" అన్నాడు చక్రవర్తి ఆమెను విచిత్రంగా చూస్తూ.

"క్షమించండి! ఏఁవీలేదు!" అన్నది. క్షణం సంశయించి– ఇతడు మాత్రం మోసగాడుకాదని నమ్మకమేఁవిటి?... అందరిలాంటి మగవాడు కాడా ఇతడు?

"లేదు! చెప్పండి... మీ మాటల్లో లోతులు, మీ గొంతులో జీర మరో అర్థాన్ని నాకు చెబుతోంది!" అన్నాడు "చొరవ తీసుకుంటున్నందుకు నన్ను క్షమించాలి!"

మల్లిక పేలవంగా నవ్వింది.

గుండెల్లో బరువు ఎగతన్నింది.

"నేను అనాథను!"

"అదేఁవిటి?" అథాట్టుగా అన్నాడు. వింతగా ఆమె ముఖంలోకి చూస్తూ ముందుకు

వంగాడు, ఆమె ఇంకేమి చెబుతుందా అన్నట్లుగా.

"ఈ గృహాన్ని దాటేంతవరకూ నా పరువును నిలబెట్టగలరనే ధైర్యంతోనూ, నమ్మకంతోనూ చెబుతున్నాను... అబద్ధాల గోడల నడుమనుండి... ఈ అర్ధరాత్రి సమయంలో మరో మనిషి ముందు బయటపడి నగ్నంగా నిలబడు తున్నాను!" గొంతులో దుఃఖపు జీర స్పష్టంగా వినబడుతోంది.

"నేను మాట ఇస్తున్నాను... మీరు భయపడనక్కరలేదు... మీ ఆత్మీయుడిగా నన్ను భావించండి!" ఆమె ముఖంలోకి చూస్తూ అన్నాడు చక్రవర్తి.

ఏదో వెతుక్కుంటున్నట్లుగా అతడి ముఖంలోకి కన్నార్పకుండా చూడసాగింది మల్లిక.

"నేను ఇంట్లోనుంచి పారిపోయి వస్తున్నాను!"

"గిరిబాబుగారి తోటా?..."

"– నన్ను చెప్పనీయండి... ఇంట్లోంచి పారిపోయి వస్తున్నాను నేను... నేను బి.ఎ.చదివాను... ఇంకా కొద్ది రోజులలో నాకే కాకుండా, నా కడుపులో రోజు రోజుకూ రూపు ఏర్పరుచుకుంటున్న నా రూపానికి కూడా అధిపతి అయిన ఆ 'దేవుడ్ని' నమ్మి. నా పెళ్ళి స్థిరపరిచి, ఓ కొయ్య పల్లకీ అందరి ఆడపిల్లలకు లాగానే నాకూ తెచ్చి, దానికి తళతళలాడే రంగు గుడ్డలు చుట్టి, చెమ్కీలతో అలంకరించి, నన్ను లక్ష్మీదేవిలా మరో రాజుకు అర్పిద్దామను కుంటుండగా, నా దేవుడు నా కోసంగాను నిర్మించిన గాజుపల్లకీలో దాని మెరుపులూ, అందచందాలు చూచి, నాలోని కోరికలను, ఆశలను ఆపుకోలేక ఎగిరిపోయి వచ్చాను– కానీ, ఆలా వచ్చిన కొద్ది గంటలకే తెలిసిపోయింది... నేను నమ్మిన ఆ దేవుడు 'దేవుడు' కాదని, నా కోసం తెచ్చిన గాజు పల్లకీ నేను కాలుపెట్టిన మరుక్షణంలోనే పుటుక్కుమన్నదనీను..." కళ్ళమ్మట నీళ్ళు చిప్పిల్లినయి. గొంతు బొంగురుపోయింది.

"మీరు ఎక్సయిట్ అవుతున్నారు!"

"నిద్ర పోతున్న నన్ను అర్థరాత్రిపూట ఒంటరిగా వదిలి నా సొమ్ములూ, నేను తెచ్చుకున్న డబ్బూ అపహరించి– ఆ రాక్షసుడు పారిపోయాడు!" ఒక్క క్షణం ఆగింది. "టిక్కెట్టు లేదంటూ టిక్కెట్ కలెక్టర్ నిర్దాక్షిణ్యంగా నన్ను ఓ చిన్న స్టేషన్‌లో దించేశాడు!"

ఆమె చీకట్లోకి చూస్తూ, "మూడు రోజులనుండీ గిరిబాబు గారితో తోటి ప్రయాణీకురాల్లా గడుపుతున్నాను... ఆయన పాపం అమాయకులు... అందరూ మమ్మల్ని దంపతులుగా భావిస్తుంటే ఆయన పడుతున్న క్షోభను నేను చూడలేకుండా వున్నాను!" తలవంచుకొని దిగులుగా అన్నది.

చక్రవర్తి తనలోని సంశయాల నన్నిటినీ దూరం చేసుకుంటున్నట్లుగా, "అయితే మీరు నేను చెప్పిందాన్ని ఎందుకు ఆలోచించగూడదు?" అన్నాడు– అతడిలోని ఆశలు చెట్లయి పుష్పించసాగినయి.

"నేను నేనుగా బ్రతకగలుగుతానా అక్కడ?" అన్నది ఒక్కక్షణమాగి నిర్లిప్తంగా. "నాకూ ఉన్నది ఆశ!... మీరేదో నన్ను బంగారు భవనంలో హంసతూలికా తల్పం మీద కూర్చో పెడతానంటుంటే ఎవరికుండదు ఆశ... అందునా నాలాంటి దానికి!... కానీ, అదీ మరో గాజుపల్లకీ అయితే నేను తట్టుకోగలనా అని!" అన్నది.

"మీరు అంతగా భయపడాల్సిందేమీ లేదు... నేనున్నాను...నాకు ప్రత్యేకంగా వేరే ఒక భవనమున్నది... అక్కడ హాయిగా మీరు ఉండవచ్చు... కొన్నాళ్ళు పోతే మీకు మీరే ఓ భవంతిని నిర్మించుకోవచ్చు!"

అతడి కంఠం వింటుంటే మల్లికకు భయం వేసింది.

"అంటే...?" అన్నది.

చక్రవర్తికి ఇంకెలా చెప్పాలో అర్థం కాలేదు. ఇంకేం చెప్పటం అవసరం లేదన్నట్లుగా మంచం మీద పడుకొని దుప్పటి కప్పుకున్నాడు!

* * *

కిరణ్ ఒక ప్రక్కకు ఒత్తిగిల్లాడు మూలుగుతూ. మల్లిక ఉలిక్కిపడి– ఆలోచనల

తెరలు చీల్చుకొని– అతడి వైపుకు చూచింది.

"ఆకలవుతున్నది!"

మరుక్షణంలోనే ఫ్లాస్కోలో కాఫీ గ్లాసులో పోసి అతడి పెదాల దగ్గరకు జేర్చింది.

"కొద్దిగా లేవండి!"

కిరణ్ చేతుల మీదుగా లేచి వేడివేడి కాఫీ త్రాగసాగాడు.

అతడి కళ్ళు కృతజ్ఞతా సూచకంగా మల్లిక ముఖంలోకి చూచినయి.

"మీరు పడుకోలేదా?" అంత నీరసంలోనూ అడిగాడు.

"లేదు!"

"టైం ఎంతయింది?"

"పన్నెండు దాటి ఉండవచ్చు!"

"నన్ను క్షమించండి!"

మల్లిక మాట్లాడలేదు. నవ్వి ఊరుకున్నది.

"మీకు శ్రమ ఇస్తున్నాను!"

"ఫరవాలేదు... నేను అలా భావించటం లేదు!"

అతడి కళ్ళు ఆమె మాటలకు కాంతివంతమయినయి.

తదేకంగా... అంత నీరసంలోనూ– ఎంతో ఆత్మీయంగా ఆమె ముఖంలోకి చూస్తూ వుండిపోయాడు.

"ఎలా ఉన్నది మీకు?"

"నాకేమీ తెలియడంలేదు!"

"అంటే?" వింతగా అతడి మొహంలోకి చూచింది.

“ఇప్పుడు పన్నెండు గంటలు అయిందీ అంటే... అప్పుడేనా అనిపిస్తోంది!”

మల్లిక మాట్లాడలేదు.

“మీకు ఒంటరిగా కూర్చుంటే భయం వేయటం లేదా?”

లేదన్నట్లుగా తల అడ్డంగా ఊపింది.

ఆమెకూ కళ్ళు మూతలు పడుతున్నాయి.

“తలమీద తడిగుడ్డ తీసివేయమంటారా?”

“చాలా బరువుగా భయంగా వున్నది!” అన్నాడు.

మల్లిక జాలిగా అతడి ముఖంలోకి చూచింది.

”ఎందుకో యిందాకంత జ్వరంలోనూ... మీరంతా భోజనం చేస్తున్నప్పుడు... నా గురించి నేను భయపడ్డాను!”

అతడి ముఖంలోకి తదేకంగా చూడసాగింది మల్లిక.

అతడి మాటలు విచిత్రంగా తోచినయి ఆమెకు.

“ఎందుకని?” కళ్ళు పెద్దవి చేసుకు చూస్తూ అడిగింది.

“చచ్చిపోతానేమోనని!”

ఉలిక్కిపడింది మల్లిక.

‘జ్వర తీవ్రత వలన కాదుగదా ఈ ప్రేలాపన’ నుదురు ముడివేసింది అతడి ముఖంలోకి చూస్తూ.

కిరణ్ చిన్నగా నవ్వాడు.

“నిజం... నేను అబద్ధం ఆడటంలేదు!”

“ఇప్పుడెందుకవన్నీ?”

ఒక్కక్షణం కళ్ళార్పకుండా సూటిగా మల్లిక ముఖంలోకి చూస్తూ, కొద్దిగా లేచి, "మల్లికా!... మిమ్మల్ని నేను ప్రేమిస్తున్నాను... నేను ప్రేమిస్తున్నాను, మల్లికా!" అన్నాడు.

మల్లిక కలవరపడింది. అతడి మాటలకు విభ్రాంతిగా అతడి ముఖంలోకి చూడసాగింది.

"మీరు... మీరు... పడుకోండి ముందు... మీ వంటి మీద జ్వరం ఎలా పేలిపోతున్నదో చూచారా... మీరు కళ్ళు మూసుకు పడుకోండి!" అన్నది.

చుట్టూ తననీ, ఆ ఇంటినీ ఆవరించిన చీకటిని... గుడ్డిదీపపు వెలుగు జయించలేకపోతున్నదేమో ననిపించగా భయం భయంగా అతడి ముఖంలోకి చూస్తూ వుండిపోయింది.

అతడి మాటలు వింటుంటే... ఒక్కసారిగా లేచి తలుపు తీసుకొని వానలోకి పారిపోయి ఎవ్వరూ మనుష్యులు లేనిచోట కాలి బూడిదయిపోవాలనిపిస్తోంది.

అంత నీరసంలోనూ ఎంతో ఆత్మీయంగా ఆమె ముఖంలోకి చూస్తూ ఉండిపోయాడు కిరణ్.

"నా చేయి పట్టుకో మల్లికా!" అన్నాడు. అతడి చేయి వణుకుతోంది. అతడి శరీరం వణుకుతోంది.

మల్లిక అది గమనిస్తూనే భయ విహ్వల అయింది.

"సీతాపతిరావుగారిని లేపమంటారా?"

"దేనికి?"

వెలుగుతున్న కిరసనాయిల్ దీపంలో ఏదో పురుగు పడి గిలగిలా కొట్టుకు చచ్చింది.

"నేను నిన్ను అమితంగా ప్రేమిస్తున్నాను, మల్లికా!"

"నేను... నేను– "

"నాకు తెలుసు... నేనంతా గ్రహించాను!"

"కృష్ణమూర్తిగారూ!" ఆవేశం మనిషిని నిలువెల్లా కంపింప జేసింది.

"అబద్ధమంటారా?"

ఇక అక్కడ ఒక్కక్షణం ఉండలేకపోయింది. విసురుగా గిరిబాబు పడుకున్న గదిలోకి వచ్చేసింది. తలుపులు పెద్ద శబ్దమయ్యేలా మూసివేసి కటిక నేలమీద రెండు కాళ్ళ మధ్య తలను ఇరికించుకొని కూర్చున్నది. ఎంత ఆపుకుందామని ప్రయత్నించినా ఏడుపు ఆగలేదు.

– తన బ్రతుకు ఇదా ఇక?

ఆమెలోని నరాలన్నీ మెలితిరిగిపోతున్నాయి. ఆమె గిలగిలలాడుతోంది. ఏదో భూతం తననూ తన గొంతునీ నొక్కివేస్తున్నట్లనిపించింది.

గిరిబాబుకు మెళుకువ వచ్చింది ఆమె ఏడ్పుకు.

"ఏడుస్తున్నావా, మల్లికా?"

"ఏడవక నన్నేం చేయమంటారు?"

"ఏఁవైంది?"

దిగులుగా భయంగా తలెత్తి గిరిబాబు ముఖంలోకి ఒక్కక్షణం చూచి తిరిగి తలను రెండు కాళ్ళమధ్య ఇరికించుకొని ఏడ్వసాగింది.

గిరిబాబుకు జాలివేసింది.

మంచం మీదనుండి లేచివచ్చి ఆమెకు దగ్గరగా కూర్చున్నాడు. అమె తలమీద చేయివేసి అనునయించసాగాడు.

"ఛ! ఛ!... ఏఁవిటది?... ఎందుకా ఏడుపు... ఏఁవైందో చెప్పు!"

అతడి హృదయం ద్రవించింది.

"ఇంకా నేనెన్నాళ్ళు ఇలా బ్రతకాలి?"

అతడి దగ్గర ఆ ప్రశ్నకు సమాధానం లేదు.

ఆమె వెన్ను మీద రాస్తూ, "తప్పుకదూ... నువ్వే చెప్పావ్ ఎంతో ధైర్యస్థురాలివని... నేనూ నమ్మాను... చూద్దాం ఏదో ఒకటి ఆలోచిద్దాం పడుకో... టైం ఎంతయిందో తెలుసా?" అన్నాడు చేతి గడియారం వంక చూచుకుంటూ. "ఒంటి గంటవుతోంది... ఇక పడుకో!" అన్నాడు.

అతడిని ఆ అర్థరాత్రి సమయంలో హృదయంకదిలేలా కుమిలికుమిలి ఏడుస్తున్న మల్లిక మీద కరుణ ఆవరించింది.

"నాకు భయమేస్తున్నది!" అన్నది జాలిగా.

"నేను ఇక్కడే కూర్చుంటాను... పడుకో!"

"నన్ను వదిలి వెళ్ళరు కదూ!"

"ఉఁహూఁ..."

ఆమె ఆ నేలమీదే ఓ ముతక పట్టాపరుచుకొని ముడుచుకు పడుకున్నది. గిరిబాబు లేచి తన మంచం మీద వున్న దుప్పటిని తీసి ఆమెకు కప్పాడు. ఆమె పక్కగా కూర్చున్నాడు.

ఉండి ఉండి ఎంతగా ఏడుపు ఆపుకున్నా అది ఎక్కువవుతూనే వున్నది.

ఆ గుడ్డి వెలుగులో నిండా దుప్పటి కప్పుకొని ముడుచుకు పడుకొని వున్న ఆమెను చూస్తుంటే అమితమైన జాలి వేయసాగింది గిరిబాబుకు. ఇంకా ఆమె చేయి పట్టామీదగా వున్న తన చేతిని గట్టిగా పట్టుకునే వున్నది.

ఈ వయస్సులో ఎంత కష్టం?

ఆమెను తనెలా రక్షించగలడు?

ఆమెనే చూస్తూ కూర్చుండిపోయాడు.

కొద్ది నిముషాల క్రితం దుఃఖపు వెల్లువలో మునిగి పోయివున్న మల్లిక ముఖమే అతడిముందు మెదులుతోంది. అదే దగ్గరై మరింత దగ్గరై అతడిని సంపూర్ణంగా ఆవరిస్తోంది. అతడిని కలిచివేస్తోంది. అతడిని ద్రవీభూతుడిని చేస్తోంది.

సర్వమూ మల్లికే అవ్వగా తనను తానే ప్రశ్నించుకుంటున్నాడు. తరచి తరచి ఆలోచించుకుంటున్నాడు.

ఆ ఆలోచనల సుడుల నడుమ– మూలగా వెలుగుతున్న దీపం పెద్దదై– తనను చుట్టివేసిన చీకటిని విరిచేస్తూ– తనని దానిలో లీనం చేసుకుంటోంది.

చీకటంతా మాయమవ్వగా కనబడింది... మల్లిక!

అందరూ అనుకుంటున్నట్లుగానే తానే ఆమెకు ఎందుకు భర్త అవ్వకూడదు?

ఆవేశం నరనరాన్నీ ఆవరించగా ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

'మల్లికా!'

దూరాన ఆకాశంలో ఎక్కడో మెరిసిన మెరుపు ఎత్తుగా వున్న కిటికీనుండి లోపలకు తళుక్కున మెరిసింది.

తానీ త్యాగం చేయలేడా?

ఒక అనాథను రక్షించలేడా?

సర్వనాశనమయిపోతున్న ఓ స్త్రీని ఆదుకొని మనిషిగా చేయలేడా?

బయట ఆకాశంలో ఉరుములు ఫెళఫెళారావాలు చేస్తున్నయి. గుండె గుబులు గుబులుమంటోంది.

– అంతకంటే మల్లికకు కావాల్సిందేమున్నది?

ఆమె జీవితానికి అంతకు మించిన వెలుగు మరెక్కడ దొరుకుతుంది?

ఎక్కడో పిడుగు పడింది.

ఉలిక్కిపడ్డాడు గిరిబాబు.

అమ్మా... నాన్నా...

వాళ్ళనెలా ఒప్పించటం?...

ఇలాంటి స్త్రీని తన భార్యగా వాళ్ళను ఎలా అంగీకరింపజేస్తాడు?

అబద్ధాలు చెప్పాలి... మల్లికకోసం... మల్లిక జీవితం కోసం తానామాత్రం కథలల్లలేడా? వాళ్ళను నమ్మించలేడా?

తాను చదువుకునే రోజులనుండీ ప్రేమిస్తున్నానని చెప్పాలి!

తన మాటను కాదంటారా వాళ్ళు?

శరీరంలో నూతన తేజం ఉవ్వెత్తున లేచింది.

"మల్లికా!"

హృదయానికి హత్తుకొని, 'జీవితంలో ఇక నీకెన్నడూ కంటతడి పెట్టనవసరం లేదు!' అని చెప్పాలి. ఆ మాటలు చెప్పి ఆమె చెంపల్లో కెంపులు చూడాలి. ఆమె కళ్ళల్లో వెలుగును చూడాలి. ఆమె హృదయంలోని ఆనందాన్ని చూడాలి. ఆమె సంతోషాన్ని చూడాలి.

ఇప్పుడే నిద్రలేపి ఆమెకు చెబుదామా అన్నంత ఆవేశమొచ్చింది.

ముడుచుకు పడుకున్న అమెకు మరింత దగ్గరిగా జరిగాడు!

* * *

గిరిబాబు లేచేటప్పటికి క్రింద పరిచివున్న పట్టామీద మల్లిక కనబడలేదు.

ఆమె అప్పటికే కిరణ్ దగ్గరకు వెళ్ళి వున్నది.

కిరణ్ లేచి కూర్చొని కాఫీ త్రాగుతున్నాడు. మల్లిక మంచం ప్రక్కగా కూర్చొని కాఫీ త్రాగుతూ... అతడేదో చెబుతుంటే వింటూ నవ్వుతున్నది.

గిరిబాబు పెద్దగా, "మల్లికా!" అని పిలిచాడు.

కిరణ్ అన్నాడు: "గిరిబాబుగారు పిలుస్తున్నట్లున్నారు!" ఆ కంఠంలో విరుపు వున్నది.

మల్లిక లేస్తూనే, "వస్తున్నా!" అంటూ గిరిబాబు గదిలోకి వచ్చింది.

గిరిబాబు మల్లిక వంకే చూడసాగాడు.

"ఇలారా!"

"చెప్పండి!"

తదేకంగా ఆమె ముఖంలోకి చూస్తూ వుండిపోయాడు గిరిబాబు.

మూడు రోజుల్లోనే ఆమె కళ్ళ చుట్టూ దిగుళ్ళ గూళ్ళు కట్టుకుపోయి వున్నయి. చెంపల్లోని పేలవత్వం ఆమె అందాన్ని హరిస్తోంది. కళ్ళు లోపలకు పోయి మిణుకు మిణుకు మంటున్నాయి... పెదాలు తెల్లబడి పాలిపోయి వున్నాయి.

"మల్లికా!" అన్నాడు లేచి నిలబడుతూ.

ఆ పిలుపులో తెల్లవార్లూ తనలో ఆమె మీద కూర్చుకున్న ఆప్యాయతనూ జాలినీ రంగరించి వదిలాడు.

కదిలిపోయింది మల్లిక.

"మీరు...?"

"అవును... నేనే మల్లికా... ఒక్కసారి దగ్గరకు ఇలా రా... నువ్వు... నువ్వు...!" మాటలు తడబడ్డాయి. హృదయంలో పొందిక బరుచుకున్న మాటలన్నీ ఒక్కసారే బయటకు వస్తున్నట్లు అనిపించగా ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. గుండెలు బరువెక్కినయి.

ఏదో చెప్పాలన్న ఆవేశంతో తల్లడిల్లగా, శరీరాన్ని సన్నటి వణుకు ఊపసాగింది. అడుగులు తడబడుతుండగా ఆమెకు అతి సమీపంగా వెళ్ళి భుజం మీద చేతులు వేసి దగ్గరకు లాక్కోబోయాడు.

మల్లికకు అతడి ప్రవర్తన విభ్రాంతి కలిగించింది.

'ఉన్నతుడనుకుంటున్న గిరిబాబు కూడా తనని....?'

చటుక్కున అతడి రెండు చేతులనూ తోసివేసి, వెనక్కుతిరిగి అక్కడ ఉండటమే అసహ్యమన్నట్లుగా వెళ్ళిపోయింది మల్లిక.

'ఛీ! ఛీ! వెధవ మనుష్యులు... వెధవ ప్రపంచం!'

మెరుపులా మాయమయింది.

గిరిబాబు నిర్వీర్ణుడయ్యాడు. ఏమీ తోచనివాడిలా మంచం మీద నిరాశతో కూలబడిపోయాడు.

అతడి ముఖాన మల్లిక చాచి కొట్టినట్లనిపించిన ఆ అవమానపు బాణాలు అతడిని కలిచివేసినయి. అతడిని నిలువునా దహించి వేసినయి.

* * *

"చెప్పండి!"

మల్లిక మనస్సులో ఆవేశాన్ని ఎంత అదిమి పెట్టుకున్నా... ముఖం మీద దాని ఛాయల్ని మరుగు పరుచుకోలేకపోయింది.

కిరణ్ కనిపెట్టాడు.

అతడి జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. రాత్రి వచ్చిన అంత జ్వరం... అందుమీదట ఆహారం లేకపోవటంతో వచ్చిన నీరసం... అతడికి చికాకు కలిగిస్తున్నయి.

అతడు లేచి మంచం మీద బాసికపట్టు వేసుకు కూర్చున్నాడు.

అతడు నవ్వుతున్నాడు.

"చెప్పండి!" మల్లిక రెట్టించింది.

"నేను చెప్పేందుకేమున్నది?... ఎంతసేపు నా గుమాస్తా జీవితాన్ని గురించి

మీరు వింటారు?... కాని, ఇది చెప్పండి... మీరు గిరిబాబుగారి గదిలోనుండి పొగలు గ్రక్కుతూ బయటకు వచ్చారు... కారణం తెలుసుకోవచ్చా?" అన్నాడు జాలిగా ఆమె ముఖంలోకి చూస్తూ.

"దాని వలన మీరు పొందే లాభం?"

"కష్టాలలో వున్న వారికి సహాయం చేయాలనేదే నా ధ్యేయం!"

"నేను మాత్రం మీరనుకున్నంత కష్టాలలో ఏమీ లేను!" అన్నది బింకంగా.

... అలా అంటుంటే ఆమె ముఖమంతా ఎర్రబడింది.

కిరణ్ తడబడ్డాడు.

''అదికాదు నా ఉద్దేశ్యం... మిమ్మల్నెంతో ఆత్మీయురాలిగా ఊహించుకుంటున్నాను... మీకేమాత్రం సాయం కావాల్సినా నేను అన్ని విధాలా...!"

"కృతజ్ఞురాలిని!" లేచి నిలబడింది.

బయటకు వచ్చి ఆకాశంలోకి– తన జీవితంలోకి లాగానే ఒక్కసారి చూద్దామనిపించగా... ఆమెకు ఆకాశం గాని, తన ముందు జీవితంగాని కనబడకముందే... చక్రవర్తి గొంతు వినబడింది.

"ఓహో! మీరిక్కడవున్నారా?" అన్నది కొద్దిగా తడబాటుతో.

చక్రవర్తి చిన్నగా నవ్వాడు. "నా కిలాంటి వాతావరణం చూస్తూ కూర్చోవాలంటే ఎంతో హాయిగా వుంటుంది... చూడండి ఆకాశం ఎంత నిర్మలంగా వున్నదో! నిన్నటికీ ఈరోజుకీ ఎంత తేడా?" అన్నాడు అటే తన్మయంగా చూస్తూ.

తలెత్తి మల్లికా చూచింది.

"నాలుగు రోజుల క్రితం నా జీవితమూ అంత అందంగానే వున్నది!"

"ఈ నాలుగు రోజులబట్టీ పట్టిన ముసురే మీ జీవితానికి ఒక శనైతే... ఆ శనిని వదిలించుకోవడం ఈ క్షణాన మీ చేతులలో పనే!"

"ఆకాశాన పట్టిన ముసురుకీ, నాకు పట్టిన శనికీ సామ్యమయితే ఇందవచ్చునేమోగాని ఆ ముసురంత తేలిగ్గా నాకు పట్టిన శని మాత్రం వదలదు... అంతే కాదు... నన్ను ముందు శని వదులుతుందో, శనినే నేను ముందు వదులుతానో కాలమే నిర్ణయిస్తుంది!"

చక్రవర్తి నవ్వి, "మీరే మీకు పట్టిన శనిని వదిలించుకోగలరు... మీకా శక్తి వున్నది!" అన్నాడు.

"నేనిప్పుడు తీగమీద నడుస్తున్నాను. ఎటు పడ్డా నాకు అగాధమే... ఎటూ వెలుగు కనబడటం లేదు... తీగ మీద చివరికంటూ నడవగలిగితే నాకు గమ్యం దొరకవచ్చుగాని, అలా నడిచే శక్తి మాత్రం నాకు లేదు!"

"అలా తీగమీద నడిచే వాళ్ళు బ్యాలన్స్ కోసం, చేతిలో ఏదైనా ఆధారాన్ని వుంచుకోవాలి!" పైన ఎటో చూస్తూ అన్నాడు.

"ఆ చేయూత అన్ని విధాలా మంచిది కావాలిగదా!"

"మనం ఎన్నుకోవటంలో ఉంటుంది!"

మల్లిక పేలవంగా నవ్వింది.

"ఆ ఎన్నికలోనే నేను పరాజితురాలిని అయ్యాననటానికి నా గత జీవితమే నిదర్శనం!" అంటూనే లోపలకు వచ్చేసింది, ఆ సంభాషణను అంతటితో త్రుంచివేస్తూ మల్లిక.

* * *

గిరిబాబుకు బయటకు ఎక్కడికైనా వెళ్ళాలని వున్నది, మల్లికను తీసుకొని– తనలో గూడు కట్టుకుంటున్న భావాలను ఆమె ముందు పరిచివుంచాలనిపించింది. అందుకే ఆమెను దేవాలయానికి దేవుణ్ణి చూసే మిషతో ప్రయాణం చేశాడు.

అద్దాన్ని మంచంకోడుకు ఆనించి క్రింద కూర్చొని తన పొడువుపాటి జడను

ముందుకు వేసుకొని విప్పుకోసాగింది.

మంచం మీద కూర్చొని ఆమె జడవంకే చూస్తూ వుండిపోయాడు గిరిబాబు.

"మాట్లాడరేం?" అన్నది మల్లిక.

"ఉఁహూఁ... వద్దు... నిన్ను చూస్తూ ఇలాగే కూర్చోనీయ్!"

తలెత్తి సూటిగా అతడి ముఖంలోకి చూసింది.

"ఒక్కసారి మీ కళ్ళు చూడనీయండి!"

"దేనికి?"

"జబ్బు ఏఁవైనా చేసిందేమోనని!"

ముఖానికి గంటుపెట్టుకున్నాడు గిరిబాబు.

"లేకపోతే ఏఁవిటి... నన్ను చూస్తూ కూర్చుంటే మీకేమి ఒరుగుతుంది... అయినా పరాయి ఆడదాన్ని అలా చూస్తూ కూర్చుంటే నలుగురూ ఏఁవయినా అనుకుంటారనే సిగ్గయినా లేదా?"

"నువ్వు పరాయి దానివని ఎవరనుకుంటున్నారు?"

"ఎవరికి తెలియదు!... చక్రవర్తిగారికి తెలుసు... కృష్ణమూర్తిగారికి తెలుసు..."

"నువ్వు మనం భార్యాభర్తలమనే చెప్పానంటివి కదా!" అన్నాడు భయం భయంగా మల్లిక ముఖంలోకి చూస్తూ.

మల్లిక ఫక్కున నవ్వింది. "సీతాపతిరావుగారికి చెప్పానని చెబితేనే నిప్పులా మండిపోతిరి... అందుకని..."

"అయితే నేనే చెబుతాను!" ఆవేశంగా లేవబోయాడు.

"ఏమని?" మల్లిక విచిత్రంగా అతడి ముఖంలోకి చూడసాగింది.

"మల్లిక నా భార్య అని!"

"అదేంవిటి?" మల్లిక శిలయిపోయింది.

"అవును మల్లికా! నువ్వు నా భార్యవని చెబుతాను!" ముందుకు వంగి ఆమె ముఖంలో ముఖం పెట్టి అన్నాడు.

మల్లిక ఆ షాక్‌నుండి కోలుకోనేలేదు.

"నిజం... నన్ను నమ్ము!" తిరిగి గిరిబాబే అన్నాడు.

కనురెప్పలు రెపరెపలాడించింది. గుండెలు ఎగిరెగిరి పడుతున్నంత ఆవేశమొచ్చింది. ఆమె ముఖం విశాలమయింది. ఆమె కళ్ళల్లోకి ఒక్కసారిగా వేయి కిరణాల వెలుగు చొచ్చుకు వచ్చినట్లనిపించింది. ఆమె హృదయం ఉవ్వెత్తున లేచింది. అమె నరనరాలు ఆనందంతో నిండిపోయి ఆమెను ఉక్కిరిబిక్కిరి చేయసాగినయి.

– మరుక్షణంలోనే ముఖమంతా నల్లబడిపోయింది. చెంపలు పాలిపోయినయి. పెదవులు అల్లల్లాడినయి. ఏదో అభూతమైన శక్తి శరీరాన్నంతా పట్టుకొని కుదిపి, నెత్తురు పీల్చేసి, పిప్పి పిప్పిచేసి వదిలేసినట్లుగా జారిపోయింది.

ఆమె కళ్ళను నీటిపొరలు క్రమ్మివేసినయి.

"నన్ను ఎగతాళి చేస్తున్నానని ఒక్కసారి అనండి!" ఆమె ఎక్కడో లోతైన బావిలోనుండి అన్నట్లుగా అన్నది.

"నిజం మల్లికా! నిజమే చెబుతున్నాను... నీకెందుకు అనుమానం?"

తల అడ్డంగా ఊపింది. "నిజంకాదు... ఇది నిజంకాదు... మిమ్మల్నేదో భూతమావహించింది!"

గిరిబాబు ముందుకు వంగి ఉత్సాహంగా, "ఒట్టేయమంటావా?" అని అడిగాడు.

"ఈ పాపాత్మురాలికి భర్త అయి మీరు పాముకు తినేదేమిటి?" అన్నది– ఆమె ఏడుపును ఆపుకోలేకపోయింది. "మీరు చెప్పింది నిజమని నమ్మమంటే నాకు దుఃఖమొస్తున్నది!"

"దుఃఖం దేనికి?"

"సంతోషించలేను గనుక..."

అర్థం కానట్లుగా ఆమె ముఖంలోకి చూస్తున్నాడు.

– ఎడారిలో దారి తెలియక, ఎండవేడిమికి తట్టుకోలేక, నిర్జీవంగా తిరుగుతున్న ప్రాణి ఒయాసిస్సు చూసినప్పుడు కూడా సంతోషంతో కేరింతలు కొట్టక దుఃఖించటమా?

ఆమె ముఖంలోకి చూస్తుంటే ఆమెలో ఎగిసి పడుతున్న కల్లోలం అర్థమయి జాలివేసింది.

"కళ్ళు తుడుచుకో!"

తుడుచుకున్నది బుద్ధిమంతురాలిలా.

"జడవేసుకో!"

జడవిప్పుకోసాగింది.

గిరిబాబు పడుకున్నాడు.

"త్వరగా కానీయ్! గుడికి వెళ్దాం!"

మాట్లాడకుండానే తల దువ్వుకోవటం మొదలుపెట్టింది. అలా దువ్వుకుంటూ తలవంచుకుంటే కడుపులో పెరుగుతున్న పాపం ఆమె హృదయాన్ని వెయ్యి ముక్కలు చేస్తూ కనబడింది. ఆమె విచలిత అయింది– ఆమె దీనంగా అటు తిరిగి పడుకున్న గిరిబాబువంకే చూస్తూ కూర్చుండిపోయింది.

ఆమెకు తన ముందు జీవితమంతా ఓ అగాధంలా కనిపించసాగింది. అలాగే కన్నార్పకుండా ఆ అగాధంలోకి చూస్తుంటే– ఎత్తయిన పలకమీద ఓ దేఁవుడు కనబడ్డాడు. అతడు నవ్వుతున్నాడు. తన రెండుచేతులూ జాచి ఆహ్వానిస్తున్నాడు.

ఆ దేఁవుడే గిరిబాబు!

గిరిబాబు చటుక్కున ఇటు తిరిగి, "అయిందా?" అన్నాడు.

మల్లిక ఉలిక్కిపడి– అతడివైపే కేంద్రీకృతమైయున్న తన చూపులను క్రిందకు వాల్చి దబదబా రిబ్బన్‌ను తీసుకొని జడ చివర కట్టుకోసాగింది.

గిరిబాబు త్వరత్వరగా లేచి కూర్చొని, "మల్లికా! ప్లీజ్!" అన్నాడు.

"ఏఁవిటి?" అన్నది విచిత్రంగా అతడి ముఖంలోకి చూస్తూ.

"రిబ్బన్ పెట్టుకోబోకు!"

"అదేఁవిటి?"

"నీకు రిబ్బన్ బాగుండదు... చివరలు అలా వదిలేశేయ్!"

"ఉఁహూఁ... నాకు నచ్చదు!... రిబ్బన్ వుంటేనే బాగుంటుంది!"

"ప్లీజ్! నా కోసం!"

"నాకు బాగుండకపోయినా మీరు చెప్పినట్లు వినాలా?" ఆమెకు ఉక్రోషమొచ్చింది.

– తనను అతడు శాసిస్తున్నాడా? గిరిగీసి బంధిస్తున్నాడా?

తల విదిలించింది.

"అవును!"

"ఏఁవిటి అవును?"

"నేను చెప్పినట్లు వినాలి!"

"వినకపోతేనో?"

"చెవులు మెలేసి వినేలా చేస్తాను!" ముందుకు వంగి ఆమె చెవి వేపుకు చేయి జాచాడు.

విదిలించి కొట్టింది– అతడి చేష్ట అసహ్యమనిపించగా.

“మీ ఉద్దేశ్యమేమిటో నాకర్థం కావటంలేదు... నా మీద మీ పెత్తనమేమిటి?”

“నీ మీద నా పెత్తనంగాక మరెవ్వరిది వుంటుంది?” అతడికి ఆమె విదిలింపు ఏమాత్రమూ కష్టం కలిగించలేదు.

“మీరు నాకేమౌతారని?”

“ఇంతవరకూ కొందరి దృష్టిలోనే భర్తనయ్యాను... ఇక ముందు అందరి దృష్టిలోనూ భర్తనవుతాను గనుక!” చాలా తాపీగా అన్నాడు.

“సిగ్గు వేయటంలేదా మీకు అలా చెప్పుకోవటానికి!”

“నాకు సిగ్గు దేనికి... నా భార్యను గురించి నేను చెప్పుకోవటానికి!”

విసురుగా లేచి నిలబడింది మల్లిక. “సిగ్గు లేని మనుష్యులకు సిగ్గే సింగారం... ఎవడితోనో లేచొచ్చిన ఆడదిట ...ఈయనగారికి భార్యట...ఏ పాపాత్ముడి విషాన్నో మోస్తున్న ఈ దౌర్భాగ్యురాలికి ఈ మగమహారాజు మొగుడట!” గిరుక్కున మెరుపులా వెనక్కు తిరిగింది. “ఇంకెక్కడైనా అలా చెప్పుకుండేరు... నలుగురూ ఉమ్మేస్తారు!”

“మల్లికా! ఏంవిటిది? నిన్ను నువ్వే ఎందుకంతగా చిన్నబుచ్చుకుంటావ్?” అతడు లేచి నిల్చున్నాడు.

మల్లిక తన సూట్కేస్ దగ్గరకు వెళ్ళి, దాన్ని తెరిచి, ఇంకో రిబ్బన్ కూడా తీసుకొని వెనక్కు తిరిగింది.

“జాగ్రత్త! ఇంకెవరి ముందైనా నోరు జారారో తరువాత విచారించవలసి వస్తుంది... అంతేకాదు జీవితాంతం అఘోరిస్తారు కూడా!” నవ్వటానికి ప్రయత్నించింది ఆ మాటలు చెబుతూ.

దిక్కు తెలియని వాడిలా ఆమె ముఖంలోకే చూస్తూ గిరిబాబు నిల్చుండిపోయాడు.

ఆమె జడపైన కూడా– ఓ పువ్వులా రిబ్బన్ కట్టుకుంటున్న తీరు చూస్తే... తను వద్దనటం వలన ఆమె కావాలని మరొకటి కూడా కట్టుకుంటున్నట్లే అనిపిస్తున్నది.

నీరసంగా... ఆమె చర్యను గమనిస్తూ వెనక్కు వాలిపోయాడు గిరిబాబు.

మల్లిక గర్వంగా, ఠీవిగా ఒకసారి గిరిబాబు వంక చూచి తల ఎగరవేసింది.

చేతిలో అద్దాన్ని ఎత్తిపట్టుకొని, అల్లుకున్న జడను, పైన పెట్టుకున్న రిబ్బన్ను, గుండ్రంగా రింగులు రింగులగా వదిలి వేసిన జుట్టుతో వున్న చెంపలను చూచుకున్నది.

“చీర మార్చుకువస్తాను... లేచి గుడ్డలువేసుకోండి!” అని అతడినుండి సమాధానం కోసం ఎదురు చూడకుండానే, పెట్టెలోనుంచి శాటిన్ చీర ఒకటి తీసుకొని వంటయింట్లోకి వెళ్ళిపోయింది.

గిరిబాబు నీరసంగా లేచాడు. లేచి గుడ్డలు మార్చుకున్నాడు. తల దువ్వుకున్నాడు.

మల్లికను ఎలా ఒప్పించాలో అతడికి ఎంతగా ఆలోచించినా అర్థమేకావటంలేదు.

– అటు ఆమె ఉద్దేశ్యమూ అర్థం కావటంలేదు!

ఎందుకని– ఎదురు వస్తున్న సుఖాన్ని, సంతోషాన్ని కాలదన్నుకుంటోందో– తెలుసుకోవటం ఒక పెద్ద సమస్యే అయి కూర్చున్నది.

జీవించటం చేతగాకనా?

ఆనందాన్ని అనుభవించే ఆశలేకనా?

ఉఁహూఁ...

తల విదిలించాడు.

– మల్లికను మార్చితీరాలి!

ఆమె జీవితం అడవిలో ఎండిపోయి పడివున్న మోడైపోగూడదు!

ఆమెకు ఏం తక్కువని!

ఒక్కసారి మోసపోయినంత మాత్రాన భవిష్యత్తంతా బూడిదపాలు చేసుకోవాల్సిందేనా?

– తనను తాను ఆద్దంలో చూసుకుంటున్న అతడు, వెనగ్గా వచ్చి నిలబడి, మల్లిక వీపు తట్టి, "మీకు పూర్తిగా పిచ్చెక్కినట్లే!" అని నవ్వేటంతవరకూ, ఊహల లోతులనుండి బయట పడలేకపోయాడు.

"ఊఁ... పదండి!" అన్నది.

ఆమె ఆ కనకాంబరపురంగు శాటిన్ చీరలో తళతళా మెరిసే ఓ దేవతలా కనబడసాగింది. ఎర్రటి మల్లికకు ఆ చీర గులాబీ రంగును పులుముతోంది.

ఆమెనే చూస్తూ ఉండిపోయాడు.

"నేనిలా వుండటం మీ కిష్టంలేదా?"

ఉలిక్కిపడ్డాడు గిరిబాబు.

ఆమె నవ్వింది. నవ్వితే బుగ్గల్లో అందంగా సొట్టలు పడ్డాయి. అలా సొట్టలు పడ్డచోట పౌడర్ రాసుకుంటూ గిరిబాబునే చూస్తూ నవ్వుతున్నది.

"ఏఁవిటి నువ్వంటున్నది?"

"ఇలా మీరు చూస్తుంటే నాకు దిష్టి తగలదనే గ్యారంటీ ఇవ్వగలరా?"

"బయటవాళ్ళు చూస్తేగాని... తనవాళ్ళ కేఁవిటి?" అన్నాడు కళ్ళకు కాంతి పులుముకుంటూ.

"అఁహాఁ... పాపం! మనం ఎంత దగ్గరివాళ్ళమో ఒక్కసారి చెప్పండి!" అన్నది చాలా దగ్గరిగా వచ్చి.

ఆమెను అలాగే మీదకు గుంజుకొని గట్టిగా గుండెలకు హత్తుకుంటూ, 'ఇంత దగ్గరదానివి!' అని చెప్పాలన్నంత ఆవేశమొచ్చింది గిరిబాబుకు.

కాని, నిగ్రహించుకున్నాడు.

ఆవేశంతో బిగుసుకుపోతున్న చేతుల్ని సడలించాడు.

"దేవాలయానికి పద, చెబుతాను!" అన్నాడు.

"అక్కడికే పదండి... అక్కడగాని మీ తిక్క పూర్తిగా వదిలించను!" అంటూనే ఫక్కున నవ్వింది.

"నువ్వు ఎప్పుడు పడితే అప్పుడు అలా నవ్వవద్దు మల్లికా!... ఎప్పుడైనా మూటగట్టి, మూటగట్టి ముత్యాలన్నీ ఒక్కసారిగా వెదజల్లాలి... అదో అందం!" అన్నాడు ప్రేమగా ఆమె ముఖంలోకి చూస్తూ.

"పాపం! మీరొక్కరే ఏరుకుందామనా?"

"కాక!... చుట్టూ బంగారపు కోట కట్టించనూ!" చాలా హాయిగా, తేలిగ్గా గిరిబాబు నవ్వాడు.

మనస్సు ఎంతో ఉల్లాసంగా ఉన్నది.

– మూడు రోజుల నరకయాతన తరువాత అతడు స్వర్గంలో ఉన్నట్లుగానే ఫీలవుతున్నాడు.

మల్లికే ముందుగా ఆ గదినుండి బయటకు వచ్చింది.

గిరిబాబు వెనగ్గా వచ్చాడు.

కిరణ్ ఈర్ష్యగా గిరిబాబును చూడసాగాడు. అతడు మంచం మీద కూర్చొని వున్నాడు. ముఖం పీక్కుపోయి వున్నది... గిరిబాబును, మల్లికను కలిపి అలా చూస్తుంటే అతడి గుండెల్లో తెలియని భారం పేరుకుపోతోంది.

ఆ బరువుతోటే మల్లికను గాకుండా గిరిబాబు పెదాల మీద చిరునవ్వును, ముఖానికి గంటుపెట్టుకొని చూస్తున్నాడు.

ఇద్దరూ బయటకు వచ్చేటప్పటికి అక్కడ కూర్చొని వున్న చక్రవర్తి కనబడ్డాడు.

"మీరు ఎక్కడికో ప్రయాణమవుతున్నారు... ఎక్కడికీ అని అడగటం చాలా తప్పు గనుక... అలా అడక్కుండానే– నా కారులో అంతాకలసి వెళ్దాం అని మాత్రం అనటానికి సాహసిస్తున్నాను!" అన్నాడు నవ్వి. "నేనూ బోరుకొట్టి చస్తున్నాను!"

గిరిబాబు విసుగ్గా నుదురు చిట్లించాడు.

"ఆ దారి ఏమంత బాగుండదని బాబాయిగారు చెప్పారు... మీ కారు అటు రాలేదేమో... మేం దేవాలయానికి వెళుతున్నాం... ఇప్పుడే వచ్చేస్తాం... రాగానే ఏమైనా మాటలు చెప్పుకుంటూ కూర్చుందాం... మీరుండండి!" అంటూనే అతడికి మాట్లాడేటందుకు మరో అవకాశమివ్వకుండా, "పదండి... త్వరగా నడవాలి!" అని గిరిబాబు వైపుకు తిరిగి, వడివడిగా ముందుకు అడుగులు వేయసాగింది మల్లిక.

గిరిబాబు తేరుకొని, వెనక్కు తిరిగి చూడకుండా మల్లికను అనుసరించాడు.

ఇద్దరూ కొంతదూరం హాయిగా నడిచారు.

– ఆ తరువాతనే వాళ్ళ కష్టాలు ప్రారంభమయినయి.

ఎక్కడో దూరంగా చెట్ల గుబుర్ల నడుమగా కనబడుతున్న గ్రామంలోనైనా త్రాగేటందుకు గుక్కెడు కాఫీ దొరుకు తుందేమోననే ఆశతో క్రితం రోజు బురదలో నడిచిన క్షణాలు ఇద్దరికీ గుర్తుకు వచ్చినయి.

నేలంతా బురద, రొచ్చూ...

అయినా మల్లిక తేలిగ్గానే నడుస్తున్నది.

గిరిబాబుదే బాధంతా...

– ఎవరో కుర్రవాడిని అడిగి దేవాలయం వైపుకు వెళ్ళే వీథిలోకి తిరిగారు.

అలా అతి కష్టం మీద ఓ ఫర్లాంగు దూరం నడిచిన తరువాత– దేవాలయం అనబడే ఆ ప్రదేశం కనబడింది.

అది దేవాలయంలా లేదు...

ఏదో పాడుబడి, శిథిలావస్థలో వున్న పురాతన మందిరంలా వున్నది. గోడలు పాచి పట్టి వున్నాయి... అంతే కాదు, గోడలమీద గడ్డి మొలిచివున్నది. విశాలమైన ఆవరణ. చిన్న దేవాలయ మందిరానికి ఎదురుగా ఎత్తయిన ధ్వజస్థంభం ఒక పక్కకు

వాలి ఏ క్షణాననైనా పడవచ్చు అన్నట్లుగా వున్నది... పక్కనే పెద్ద పుట్ట... ఓ పక్కగా వింత వింత కాంతులతో పురివిప్పి నాట్యం చేస్తున్నట్లుగా పూలతో నిండుగా తంగేడు చెట్టు...

నేలంతా ఎప్పటినుండో పెరుగుతున్న గడ్డితో అసహ్యంగా వున్నది– ఆ దేవాలయానికి ఆలనా పాలనా వున్నట్లే లేదు.

"ఇంతకీ మీరు నన్ను తీసుకువచ్చింది ఇది చూపించటానికేనా?"

"కాదు!"

"మరేం చూపిస్తారు?"

"చెప్పాలా?"

"రహస్యమా?" అన్నది కళ్ళు చికిలించి నవ్వుతూ అతడి ముఖంలోకి చూస్తూ.

"అవును!" అన్నాడు నవ్వును బిగపట్టుకుంటూ.

"మీ రహస్యాలన్నీ నాకు చూపించటం దేనికి?"

"ఓ అమ్మాయిగారూ! ఇలా రండి!"

"– పిచ్చి పిచ్చి వేషాలు వేయకుండా మర్యాదగా ఉండండి మాస్టారూ!" అన్నది వెక్కిరిస్తున్నట్లుగానే నవ్వుతూ.

"ఇంతకీ నేను తమర్ని ఇక్కడకు ఎందుకు తీసుకు వచ్చానో తెలుసా?"

"ఆఁహాఁ..."

"చెప్పుకోండి మరి!" చటుక్కున గిరిబాబు మల్లికను మోచేతి మీదగా గట్టిగా పట్టుకున్నాడు.

"ఇది దేవాలయమని తెలుసా?" అన్నది.

"తెలుసు!" అన్నాడు చేయి వదలకుండానే.

"మరి చేయి వదలండి... ఊఁ... వెంటనే వదిలి వేయాలి!" అన్నది ఆజ్ఞాపిస్తున్నట్లుగా.

"చిత్తం!" అన్నాడు బుద్ధిమంతుడిలా చేయి వదిలేసి.

"గుళ్ళోకి పదండి!"

"అంత తొందరేం!"

"తొందరగా దేఁవుణ్ణి దర్శించుకొని వెళ్ళిపోతే మంచిది! ఊరికి మూలగా వున్న ఈ గుళ్ళో గంటల తరబడి కూర్చొని మనం చేసేదేఁవున్నది?"

"మల్లికా!" చాలా గంభీరంగా అన్నాడు.

మల్లిక తలెత్తి సూటిగా అతడి కళ్ళల్లోకి చూడసాగింది– అతడిని ఎదుర్కోవటానికి సిద్ధంగా వున్నట్లుగా.

"ఈ పవిత్ర స్థలంలో– నీతో హృదయమిప్పి కొన్ని మాటలు మాట్లాడాలని వున్నది!"

"నాకు తెలిసే వచ్చాను!" అన్నది– వినటానికి సంసిద్ధురాలవుతున్నట్లుగా.

"అక్కడ కూర్చుందాం పద!"

ఇద్దరూ అరుగు దగ్గరకు వచ్చి– దాని మీద దుమ్మును ఊదేసి– జేబురుమాలలు పరుచుకొని కూర్చున్నారు.

"నేను చెప్పేది సావకాశంగా విను!"

"చెప్పండి!"

"నేను మనస్సులో దురాలోచనలు నింపుకొని పైకి తియ్యగా మాట్లాడే మనిషిని కానని నమ్ముతావా?"

ఒక్క క్షణం నిశ్శబ్దంగా గడిచిపోయింది.

"మీరు ఇప్పుడే కాదు... మరో జన్మలో కూడా ఆలాంటి వారు కాదని, కాలేరని చెప్పగలను!"

"కృతజ్ఞుణ్ణి!" అన్నాడు తియ్యగా మల్లిక ముఖంలోకి చూస్తూ.

సౌమ్యంగా అతడి కళ్ళల్లోకి మల్లిక చూచింది.

"చెప్పండి!"

"ఈ దేవాలయంలో కూర్చొని నీకు చెబుతున్నాను... నేను నిన్ను వివాహం చేసుకుంటాను, మల్లికా!"

"నాలో ఏం జూసి ఈ నిర్ణయానికి వచ్చారు మీరు?"

అంత సూటిగా ఆమె అడిగిన ప్రశ్న అతడిని ఉక్కిరిబిక్కిరి చేసింది.

మరో లోకంలోకి వెళుతున్నట్లుగా కళ్ళు మూసుకొని, "నీకు మగవాళ్ళంటే పరమ ద్వేషం! దానికి కారణం ఓ రాక్షసుడు... నిన్ను నమ్మించి, నీకు స్వర్గసౌఖ్యాలు కలిగిస్తానని మాట ఇచ్చి, నిన్ను రైలులో అర్థరాత్రి నిద్రపోతున్న సమయంలో దోచుకు పారిపోయిన ఆ మగమనిషి లాగానే అందరూ వుంటారని– నువ్వు కత్తిగట్టావు... కాదు, అది నిజం కాదు... అది నిజంకాదని నిరూపిస్తాను!" అన్నాడు.

"నిజం?"

"అంతేకాదు... నవ్వు ద్వేషించే జాతికి ప్రతినిధిగా నిలబడి... నువ్వెంత గుడ్డిగా ఒక వ్యక్తి చర్యను ఆధారంగా తీసుకొని సమస్త ప్రపంచాన్నీ ఎలా చిత్రీకరించుకుంటున్నావో, నువ్వెంత బలహీనురాలివో కూడా నిరూపిస్తాను!"

"కృతజ్ఞురాలిని... చెప్పటం అయిందా?" నవ్వుతున్నది ఆమె, అతడి ఆవేశాన్ని చూస్తూ.

అతడు పట్టించుకోలేదు ఆమెను.

"జీవితంలో మరెన్నడూ నీ గడిచిపోయిన జీవితంలో ఏర్పడ్డ నల్లటి మచ్చ

గుర్తురాకుండా వుండేలా చేస్తాను... నిన్ను బంగారు పల్లకీ ఎక్కిస్తానని మాట ఇవ్వలేనుగాని... నువ్వు ఎక్కింది గాజుపల్లకీ కాదు అని నిరూపిస్తాను!"

"ఎందుకు మీకింత కష్టం... ఎందుకు మీకీ ఎదురీత?"

గిరిబాబు పేలవంగా నవ్వాడు.

"నాకూ హృదయమున్నది... నేనూ మనిషినే... నిన్ను చూస్తున్నా, నీమాటలు వింటున్నా నా గుండె ద్రవిస్తున్నది. నా కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి... నా హృదయం ఆక్రోశిస్తోంది... నువ్వు చేసిన ఒక్క చిన్న పొరబాటుకు నీ భావి జీవితమంతా అంధకార బంధురమయి పోవాల్సిందేనా? ఆ చేసిన పొరబాటు మూలంగా, నీ ముందు జీవితమంతా మరిన్ని పొరబాట్లు చేస్తూ, గమ్యంలేని బాటలో పయనించవల్సిందేనా?... ఆ ఒక్క తప్పుకూ శిక్షగా నిన్ను నువ్వు నరకంలో పడవేసుకోవటమేనా?..." అతడు ఆవేశంతో ఊగిపోతున్నాడు. "ఊంహూం... లేదు... రాత్రి తెల్లవార్లూ ఆలోచించాను... దానికి సమాధానం కావాలి... దానికి సమాధానం కావాలి మల్లికా!... ఎవడో వెధవ చేసిన తప్పుడు పనికి నువ్వు శిక్ష అనుభవించగూడదు! నువ్వు కాదు అనుభవించవల్సింది... నువ్వు కాదు..."

"మీరు ఆవేశపడుతున్నారు!"

గిరిబాబు నిగ్రహించుకున్నాడు.

"నిజం మల్లికా! తెల్లవార్లూ నిద్రపోకుండా శూన్యంలోకి చూస్తూ, దీనికి సమాధానం వెతుక్కుంటూ, ఆ గుడ్డి వెలుగున్న చీకటి గదిలో కూర్చున్నాను... ఆలోచించగా, ఆలోచించగా దానికి సమాధానంగా నేనే కనబడ్డాను... నిన్ను భార్యగా నేను ఎందుకు ఎన్నుకోగూడదు– అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను... ఎందుకు ఎన్నుకోగూడదు అని నాకు నేనే సమాధానం చెప్పుకున్నాను...!" అతడు ఒక్క క్షణం ఆగాడు. పరిశీలనగా, ఆత్మీయంగా ఆమె ముఖంలోకి, ఆమె కళ్ళల్లోకి చూస్తూ వుండిపోయాడు. "ముందు జీవితం వెయ్యి వసంతాలతో నిండిపోవాలి... నీ గడిచిన ప్రతి క్షణాన్నీ మర్చిపో మల్లికా! నీ ముందంతా కనబడుతున్నది బంగారు బాటే...

నీకు ఏ దుఃఖమూ వద్దు. దిగులు వద్దు. భయం వద్దు... ఇక ప్రతిక్షణం నువ్వు నవ్వుతూ కూర్చుంటే దేవతలా నిన్ను చూస్తూ, రాలిపడుతున్న ముత్యాలనూ, రత్నాలనూ ఏరుకోవటమే నా పని!"

చాలా తేలిగ్గా శ్వాస పీల్చాడు. రాత్రినుండి గుండెల్లో నింపుకుంటున్న భావాలనీ, కోరికలనీ, ఉద్దేశాలనీ, ఆమె ముందు పరిచి వుంచాడు- ఆ క్షణం ఎంతో హాయిగా వున్నట్లే అనిపించింది. గాలిలో తేలిపోతున్నట్లే అనిపించింది.

ఒక్క క్షణమాగి, కనురెప్పలు రెపరెపలాడించి, తదేకంగా గిరిబాబు ముఖంలోకి చూస్తూ, "అంటే, ఇంతకీ నేను ఇలా నాశనమయిపోవటం మీకిష్టం లేదంటారు... అవునా!" అన్నది మల్లిక.

"అవును!" అన్నాడు దృఢంగా.

"నేను నాశనమయిపోతానేమోననే జాలితో మీరు నన్ను వివాహం చేసుకోబోతున్నారన్నమాట!"

"మల్లికా!"

"ఉఁహూఁ..." చటుక్కున తల విదిలించింది. క్షణంలో గంభీరురాలయింది. "నా కిష్టంలేదు... నాకిష్టం లేదు... మరొకరి జాలితో బ్రతకటం నాకిష్టం లేదు... నేనలా బ్రతకలేను!" తలను అటూ ఇటూ ఊగిస్తూ అన్నది.

ఆమె కళ్ళను నీటి పొరలు క్రమ్మివేసినాయి.

"మల్లికా!" అన్నాడు ఆవేశంగా.

మల్లిక లేచి నిలబడింది. "ఇంకేం చెప్పవద్దు నాకు... నా గురించి మరొకరు జాలిపడటం నేను భరించలేని విషయం... మీ జాలితో నేనెన్నాళ్ళు సుఖించగలను... ఎన్నాళ్ళు జీవితాన్ని గడపగలను... వద్దు... వద్దండీ... వెళ్దాం పదండి!" అన్నది.

గిరిబాబు ఆమె చేతిని గట్టిగా పట్టుకున్నాడు.

"నేను చెప్పేది పూర్తిగా విను మల్లికా!"

"ఛీ! చేయి వదలండి ముందు... మీరు నాకేం చెప్పనక్కరలేదు... మరొకరి దయాదాక్షిణ్యాలమీద బ్రతకటమంత హేయమైనది మరొకటి లేదు... అందునా ఆడదానికి!" ఆమె ముఖాన్ని అసహ్యంగా పెట్టి అన్నది.

గిరిబాబుకు విసుగూ, కోపమూ ఒకేసారి వచ్చినయి.

"ఆగు! ఎక్కడికి వెళతావ్... ముందు నేను చెప్పింది విననిదే ఒక్క అడుగు కూడా కదలనీయను... ప్రతిదీ నీ ఇష్టమే అనుకుంటున్నావా?" అతడి కళ్ళు ఎర్రబడినయి.

అతడి మాటల్ని చాలా తేలిగ్గా తీసుకుంటున్నట్లుగా నవ్వింది మల్లిక.

"ఏం చేస్తారేం?" అన్నది.

నరాలు బిగుసుకు పోతుండగా, ఆవేశంగా లేచి నిలబడి, మల్లిక పక్కకు వస్తూ, "ఎత్తుకు తీసుకు వెళ్ళి, గుళ్ళో కూలేసి, తలుపులు బంధించి, నా మాట వినేటంతవరకూ, నిరాహారంగా అక్కడే వుంచుతాను!" అన్నాడు పళ్ళు పర పరా కొరుకుతూ.

"చాలా సంతోషంగా వుంటాను!"

"కూడూ, నీళ్ళూ లేక చస్తావ్, తెలుసా!" పిడికిలి బిగించాడు.

"మీతో జీవితాన్ని బంధిఖానాలోలా గడిపే దానికంటే అదే వేయి రెట్లు నయం... అంతేకాదు, చావును సంతోషంగా స్వీకరిస్తాను కూడా..." తల ఎగరవేసింది గీరగా.

"మల్లికా!" ఇక ఆమె ఆమాట అన్న తరువాత అతడు ఎంతగా నిగ్రహించుకున్నా, ఆవరించుతున్న నీరసం ముందు పరాజితుడయ్యాడు... గొంతు లేవనే లేదు.

మల్లిక నవ్వింది... దగ్గరకు వచ్చి చాలా మృదువుగా గిరిబాబు చేయి పట్టుకున్నది. "మీ రక్తం ఆవేశంలో మరుగుతోంది... ఆ ఆవేశంలో హితాహిత జ్ఞానాన్ని కోల్పోయి... ఓ చెడిపోయిన ఆడదాన్ని రక్షించబోయి కష్టాలు ఎందుకు కొని తెచ్చుకుంటారు...

వెళ్దాం పదండి... చూడండి! ఎండ ఎంత బాగా వచ్చేసిందో... గాలీ వానా వచ్చినట్లే లేదు... ఏదో ఒక సాధనం చూసుకొని మీ ప్రయాణం మీరు చేయండి... నా సంగతేదో నేను చూసుకుంటాను!" అన్నది నెమ్మదిగా.

ఆమె చేతిని అతడు విదిలించి కొట్టాడు.

మళ్ళా నవ్వింది మల్లిక.

"ఎందుకో నాకీ పవిత్ర స్థలంలో కూర్చోవాలంటే ముళ్ళమీద కూర్చున్నట్లున్నది... పోదాం పదండి!" అన్నది.

"దేఁవుణ్ణి చూడవద్దా?" అన్నాడు నీరసంగా. అప్పుడే ఆమెతో ఇంటికి వెళ్ళాలనిపించటం లేదు... ఎలాగైనా ఆమె మనసు్స మార్చాలి!

"ఉఁహూఁ..." నవ్వింది. "మీలో లేని దేఁవుడు ఆ గుళ్ళో ఎక్కడున్నాడు?... కావాలంటే మీరు చూచి రండి... నేను మాత్రం రాను!" అన్నది.

గిరిబాబు డీలాపడిపోయాడు.

అతడి ఆశలన్నీ అడియాసలయినయి.

రాత్రినుండీ కట్టిన కోటగోడల నన్నిటినీ మల్లిక కూకటి వేళ్ళతో పెకిలించివేసింది...

– ఎలా మార్చాలి మల్లికను?

"అయితే నీ నిర్ణయాన్ని మార్చుకోవన్నమాట?" అన్నాడు, ఆశను చంపుకోలేక పోతున్నట్లుగా మల్లిక కళ్ళల్లోకే చూస్తూ.

"మల్లిక బలహీనురాలు కాదు!"

* * *

"చక్రవర్తిగారూ! ఎండ బాగా వచ్చేసింది... మనం హైద్రాబాద్ ఎందుకు ప్రయాణమవ్వకూడదూ?" అన్నాడు గిరిబాబు.

చక్రవర్తి పెద్దగా నవ్వాడు.

"చేతిలో కారు పెట్టుకొని కూడా ఎందుకు నేను ఇక్కడ ఆగిపోయానో మీకు తెలుసా?"

"నన్ను కూడా హైద్రాబాద్ జేర్చే బాధ్యత మీదే సార్!" కిరణ్ మంచం మీద కూర్చుంటూ అన్నాడు.

చక్రవర్తి తాపీగా పేషెన్స్ ఆడుకుంటున్నాడు... ఇస్పేట్ ఆసుగాని, కళావరు నాలుగు గాని, ఆటీన్ జాకీగాని, ఏదొచ్చినా క్లియర్ అవ్వటానికి అవకాశమున్నది.

"చెప్పండి!" అన్నాడు గిరిబాబు.

"నిన్న ఈ ఊరుదాటి దాదాపు ఐదారు మైళ్ళు వెళ్ళిన వాడిని వెనక్కు తిరిగి రావాల్సి వచ్చింది!"

"ఏఁవైంది?"

"బ్రిడ్జి ఏదైనా కొట్టుకు పోలేదు కదా?" కిరణ్ భయం భయంగా అడిగాడు... అసలే తనకు శెలవు లేదు!

"ఒక చెట్టు రోడ్డుకు అడ్డంగా పడి వున్నది... అటు రెండు వందలూ, ఇటు రెండు వందలూ... అన్ని రకాల వాహనాలూ ఆగివున్నాయి!"

"చెట్టును పక్కకు లాగివేయలేదా?"

ఆయన నవ్వాడు. "అది ఎవళ్ళు లాగగలరండీ బాబు! ఎవరి లారీలోనో మోకులుంటే బ్రతిమలాడి బయటకు తీసి, చెట్టుకు కట్టి లాగితే పుటుక్కున తెగి వూరుకున్నాయి... ఇక జనం రంపాల వేటలో వుంటే నాకు విసుగెత్తి కారును వెనక్కు తిప్పుకొని రోడ్డుకు అడ్డం పడి ఇటు వచ్చేశాను!"

"ఇప్పటికీ ఇంకా తీసి వుండరంటారా?"

"తీసి వుండవచ్చు, తీసి వుండకపోనూ వచ్చు... అలాంటి అడ్డంకులు హైద్రాబాద్ వెళ్ళేలోగా మనం ఎన్నింటిని ఎదుర్కోవాలో... అందుకే రేపు బయల్దేరితే బాగుంటుందని

సావకాశంగా కూర్చున్నాను!"

"మనం రేపటి దాకా ఇక్కడే వుండాలంటారా?" దిగులుగా అన్నాడు గిరిబాబు.

"ఉంటే నా కారులో లిఫ్ట్ ఇస్తాను!" నవ్వాడు చక్రవర్తి.

గిరిబాబు నీరసంగా అన్నాడు. "థాంక్యూ!"

ఇంతలోనే మల్లిక తలుపవతలనుంచే, "వంటయిపోయింది... భోజనాలకు లేవవచ్చు!" అన్నది.

సీతాపతిరావుగారు ఆ మాట వింటూనే, వంట ఇంట్లోకి వెళుతూ, "అమ్మాయి మల్లికా! మీ ఆయనకు ఆ గదిలోనే పెడతావా?... రాత్రికూడా సరిగ్గా భోజనం చేయలేదు!" అన్నారు నవ్వుతూ.

మల్లిక తడబడింది. అమె ముఖమంతా కందగడ్డలా అయింది ఆయన మాటలకు.

"అఖ్ఖర్లేదండీ!" అన్నది ఎలాగో నోరు పెగల్చుకొని.

"అదికాదమ్మా!... ఆయన రాత్రి అర్ధాకలితో లేచి పోతుంటే నా మనస్సంతా..."

ఆ సంభాషణను ఇంకా పొడిగించటం ఇష్టం లేదన్నట్లుగా, ఆయన మాటలను త్రుంచి వేస్తూ, "అలాగే బాబాయిగారూ!" అన్నది తలవంచుకొని.

"అయితే ఒక పని చేయండి! కావాల్సినవి తీసుకు వెళ్ళి ఆ గదిలోనే మీ ఇద్దరూ కూర్చొని తినేయండి... ఇక మేఁవిద్దరమే కదా... కృష్ణమూర్తికి చారన్నమేనాయె... మా ఆడది వడ్డిస్తుందిలే!"

ఆయన మాటలు వింటుంటే మల్లికకు ఒళ్ళంతా బరువెక్కినట్లనిపిస్తోంది. రెండు నిముషాలు అన్యమనస్కంగానే అక్కడే అటూ ఇటూ తచ్చట్లాడింది. తరువాత ఓ నిర్ణయానికి వచ్చిన దానిలా తమ గదిలోకి వెళ్ళి ఓ పక్కగా శుభ్రం చేసింది. రెండు పీటలు తెచ్చి వేసింది. ఇస్తళ్ళు కడిగి తెచ్చింది.

అది గమనిస్తూనే, "ఇక్కడ వడ్డిస్తున్నావెందుకు?" అడిగాడు అనుమానంగా.

"రాత్రికూడా మీరు సరిగ్గా భోజనం చేయలేదు!"

"అయితే?"

"అందుకే ఇక్కడ మీకూ నాకూ వేరుగా వడ్డిస్తున్నాను!" ముఖాన్ని పక్కకు తిప్పుకున్నది.

"మల్లికా!"

"అరవబోకండి... మీరు కాదన్నా సీతాపతిరావుగారు అంగీకరించేలా లేరు... కాకపోగా అదో పెద్ద పంచాయితీ!" గదిబయటకు వచ్చేసింది.

అన్నీ తీసుకు వచ్చి వడ్డించింది. మారుకు కావాల్సినవి మరో పళ్ళెంలో తెచ్చిపెట్టింది. తనూ ఓ పీట మీద కూర్చుంటూ, "రావాలి!" అన్నది.

"నువ్వు ముందు తినేయ్!" అన్నాడు కృద్ధుడవుతూ.

"నన్ను చావమంటారా? చెప్పండి!" అన్నది సూటిగా చూస్తూ.

"ఎందుకు?" చటుక్కున లేచినిల్చున్నాడు కసిగా.

"సిగ్గుతో నా తల పాతాళానికి కృంగిపోతున్నది. అయినా నేను అన్నీ చంపుకొని నలుగురిలో నవ్వుతూ తిరుగు తున్నాను... నాలోనూ చీమూ నెత్తురూ వున్నది... నాలోనూ సిగ్గూ బిడియాలు వున్నయి... ఎందుకు మీరూ నా మనస్సుని తూట్లు తూట్లుగా పొడుస్తారు?"

ఆమె ఆవేశం అతడికి అవగతమే కాలేదు.

"నేనేం చేశాను!"

"నన్ను రెచ్చగొడుతున్నారు!"

"మల్లికా!"

"ఉఁహూఁ... అనవసరపు మాటలు వద్దు... మెదలకుండా కూర్చొని భోజనం

చేయండి... ఇక మీ అసందర్భపు మాటలను సహించేదిలేదు!"

"నావి అసందర్భపు మాటలా?"

"అవును... లేకపోతే ఇక్కడ కూర్చొని భోజనం చేస్తే మీకు వచ్చే నష్టమేఁవిటి?... సర్వనాశనమయి పోతున్న నాతో కలసి భోజనం చేయటం మీకిష్టం లేదా?"

"మల్లికా!"

"లేవండి!"

"నువ్వు పొరబాటు పడుతున్నావు మల్లికా!" అన్నాడు జాలిగా. "నువ్వు సర్వనాశనమయి పోతున్నావని ఎవరన్నారు?" చటుక్కున వచ్చి పీట మీద కూర్చున్నాడు.

"మీరీ ప్రపంచంలో ఎలా బ్రతకగలుగుతారో నాకు అర్థమే కావటం లేదు!"

"అవును... నాకూ భయంగానే వున్నది!" అన్నాడు కవ్వింపుగా.

ఆ మాట అంటుంటే– ఆమెను చుట్టివేసి గుండెలకు హత్తుకొని, "నువ్వు లేందే నేను బ్రతకలేను మల్లికా!" అని చెప్పాలనిపించింది.

ఆశగా ఆమె ముఖంలోకి చూడసాగాడు.

ఆ క్షణాన మల్లిక ఓ మహోన్నత శిఖరంలాగా కనబడసాగింది. ఆమె ముందు తాను మరుగుజ్జే అనిపించగా మరింతగా కుంచించుకు పోయాడు.

"మల్లికా!" అన్నాడు భయం భయంగా ఆమె ముఖంలోకి చూస్తూ.

"చెప్పండి!"

"నన్నెందుకు దూరం చేసుకోవాలని చూస్తున్నావు?"

"మీరు పవిత్రులు గనుక!" అన్నది పవిత్రంగానే గిరిబాబును చూస్తూ.

"ఎలా?"

మల్లిక మాట్లాడలేదు. అన్నం కలుపుకోసాగింది.

"మూడు రోజులు ఒక స్త్రీని- అందునా కష్టాలలో వున్న స్త్రీని- అనునయించవలసింది పోయి దుర్భర వేదనకు గురిచేశాను... పవిత్రుడు చేయ వలసిన పనేనా అది?"

మల్లిక నవ్వింది.

"భోజనం చేయండి!"

"నాకు సమాధానం చెప్పు!"

"ఒక్కటి కాదు... లక్ష చెప్పగలను... కానీ అన్నిటికీ అర్థం ఒక్కటే!" అన్నది సగం తలెత్తి.

"ఎందుకు నువ్వు నన్ను అర్థం చేసుకోలేవు?"

"మీరు మాత్రం నన్నెందుకు అర్థం చేసుకోలేరు?"

"నీ మనస్సు మార్చుకుంటే నువ్వేగాకుండా మరొకరు కూడా సుఖిస్తారు!"

"నా సుఖాలన్నీ ఎన్నడో గంగలో కలిసినయి... ఇక నాకు సుఖమేఁవిటి?"

"ఎవరన్నారా మాట?"

"నుదుట దేఁవుడు పుట్టిననాడే రాశాడు... కాని, నా గ్రహింపుకు వచ్చేటప్పటికి అంతా అయిపోయింది!" అన్నది. అలా అంటుంటే ఆమె కళ్ళమ్మట నీళ్ళు తిరిగినయి.

"నువ్వు నా మాట వినేటంత వరకూ నేను నిరాహారంగానే వుంటాను!" అన్నాడు మొండిగా- పొద్దున తెగిపోయిన ఆశల తీగలను కలుపుకో ప్రయత్నిస్తూ.

"ఏఁవిటీ పాడుగోల... కడుపుకు ఇంత తిండి కూడా తినటం చూడలేరా మీరు?" అన్నది కస్సున లేస్తూ.

"నీ కోపతాపాగ్నులకు నేనేం భయపడను... అంతే కాదు, నీ బుడిబుడి దీర్ఘాలు కూడా నన్నేం చేయలేవు, తెలుసా?" అన్నాడు దృఢంగా గిరిబాబు, మల్లిక ముఖంలోకే రెప్పరార్పకుండా చూస్తూ.

ఒక్కసారి తీక్షణంగా మల్లిక, గిరిబాబు ముఖంలోకి చూచింది. "నేను చెబుతున్నాను... ఎందుకు మిమ్మల్ని మీరు నిప్పుల్లో పడవేసుకుంటారు?... ఆ అగ్నిజ్వాలలు మిమ్మల్ని సర్వనాశనం చేస్తయి... కాల్చి బూడిద చేస్తయి!"

"మల్లిక వెంట వుండగా అది నాకు స్వర్గమే అవుతుంది!"

ఆమె తన మీద రుద్దుతున్న భయాన్ని నిర్లక్ష్యంగా తోసిపుచ్చుతూ అన్నాడు.

"మీ బ్రతుకు మీద మీకు తీపిలేదా?"

"నీ గుండె కంటె నా గుండె గట్టిది!"

"హూఁ..." నవ్వింది మల్లిక. "నేను స్త్రీని!" అన్నది ఎగతాళిగా అతడి కళ్ళల్లోకి చూస్తూ. "మీ మగవాళ్ళను సర్వనాశనం చేయాలని శపథం పట్టాను... నాకు తెలుసు... మీరూ దీపం చుట్టూ తిరిగే శలభాలల్లో ఒకటయి మాడి చస్తారు!" అన్నది శపిస్తున్నట్లుగా. ఆమె కళ్ళు ఎఱ్రబడినయి.

గిరిబాబు ఆమె ఆకృతికి చలించాడు.

మల్లిక నవ్వింది. "భయపడుతున్నారు కదూ?"

గిరిబాబు ఒక్క ఉదుటున పీటమీదనుంచి లేచాడు. మల్లిక చటుక్కున అది గమనిస్తూనే అతడి కాళ్ళ మీద చేయి వేసింది.

– తల అడ్డంగా ఊపింది.

"మీరు భోజనం చేయకుండా వెళ్ళడమంటూ జరిగితే– ఈ మల్లిక జీవితానికి ఇది ఆఖరి భోజనమే అవుతుంది– నేను మాటంటే చేసి తీరుతాను... నేను తల పగల గొట్టుకొని ఇక్కడ చావాలన్నదే మీ కోరికయితే– మీరలాగే లేచిపోండి!" అన్నది.

గిరిబాబు తన పాదాన్ని ఒక్క అంగుళంకూడా కదిలించలేకపోయాడు!

* * *

మల్లిక అన్నీసర్ది చేయి కడుక్కునేటప్పటికి, గిరిబాబు దిగులుగా మంచం మీద,

కళ్ళకు మోచేయి అడ్డుపెట్టుకొని పడుకున్నాడు.

మల్లిక ఇవతలకు వచ్చేటప్పటికి కిరణ్ నవ్వుతూ మంచం మీద కూర్చొని వున్నాడు.

"సీతాపతిరావుగారు నాకు కాస్త చారూ అన్నం పెట్టించి పెద్ద శిక్షే విధించారు!"

"ఏఁవిటిది, కృష్ణమూర్తిగారూ!" అన్నది మల్లిక కుతూహలంగా.

"నిద్రపోగూడదట!... ఒంటరిగా కూర్చోని ఏం చేయమంటారు?" అన్నాడు అమాయకంగా, దిగులుగా మల్లిక ముఖంలోకి చూస్తూ.

"నేను మాటలు చెబుతూ కూర్చుంటాలేండి... మీరేం దిగులు పడనక్కరలేదు!" అన్నది– చీర చెంగుకు చేయి తుడుచుకుంటూ... అతడిని అర్థం చేసుకుంటున్నట్లుగా నవ్వి.

"కృతజ్ఞుణ్ణి!" అన్నాడు ఆనందంగా.

– ఆమె ఎదురుగ్గా కూర్చొని మాటలు చెబుతానంటే అంతకంటే కావాల్సిందేఁవున్నది తనకు!

మల్లిక వంటయింట్లోకి ఒక్కసారి వెళ్ళి వచ్చి, కిరణ్ మంచం పక్కగా క్రింద కూర్చున్నది.

సీతాపతిరావుగారు భోజనం చేస్తూనే ఏదో పనిమీద బయటకు వెళ్ళిపోయారు.

"మిమ్మల్ని చూస్తున్నా, మీతో మాటలు చెబుతూ కూర్చున్నా నాకు ఎంతో హాయిగా వుంటుంది... మీ మాటలు చాలా బాగుంటాయి!"

కిరణ్ అందంగా నవ్వాడు.

"కృతజ్ఞుణ్ణి!"

"హైద్రాబాద్‌లో మీరెక్కడుంటారు?"

"ఓ చిన్న గల్లీలో, బెత్తెడు గదిలో... ముప్ఫయి రూపాయిలు అద్దె ఇస్తూ రాత్రి

పూట వుంటున్నాను!"

"అదేంవిటి?"

"పగటిపూటకూడా ఆ నరకంలో ఎక్కడ వుండమంటారు?"

"నా కర్థం కావటంలేదు!"

"నా అదృష్టం!" అన్నాడు ఫక్కున నవ్వి.

మల్లికకు అర్థం గాకపోయినా నవ్వింది.

"మల్లికా!" అన్నాడు చిన్నగా– మల్లికమీద చూపులు మసకమసకగా వున్నాయి.

అతడికి సర్వ ప్రపంచమూ 'మల్లిక' అనే మధుర భావనతోటే నిండిపోయినట్లున్నది. కళ్ళు మూసుకున్నాడు. పెదాలు ఆనందంగా కదులుతున్నయి చిరునవ్వును అందంగా పులుముకుంటూ.

"ప్రేమంటే ఏమిటో నాకింతవరకూ తెలియదు... మొట్టమొదటిసారిగా మిమ్మల్ని ఆ భయంకర వాతావరణంలో నీటిమీద ప్రాణాలను అరచేతులో పెట్టుకు నడుస్తున్నప్పుడు చూచాను... అలాగే చూస్తూ వుండిపోయాను నా మిత్రులు నన్ను ఎగతాళి పట్టించేంతవరకూ... తరువాత మీకూ, గిరిబాబుగారికి ఎలాంటి సంబంధమూ లేదని గ్రహించిన మరుక్షణంలోనే నన్ను నేను మర్చిపోయాను... అంతేకాదు..." ఒక్కక్షణం తన్మయంగా ఆమె ముఖంలోకి చూస్తూ ఆగాడు. "గిరిబాబు మీ భర్తే అయినా మిమ్మల్ని నా దానిగా చేసుకోవాలనే భావన నన్ను నన్నుగా నిలవనీయలేదు!"

"చూచారా! ఏ వయస్సులో వివాహం చేసుకోవాల్సిన వారు ఆ వయస్సులో చేసుకోకపోతే ఎంత అనర్ధమో!" నవ్వింది మల్లిక.

"ఏంవైంది?"

"వయస్సు మీరే కొద్దీ మనిషికి అదోరకం పిచ్చి మొదలవుతుంది– మీకులాగా!"

"మల్లికా!"

"లేకపోతే మీరెక్కడా– నేనెక్కడా..." అన్నది గర్వంగా, ఠీవిగా తనని తాను చూచుకుంటూ.

అర్థం కానట్లుగా ఆమె ముఖంలోకే చూస్తూ వుండిపోయాడు.

"కాలు క్రింద పెడితేనే కందిపోతానేమోనని మానాన్న నలుగురు పనిమనుష్యులను నా కోసంగానూ పెట్టాడు... నా కోరికలు నాలికమీద వుండగానే ఆయన చేయి పర్సుమీద వుండేది... నేను కలలో అనుకున్నా మా అమ్మ గ్రహించేసి తెల్లవారేటప్పటికి నేననుకున్నదాన్ని నా ముందు పెట్టేసేది... తెలుసా!"

"కానీ ఇప్పుడవేఁవీ లేవుగా!" అన్నాడు ఆమె ముఖంలోకి ఓరగా, ఈర్ష్యగా చూస్తూ.

ఆమెకు అతడి మాటలు నెత్తిన చాచిబాదినట్లనిపించింది. మెదడంతా మొద్దుబారిపోయింది. 'ఇది నిజమా?' అనిపించగా సర్వం శూన్యంలాగానే కనబడింది.

అప్పటికీ నిగ్రహించుకొని, ఖస్సున లేస్తూ, "లేకపోవచ్చు... అయినా నేను మహారాణినే!" అన్నది ఠీవిగా తలెత్తి. కాని అలా అంటున్నప్పుడు ఆమె కంఠం వణికింది. "ఇక ముందెవ్వరూ ఈ రాణిని కొల్లగొట్టలేరు!" పెదాలు విరిచింది– మగవాళ్ళ మెడలను త్రెంపివేయగలననేంత విసురుగా.

కిరణ్ ఆమె ముఖంలోకి చూడటానికే జంకాడు.

తనని తాను కూడదీసుకుంటూ, నంగినంగిగా, "నేనూ మరీ అధ్వాన్న స్థితిలో ఏమీలేను... నాకూ అంతో ఇంతో వెనుక వున్నది... మా అమ్మా, నాన్నకు నేను ఒక్కడినే కొడుకును... ఎంతలేదన్నా నాకూ మూడు వందల దాకా జీతం వస్తుంది!" అన్నాడు.

"మూడు వందల రూపాయిలా?... ముప్ఫయి రోజుల జీవితానికి ఏ మూలకు?... నాకొక్కదానికే చాలవే!"

"నీ చేతిలోనూ ఓ డిగ్రీ వున్నదికదా... నువ్వూ ఉద్యోగం చేయవచ్చు!" అన్నాడు

అపురూపంగా మల్లికను చూచుకుంటూ– ఎక్కడ జారిపోతుందో అన్నంత భయంగా.

"నేను ఉద్యోగం చేయాలా?... నేను...?" కళ్ళు చికిలించి, కసిగా అతడి ముఖంలోకి చూచింది. "నేను ఉద్యోగం కోసమే ఆ డిగ్రీ సంపాదించాననుకుంటున్నారా, మీరు?" అన్నది– అసహ్యంగా చూస్తూ.

"కాకపోవచ్చు... కానీ అవసరానికి ఆదుకుంటుంది కదా!" అన్నాడు తాపీగా.

"హుం... అయితే మీరు భార్యామణిచేత ఉద్యోగం చేయిస్తారన్నమాట!..." బలవంతాన కోపాన్ని, ఆవేశాన్ని నిగ్రహించుకొని, ఎగతాళిగా నవ్వింది. "నా అభినందనలు స్వీకరించండి, మహారాజా!... మీ అభ్యుదయ భావాలకు నా అభినందనలు!" అంటూనే, మామూలు మనిషి అవ్వటానికి తాపత్రయపడుతున్నట్లుగా ఒక్కక్షణమాగి, "నిజంగా మీరు చాలా ఉన్నతులు, కృష్ణమూర్తిగారూ!" అన్నది.

"ఎగతాళి చేస్తున్నారు కదూ!" అన్నాడు ముఖం ముడుచుకుంటూ.

"ఎగతాళి దేనికి మాస్టారూ!... నిజమే చెబుతున్నాను!" అన్నది... తనని నమ్మమన్నట్లుగా వున్నదా చూపు.

అయినా కిరణ్ ఆమె మాటలను నమ్మలేనట్లే ఆమె ముఖంలోకి చూస్తూ వుండిపోయాడు.

మనస్సును శూన్యం చేసుకొని, "పోనీయ్... మీరు చెప్పిందే అంగీకరిస్తాను... అయినా ముందు నాకు ఉద్యోగ మిచ్చే దిక్కెవరు చెప్పండి!" అన్నది నవ్వి.

"నువ్వు చేయాలని అనుకోవాలేగాని... ఆ మాత్రం ఇప్పించలేనా, నేను... మా ఆఫీసరు దగ్గర నాకు మంచి చనువున్నది... ఆయన దగ్గరే ప్రయత్నిస్తాను!" అన్నాడు ఆశల్ని గుండెలో నింపుకుంటూ.

మల్లిక తన భార్య అవ్వాలేగాని... అంతకు మించిన అదృష్టం తనకింకేం వున్నది... ఆమె అప్సరస... ఏ దేవ లోకంనుండో, దారి తప్పి, జారి క్రిందపడ్డ కిన్నెర!

మల్లిక నీరసంగా నవ్వింది. "ఉంహూం... ఏంవో... నాకు నమ్మకం ~~కలగడంలేదు... ఓ గుమాస్తా భార్యగా, లేక ఓ గుమాస్తాగా ఈ మల్లిక బ్రతకలేదేమో~~

ననిపిస్తోంది!" అన్నది తలవంచుకొని.

ఆమె మాటలకు ముఖం ముడుచుకుంటూ, "ఆలోచించు మల్లికా! నేను నిన్ను ప్రేమిస్తున్నంతగా మరెవ్వరూ ప్రేమించలేరేమో... మొదటి చూపులోనే నన్ను నేనుగా నీకు అర్పితం చేసుకున్నాను... నేను నీకంటే బీదవాడినే అవ్వవచ్చు... అయినా నాకూ హృదయమున్నది... నేనూ మనుష్యులను ప్రేమించగలను... నేనూ నా వారిని సుఖ పెట్టగలను... నేనూ 'నా' అనుకున్న వాళ్ళకి అనందాన్ని అందించగలను!" అన్నాడు ఆవేశంగా.

"మీరు భావకులా?" అన్నది నవ్వును బిగపట్టుకుంటూ.

"అవ్వనూవచ్చు! కాకపోనూ వచ్చు!... కోరికలు అందరికీ వుంటయి!" అన్నాడు నిష్ఠూరంగా.

మల్లిక నవ్వింది.

నవ్వును త్రుంచేస్తున్నట్లుగా ఆపేస్తూ, "నాకు ఒక్కటే భయం! మీతో ఎక్కువకాలం జీవితం గడపలేనేమోనని!... నాకు మగవాళ్ళంటే పరమ అసహ్యం! పరమ ద్వేషం!" అన్నది పిడికిలి బిగిస్తూ.

"ఎందుకని?" భయం భయంగా అడిగాడు కిరణ్.

అతడిలోని భయాన్ని ఉత్సుకతతోచూస్తూ, కవ్విస్తున్నట్లుగా, "నేను సినిమాలలో జేరితే మీకేమైనా అభ్యంతరమా?" అన్నది– అతడి వైపే కన్నార్పకుండా చూస్తూ.

"నాకు దేనికి అభ్యంతరం... కాకపోగా సంతోషిస్తాను!"

"నేను సినిమాలల్లో జేరినా మీరు నన్ను భార్యగానే అంగీకరిస్తారా?" అన్నది ముందుకు వంగి అతడి ముఖాన్ని పరిశీలనగా చూస్తూ.

"అందువలన మనస్సు మార్చుకోవాల్సిన అవసరం ఏమీ లేదు!" అన్నాడు చాలా తేలిగ్గా తీసుకుంటున్నట్లుగా.

మల్లిక తల ఎగరవేసి, అతడి వంక గీరగా చూస్తూ, "ఉఁహూఁ... నేను అంగీకరించను... సినిమాలలో జేరి నేను లక్షలకు లక్షలు సంపాదించగలననే ధైర్యం నాకున్నది... అటువంటి నేను ఓ మామూలు గుమాస్తాను భర్తగా అంగీకరించటమా?... మిమ్మల్ని భర్త అని చెప్పుకోవటమా?... ఛ! నాకే సిగ్గుచేటు..." ఏదో తపనతో కొట్టుకుంటూ అన్నది. అతడి గుండెల్ని రంపంతో కోస్తున్నట్లుగా నవ్వుతూ, "లాభంలేదు మాస్టారూ! మీకు నాకు భర్తగా అవతగ్గ క్వాలిఫికేషన్స్ లేవు!" అన్నది.

అతడు అమె మాటలకూ, నవ్వుకూ నిర్విర్ణుడయిపోయాడు.

ఆమె నవ్వు ఆగి, అతడు తేరుకునేటప్పటికి కొద్ది నిముషాలే హరించుకుపోయినయి.

"మల్లికా!" అన్నాడు దీనంగా. "పువ్వుల్లో పెట్టి పూజించుకునే మనస్సుతో నిన్ను కోరుకుంటున్నాను... తృణీకరించబోకు మల్లికా! తృణీకరించబోకు..."

ఒక్క క్షణం ఎవరో పరాయి స్త్రీ ముందు తను దేబిరించి అడుగుతున్నట్లనిపించినా, ఆ భావాలను త్రోసిపుచ్చి, భవిష్యత్తులో ఆమెతో కలసి నిర్మించుకోబోయే బంగారు భవంతులలోనే తిరుగాడసాగాడు.

చటుక్కున మల్లిక లేచి నిలబడింది.

"పోనీయ్ ఒక్కటి చెప్పండి... నా కడుపులో పెరుగుతున్న పాపకు, తండ్రినని చెప్పుకోగల ధైర్యం మీకున్నదా?"

"మల్లికా!"

"నేను నిజం చెబుతున్నాను... నేను మంచిదాన్ని కాదు... నేను చెడిపోయిన దాన్ని, సర్వనాశనమయిన దాన్ని... గుండెల్లో అగ్నికణాలను పెట్టుకు తిరుగుతున్న దాన్ని... అందుకే చెబుతున్నాను... మీరు నన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నానంటున్నారు... అది నిజమో కాదో నాకు తెలియదు... తెలుసుకోవాలని నాకు కోరికా లేదు... నేను మీ భార్యనవ్వటానికే అంగీకరిస్తున్నాను... అయితే ఒక్కమాట... మిమ్మల్ని సర్వనాశనం చేసి వదులుతాననేదే నిజం!... మీ నెత్తురు

పీల్చి పీల్చి మిమ్మల్ని పిప్పిచేసి వదులుతాను!... ఆలోచించండి... రేపు తెల్లవారిందాకా ఆలోచించుకోండి... మీకిష్టమైతే నాకూ ఇష్టమే... గెలుపూ ఓటములు కాలమే చెబుతుంది!" ఆమె ఆవేశం మీదిమీదికి ఎగసిపడుతుండగా, గిరిబాబు పడుకున్న గదిలోకి మెరుపులా మాయమయింది– అతడికి మరో మాటకు అవకాశం ఇవ్వకుండానే!

* * *

సరిగ్గా మూడు గంటలకు చక్రవర్తి వచ్చాడు.

"ఇవుగోండి కాఫీ" అన్నది. చిన్నగా నవ్వి, "మధ్యాహ్నమనగా వెళ్ళారు... ఇంతసేపూ ఎక్కడ వున్నారు?" అడిగింది కుతూహలంగా.

"అప్పటినుండీ కూర్చుంటే ఇప్పటికి ట్రంకురోడ్డు మీద ఓ టాక్సీ పోతూ కనబడింది. సాయంత్రానికి గాని రోడ్డంతా క్లియర్ అయ్యేటట్టు లేదట!"

"అంటే రేపుదయాన మనం బిచానా ఎత్తివేయవచ్చు అన్నమాట" అన్నది సంతోషంగా మల్లిక.

"అలాగే అనుకుందాం!" అన్నాడు.

గిరిబాబు అంతకు ముందే బయటకు వెళ్ళాడు.

మల్లిక కాఫీ త్రాగుతున్న చక్రవర్తి వంకే చూస్తూ, "నేను మీరన్నట్లుగా సినిమాల్లోకి వచ్చేస్తాను!" అన్నది సంతోషంగా.

"నిజం?" కాఫీ త్రాగుతున్న వాడల్లా ఆగి ఆసక్తిగా ఆమె ముఖంలోకి చూస్తూ వుండిపోయాడు.

"నిజం!"

"చేతిలో చేయి వేయండి!"

"అంత నమ్మకంలేదా నా మాట మీద!" అంటూనే అతడు జాచిన అరచేతిమీద

తన చేయి వేసింది.

అతడు మృదువుగా ఒక్కసారి నొక్కి వదిలేశాడు.

"నా అభినందనలు స్వీకరించండి!"

"థాంక్యూ!" అన్నది ఓరగా చూసి నవ్వుతూ.

ఆమె చూపును రెప్పలార్పకుండా అలాగే చూస్తూ వుండిపోయాడు.

"ఏఁవిటలా చూస్తున్నారు?" వింతగా అడిగింది.

"నా కళ్ళు కెమారాలవుతున్నాయి!"

"నాకు యాక్టింగ్ రాదుకదా!" మురిపెంగా అన్నది.

"యాక్టింగ్ రాదంటే ఎవరు నమ్ముతారు... మీరు మాట్లాడుతున్నప్పుడు మీ ముఖంలో హావభావాలను చూచే మీలోని తారను గుర్తించాను!"

"థాంక్యూ!" అన్నది. "మీ కాంప్లిమెంట్స్ నన్ను క్రింద నడవనిచ్చేలా లేవు!"

"అఖ్ఖరలేదు– మీరెక్కడ నడిచినా మీకు మీరే సాటి!"

ఒక్క క్షణం నిశ్శబ్దమావరించింది.

మల్లిక అ నిశ్శబ్దాన్ని కత్తిరిస్తున్నట్లుగా, "మంచికో, చెడుకో నా భావిజీవితపు బాటలో మిమ్మల్ని ఆసరాగా తీసుకున్నాను... మనిద్దరినీ సన్నిహితంగా నడిపిన ఈ కొద్ది గంటలే మీకు నా గురించి చాలావరకు చెప్పివుంటయి... నన్ను మీరు అర్థం చేసుకొని వుంటారనే అనుకుంటున్నాను!" అన్నది.

చక్రవర్తి ఒక్కక్షణం ఆమెను పరీక్షగా చూచాడు.

"మీరంటే నాకు పూర్తిగా అర్థమయిందని నేను చెప్పలేనుగాని... మీరు మీరెన్నుకున్న బాటను స్వర్గధామం చేసుకునేలా చేయూత నివ్వగలనని మాట ఇస్తున్నాను!"

"థాంక్యూ!" అన్నది.

"ఇందాకటినుండి నా మీద కృతజ్ఞతలు గుప్పిస్తున్నారు!... నేను మీకు చేస్తున్న సహాయం ఏమున్నది ఇందులో!"

"ఇదంతా మీ సహాయం కాదా?"

"మీలో ప్రతిభ వున్నది... మీ ప్రతిభను నేను డబ్బుగా మార్చుకోబోతున్నాను!" అన్నాడు నిర్లిప్తంగా.

మల్లిక నవ్వింది. హాయిగా నవ్వింది.

"చక్రవర్తిగారూ! మీలో వ్యాపార దక్షతతోపాటు మానవత్వం కూడా వున్నది!" అన్నది.

"ఎందుకనుకుంటున్నారు అలా?"

"నిజాన్ని మీరు అంగీకరిస్తున్నందుకు... అందునా మరొకరి ముందు..."

చక్రవర్తి నవ్వాడు.

వాళ్ళ నవ్వులకు బయట కూర్చున్న కిరణ్ లోపలకు వచ్చాడు.

"మీ ఆనందంలో నాకు భాగమివ్వాలి!"

మల్లిక కిరణ్ దగ్గరకు వస్తూ, "చక్రవర్తిగారి బుట్టలో యాపిల్స్ వున్నాయి... చెప్పండి... కావాలంటే కోసి ముక్కలు చేసి పెడతాను!" అన్నది కళ్ళు చికిలించి, అతడి కళ్ళల్లోకి చూస్తూ.

చక్రవర్తి పెద్దపెట్టున నవ్వాడు.

కిరణ్ ముఖానికి గంటుపెట్టుకుంటూ, "నాకు యాపిల్స్ అంటే ఇష్టంలేదు... అంతేకాదు మరొకరివి తీసుకు తినాలనే యావా నాకు లేదు!" అన్నాడు దెబ్బకొడుతున్నట్లుగా.

"నాకు యాపిల్స్ అంటేనే ఇష్టం... అందునా చక్రవర్తిగారి బుట్టలోవంటే మరీను!"

చటుక్కున వంట ఇంట్లోకి వెళ్ళిపోయింది మల్లిక.

"కృష్ణమూర్తిగారూ! ఇలారండి!" అన్నాడు పెద్దగా నవ్వుతూ చక్రవర్తి.

కిరణ్‌కు ఆ క్షణాన చక్రవర్తి ముందు నిలుచోవాలంటే ముళ్ళమీద నిలుచున్నట్లే అనిపిస్తోంది.

చక్రవర్తి ఎంత పిలుస్తున్నా వినిపించుకోకుండా బయటకు వచ్చేశాడు.

* * *

వీస్తున్న గాలి పిండార బోస్తున్నట్లున్న వెన్నెల్లో తడిసి ముద్దయింది.

"టైం ఎంతయిందో తెలుసా?" అన్నది మల్లిక.

చక్రవర్తి చేతి గడియారం చూచుకుంటూనే, "పది" అన్నాడు.

"కబుర్లు ఎప్పుడూ ఉండేవే... పడుకుందాం పదండి!" అంటూ లేచి లోపలకు వెళ్ళింది.

చక్రవర్తి లేచి, తన మంచం తీసుకొని లోపలకు వచ్చేశాడు.

బయట వెన్నెల ముందు, లోపల గోడకు తగిలించి వుంచిన గుడ్డిదీపపు వెలుగు వెలాతెలా బోతున్నది. అతడు లోపలకు వస్తూనే ప్రచండమైన వెలుగునుంచి, కటిక చీకట్లో కాలు పెడుతున్నట్లే ఫీలయ్యాడు.

మల్లిక గదిలోకి వెళ్ళేటప్పటికి, గిరిబాబు కళ్ళకు చేతులు అడ్డం పెట్టుకొని పడుకొని వున్నాడు.

"నిద్రపట్టిందా?"

"లేదు... నీ కోసమే ఎదురు చూస్తూ కూర్చున్నాను!" అన్నాడు కసిగా, ముఖం మీద చేయి తీస్తూ.

మల్లిక ఉలిక్కిపడింది.

"ఎందుకు నా మీద అంత కోపం?"

"నీమీద నాకు దేనికి కోపం?"

"కోపం లేదంటూనే 'గఁయ్' మనే వాళ్ళను ఏఁవనుకోవాలి?" అన్నది నవ్వి.

"మల్లికా! నీ అనవసరపు వాదనలతో నా నిద్ర చెడగొట్టబోకు..." అన్నాడు అటు తిరిగి పడుకుంటూ.

"మీరే లోపల ఏదో పెట్టుకొని నిద్రనూ, మనస్సునూ చెడగొట్టుకుంటున్నది... నేనేం చేస్తాను!" అంటూనే ఇంకాస్త ముందుకు వచ్చి, "నా దగ్గర పక్క బట్టలు ఏఁవీ లేవని మీకు తెలుసు. తెలిసే అన్నీ మంచం మీద వేసుకు పడుకుంటే నేనేమవ్వాలని మీ ఉద్దేశ్యం!" అన్నది.

గిరిబాబు విసురుగా మంచం మీద లేచి, దుప్పటి తీసి ఆమె మీదకు విసురుతూ, "ఇక వెళ్ళు... ఇక్కడ గోల చేయబోకు!" అన్నాడు.

మల్లిక నవ్వింది.

"ఎక్కడకు వెళ్ళేది?... ఈ గది నాది కూడాను!"

"ఉఁహూఁ... ఇక్కడ పడుకోవటానికి వీల్లేదు!"

"అదేం?"

"వెళ్ళి ఇంకెక్కడన్నా పడుకో... ఇక్కడ మాత్రం వద్దు!" అన్నాడు మొండిగా.

"మీరు వద్దంటే నేను బ్రతిమలాడతాననా మీ ఉద్దేశ్యం?"

"నాకే ఉద్దేశ్యమూ లేదు... నన్ను ఒంటరిగా వదిలి వెళ్ళమనే కోరుకునేది!"

"అయితే నేను ఇక్కడే పడుకుంటాను... వెళ్ళనే వెళ్ళను! ఏం చేస్తారు?"

తీక్షణంగా ఆమె వైపుకు చూస్తూ, "నువ్వే అంత మొండి పట్టు పడితే నేనేం తక్కువ తిన్నాననుకుంటున్నావా... నేనే వెళ్ళి వాకిట్లో పడుకుంటాను... అంతేగాని..."

మల్లిక ఫక్కున నవ్వింది.

"ఓడిపోతారన్నమాట!"

"మల్లికా!" కోపాన్ని నిగ్రహించుకోలేకపోయాడు గిరిబాబు.

"ఛ! మగవాళ్ళు మీరు ఓడిపోవడమేంవిటి!... నేనే వెళ్ళిపోతానులేండి... మీరు హాయిగా పడుకొని నిద్రపోండి ... అసలే ఈ నాలుగు రోజులూ మిమ్మల్ని నానా హింసలూ పెట్టాను... హాయిగా పడుకోండి... హాయిగా పడుకొని నిద్రపోండి... తియ్యటి కలలు కంటూ, మీ భావి జీవితపు నందనోద్యానవనంలో తుళ్ళుతూ, పరుగెడుతూ పడుకోండి ... నేను వెళ్ళిపోతున్నాను... మీ అరికాల్లో గుచ్చుకున్న ముల్లులాంటిదాన్ని నేను... వెళ్ళిపోతున్నాను... ప్లీజ్! హాయిగా, స్వేచ్ఛగా తలుపులేసుకొని ఒంటరిగా పడుకోండి...పడుకోండి...ప్లీజ్! ఎంత ఆనందంగా వున్నా నన్ను మరిచిపోకండి... ఎంత సంతోషంలోవున్నా నన్నెప్పుడైనా ఒక్కక్షణం గుర్తుకు తెచ్చుకుంటుండండి... రోడ్డు పక్కన, మురికి కాలువలో, మీరు తీసి పారవేసిన ముల్లులాగానే కొట్టుకుపోతాను... ఏ గుంటలలోనో పడిపోతాను... ఏ రొచ్చులోనో కూరుకు పోతాను... మీకేం హాయిగా పడుకోండి... మీ కందరూ వున్నారు... మిమ్మల్ని అందరూ ప్రేమించేవాళ్ళే మీకున్నారు ... నేనే ఎవరూ లేనిదాన్ని... నేను వెళ్ళిపోతున్నాను... ప్లీజ్! పడుకోండి...మీరు పడుకోండి...నా గురించి మాత్రం ఆలోచించబోకండి... మీ బుర్ర పాడుచేసుకోబోకండి... నేను అభాగినిని... ఎవ్వరూ లేనిదాన్ని... ఆఖరికి చలిలో ముడుచుకు పడుకోవాలన్నా, అరువు దుప్పటి ఎంచుకోవాల్సిన దాన్ని...ప్లీజ్! పడుకోండి... అందమైన కలలుకంటూ నన్ను మర్చిపోండి... సర్వనాశనమయి పోయిన నన్ను మర్చిపోండి... పడుకోండి... ప్లీజ్!... హాయిగా, స్వేచ్ఛగా, స్వర్గంలోలా పడుకోండి... గుడ్‌నైట్! గుడ్‌నైట్ గిరిబాబూ... మీకు గుడ్‌నైట్... ఆల్ ది బెస్ట్... టు యూ... టు యూ గిరిబాబూ! ఆల్ ది బెస్ట్... గుడ్‌నైట్.... గుడ్‌నైట్!"

"మల్లికా!" ఆమె ఆవేశానికి అతడు కలవరపడుతూ లేచి ముందుకు త్వరత్వరగా

రెండడుగులు వేశాడు.

కాని తలుపులు భళ్ళున మూసుకున్నాయి– గిరిబాబుకూ, మల్లికకూ నడుమ ఇనుపతెరల్లా!

* * *

పడుకుంటే ఒళ్ళంతా మరుగుతున్న నీళ్ళలా ఉడికి పోతోంది మల్లికకు. కళ్ళు బలవంతాన మూసుకుంటే– తన దౌర్భాగ్యానికి కారకుడైన ఆ రాక్షసుడు– కళ్ళెదుట నిలబడుతున్నాడు.

అమ్మ గుర్తుకు వచ్చింది. నాన్న గుర్తుకు వచ్చాడు. తన గది గుర్తుకు వచ్చింది. తన స్నేహితురాళ్ళంతా గుర్తుకు వచ్చారు– తన పరువు గుర్తుకు వచ్చింది. నాలుగు రోజుల క్రితపు తన సంతోషం గుర్తుకు వచ్చింది. తన ఆనందం గుర్తుకు వచ్చింది.

గిరిబాబు గుర్తుకు వచ్చాడు. అతడి నొక్కుల నొక్కుల జుట్టు గుర్తుకు వచ్చింది. నవ్వుతున్నప్పటి అతడి ముఖం గుర్తుకు వచ్చింది. అతడి ముఖంలోని తన మీద కోపం గుర్తుకు వచ్చింది. తన మీద ప్రేమ కురిపించే అతడి కళ్ళు గుర్తుకు వచ్చినయి– వెయ్యి వరహాలు చేసే అతడి హృదయం గుర్తుకు వచ్చింది.

అతడి ముందు కృష్ణమూర్తి ఎంత?

– తనలో అందం చెరగనంతవరకూ ప్రేమించే హృదయం అది. లేకపోతే చెడిపోయిన తనని ప్రేమించే శక్తి అతనికెక్కడిది? బంగారు బొమ్మలా తనని అంటిపెట్టుకున్న అందం అతడి కళ్ళకు పొరలు కప్పి తనలోని లోపాలను అతడు మర్చిపోయేలా చేసింది. తనలోని మెరుపులు తగ్గి, పైన పూసిన బంగారంలా అందమూ కరిగి జారి పోయిన నాడు– తనలోని లోపాలు, ఇంతై, ఇంతింతై కృష్ణమూర్తికి తనను దూరం చేయవనే నమ్మకేంవిటి?

నిజం!– ఆనాడు కృష్ణమూర్తికి తనూ, తన జీవితం కూడా వ్యర్థమే అవుతయి!

తల విదిలించింది ఆ మత్తులోనే.

చక్రవర్తి నవ్వుతూ కనబడ్డాడు. కళ్ళముందు సినిమా రీళ్ళు తిరగసాగినయి.

అవును– చక్రవర్తి తలుచుకుంటే తనకింకా కావాల్సిందేఁవున్నది?

రేపీపాటికి తనను సినీ ప్రపంచంలో ఆకాశాన కూర్చోబెట్టడూ?

– ఆ రాక్షసుడూ చూస్తాడు!

అప్పుడు మళ్ళా అతగాడు తన దగ్గరికి ఏడుస్తూ పడి వస్తాడేమో!

రానీయ్– రావాలి– అలా వచ్చి తీరాలి– రాగానే గేటు దగ్గర గూర్ఖాతో మెడపట్టించి వెళ్ళగొట్టించదూ!

నవ్వుకున్నది హేలగా...

తలను ఆనందంగా అటూ ఇటూ ఊపసాగింది.

ఉఁహూఁ... లేదు... ఆ రాక్షసుడిని లోపలకు పిలిపించి గొంతుపిసికి చంపేయాలి– గొంతుపిసికి చంపేస్తుంటే, ఊపిరాడక గిలగిలా కొట్టుకుంటూ, 'మల్లికా, మల్లికా' అని ప్రాధేయపడుతుంటే– నవ్వుతూ, పెద్దగా నవ్వుతూ, గొంతును మరింతగా నొక్కేస్తూ చంపేయాలి– కర్కశంగా నవ్వుకున్నది.

ఆ రాక్షసుడికి అదే శిక్ష!

కాసేపు ఊపిరి బిగపట్టుకొని పడుకున్నది. 'వాడి' ని మర్చిపోవాలన్నట్లుగా కళ్ళు మూసుకొని బిగుసుకు పడుకున్నది.

– తను రెండు పిక్చర్లలో నటిస్తే చాలు, ఎక్కడ చూసినా తనే... ఏ పుస్తకంలో చూసినా తనే... ఏ గోడమీద చూసినా తనే... గాలిలో తేలిపోతున్నట్లే అనిపించింది మల్లికకు. ఆకాశంలో మేఘాల నడుమ నృత్యం చేస్తున్నట్లే అనిపించింది.

అవును... తానొక లక్షాధికారిణి.

తనకీ, తన అందానికీ సర్వ ప్రపంచం జోహార్లు!

తన నటనకి జోహార్లు.

జోహార్లు... జోహార్లు...

చప్పట్లు... చప్పట్లు... ఎటు చూసినా చప్పట్లు...

ప్రశంసలు...

ఎక్కడ చూచినా తనే... ఎవరినోట విన్నా తన గురించే...

'మల్లిక... మల్లిక... మల్లిక'

– పక్కన బరువుగా వస్తున్న ఉఛ్వాస నిశ్వాసాలు ఆమెను ఊహాలోకాల్లోనుంచి ఇనుప గొలుసులు వేసి లాగినయి... ఉలిక్కిపడింది!

తనమీద ఏదో బరువు పడుతున్నట్లనిపిస్తోంది.

ఎక్కడో లోయలోనుండి వినబడుతున్నట్లుగా ''మల్లికా'' అన్న మాట వినబడుతోంది.

'ఏఁవిటది?' కళ్ళు చించుకొని ఆ గుడ్డి వెలుగులో చూడసాగింది.

– ఏదో మానవాకారం తనని పెనవైచుకు పోతున్నట్లే వున్నది!

భయంతో కెవ్వున కేక వేయబోయింది నోరంతా తెరిచి. అది గమనిస్తున్నట్లుగానే ఆ ఆకారపు చేయి మల్లిక నోటిమీద పడింది. గట్టిగా బలంగా మూసివేసింది.

మల్లిక బిగుసుకుపోసాగింది. ఆమె రక్తం గడ్డకట్టుకు పోతోంది.

– క్షణంలో ఆమె ఊహాలోకాల్లోనుంచి పూర్తిగా బయటపడి మత్తు వదిలించున్నది. మామూలు మల్లికయింది.

ధైర్యం పుంజుకున్నది. నరాలు ఫట్‌మనేలా తల విదిలించింది.

మీది మీదికి వస్తున్న ఆ ఆకారాన్ని ఒక్క తోపు తోసింది. బలాన్నంతా కూడగట్టుకొని రెండు చేతులతోటీ అతడి గుండెమీద ఫెడీ ఫెడీమని గుద్దసాగింది.

"ఛీ! రాక్షసుడా!"

"అరవబోకు మల్లికా!"

అతడు చక్రవర్తి!

చక్రవర్తి నవ్వాడు.

"మల్లికా!" అతడు ఆమెనే చూస్తూ ఒక్క క్షణం ఆగాడు. "నీకు ఇంతగా సహాయం చేయబోతున్న నాకు నీ హృదయంలో కొద్ది చోటు ఇవ్వలేవా?" అన్నాడు తమకంతో కళ్ళు మూసుకుంటూ.

"ఏంవిటి మీరంటున్నది!" అన్నది వింతగా.

"నేను తెలుగులోనే చెప్పానే!" నవ్వాడు మూలుగుతున్నట్లుగా.

అతడి నవ్వు వికృతంగా వున్నట్లనిపించింది మల్లికకు ఆ క్షణాన.

"మీ తెలుగు, తెలివి కూడా నాకు అర్థమయినయి... కాని, ఇంత దురుద్దేశ్యంతో నాకిన్ని మాటలు చెప్పారని నేను ఊహించలేకపోయాను... నేనెంత అమాయకురాలినో నాకిప్పుడే అర్థమవుతోంది!" బాధగా, నీరసంగా అన్నది.

ఆ గుడ్డి వెలుగులో అతడి వంక అసహ్యంగా చూడసాగింది.

"ఆలస్యంగానైనా నిజం తెలుసుకున్నావు... ఇక నీ ముందు జీవితమంతా స్వర్గమే!" అన్నాడు చక్రవర్తి కొద్దిగా ముందుకు జరుగుతూ.

"మీరు తేనె పూసిన కత్తులన్నమాట!"

"తేనెను అనుభవించవద్దని ఎవరన్నారు?"

"కత్తితో నాలిక కోసుకుంటూనా?" విసురుగా అన్నది.

"నీకెందుకా భయం... నీకెప్పుడూ నేను తేనెనే అందిస్తాను... భయపడబోకు... నీమీద నా కత్తినెన్నడూ ఉపయోగించను!"

"ఛీ! నాతో మాట్లాడవద్దు! మీరు మనుష్యులు కాదు... మనుష్యుల రక్తం త్రాగే

మీరు మనుష్యులెలా అవుతారు?”

చక్రవర్తి మళ్ళీ నవ్వాడు.

“నాకు కావాల్సింది సినిమా డైలాగులు కాదు మల్లికా! నువ్వు...” ఓ అడుగు ముందుకు వేసి, “కాలాన్ని ఎందుకు వృథా పరుస్తావ్... నన్ను కాదని నువ్వు సినిమా ప్రపంచంలో ఎలా కాలుపెడతావ్... ఆఁహాఁ... అసలు నీ ముందు జీవితం గురించి ఒక్కక్షణం అలోచించుకో!” అన్నాడు.

అతడి మాటలకు అమె నరాలను ఎవరో కత్తిపెట్టి కోసి బయటకు లాగుతున్నట్లే విలవిలలాడింది.

“ఛీ! సిగ్గులేదూ అలా చెప్పుకోవటానికి... మీరూ మనుష్యులే... మానవత్వం లేదా మీలో... మీరెందుకు బ్రతికి... చావండి మీరంతా... మీ మగవాళ్ళంతా పడి చావండి... మీరు చస్తే, మీ శవాల్ని గద్దలూ, రాబందులూ పీక్కు తింటుంటే చూడాలనిపిస్తోంది నాకు... చావండి... రాక్షసుల్లారా! కుళ్ళి కుళ్ళి చావండి... మీలాంటి వాళ్ళంతా చస్తేనే ప్రపంచం బాగుపడుతుంది... మీరు చావండి... మీ భారం మోయలేక భూమాత భోరున ఏడుస్తూంది... చావండి... గిలగిలా కొట్టుకు చావండి... మనుష్యుల రక్తం త్రాగే అధముల్లారా... మీరంతా చావండి... మీరంతా చస్తే మీ శవాల మీదగా ఎగరాలనిపిస్తోంది... నృత్యం చేయాలనిపిస్తోంది... మీ శరీరాలను ముక్కలు ముక్కలు చేసి ఎగరవేయాలనిపిస్తోంది... మీ తలలను ఇనప గునపాలతో చితక కొట్టాలనిపిస్తోంది... చావండి... చావండి... రాక్షసుల్లారా, చావండి!” ఆవేశంతో పొగలు గ్రక్కసాగింది మల్లిక.

“మల్లికా!” భయంతో బిగుసుకుపోయాడు చక్రవర్తి.

– వెనగ్గా, మూలగా, ఎవ్వరూ వుండరనుకున్న గదిలోకి పోయి, తలుపుల మీదనే జారిగిలబడి వెక్కివెక్కి ఏడ్వ సాగింది మల్లిక!

* * *

"గిరిబాబుగారూ! త్వరగా లేవాలి!" సీతాపతిరావు గారి కంఠానికి ఉలిక్కిపడ్డాడు గిరిబాబు. కళ్ళు నులుము కుంటూ ఆయన వంక చూచాడు.

"త్వరగా ఒక్కసారి ఇటు రావాలి!" ఆయన కంఠాన్ని వణుకు ఊపుతోంది.

గిరిబాబు లేచాడు. తడబడుతూ ముందు నడుస్తున్న సీతాపతిరావుగారిని అర్థం కానట్లుగా అనుసరించాడు.

హాల్లో కాలుపెట్టిన ఆయన నీరసంగా వెనక్కు తిరిగి జాలిగా, దిగులుగా గిరిబాబు ముఖంలోకి చూడసాగాడు.

''చాలాఘోరం జరిగిపోయింది గిరిబాబుగారూ!'' ఆయన కంఠం పూడుకుపోయింది. దుఃఖాన్ని నొక్కేసుకుంటు న్నట్లుగా వున్నది ఆయన మాట.

"ఏఁవైంది?"

అప్పటికే చక్రవర్తి, కిరణ్ అక్కడ తలలు వాల్చుకొని నిలుచొని వున్నారు.

క్రింద మెడవరకూ దుప్పటి కప్పుకొని మల్లిక పడుకొని వున్నది.

గిరిబాబు విచిత్రంగా మల్లిక వైపుకు చూచాడు. అలాగే చూస్తూ వుండిపోయాడు.

ముందుకువంగి ఆమె ముఖం దగ్గరకు తన ముఖాన్ని జేర్చి కళ్ళు చించుకుంటూ అమె ముఖంలోకి చూడసాగాడు.

అతడి మైకం వదిలింది. అతడి మత్తు వదిలింది. అతడికి సర్వం అర్థమయింది.

అతడికి ఆ నిజమేదో అర్థమయిన మరుక్షణంలో నెత్తిన ఎవరో బాదినట్లే అనిపించింది.

మల్లిక ఇక లేదు!

అది పచ్చి నిజం!

"మల్లికా!" పెద్దగా అరిచాడు. "మల్లికా!"

మల్లిక చచ్చిపోయింది.

"ఎందుకయింది ఇలా?... ఏంవైంది?" అన్నాడు తలెత్తి ఆవేశంగా.

"ఇది మామూలు చావుకాదు... ఆమె ముఖం చూడండి... మామూలు చావుకాదు గిరిబాబుగారూ!" సీతాపతి రావుగారి కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

పిచ్చిగా చక్రవర్తి వైపుకు చూచాడు గిరిబాబు.

కిరణ్ వైపుకు చూచాడు.

సీతాపతిరావుగారి వైపుకు చూచాడు.

చక్రవర్తి చూపులు భయంగా వున్నయి.

కిరణ్ నిరాశగా శూన్యంలోకి చూస్తున్నాడు.

సీతాపతిరావుగారు దిగులుగా చూస్తున్నారు.

''ఏంవిటిదంతా?'' ఆవేశంతో ఊగిపోతున్నాడు గిరిబాబు. ''ఒక్కరూ మాట్లాడరేం?"

చటుక్కున దుప్పటి లాగాడు.

ఆమె గుండెల మీద బిగుంచుకున్న చేతుల్లో ఓ కాగితం విలవిలలాడుతోంది.

మెరుపులా ఆ కాగితాన్ని చేతిలోకి తీసుకుంటూనే దాని మీదకు కళ్ళను సూదుల్లా కేంద్రీకరించాడు.

"మీ అందరికీ–

వయస్సులో పెద్దవాళ్ళు గనుక నమస్కారములు.

నేనేం చెప్పగలను? ఏం చెప్పుకోగలను? చెప్పుకునేందుకు ఏంవున్నది గనుక... ఇంతకు మించి.

గిరిబాబుగారిలో నాకు ప్రతిక్షణం దేవుడు కనబడుతున్నాడు. 'దేవుడు' లాంటి

గిరిబాబును, కడుపులో పాపాన్ని పెట్టుకొని వంచించలేను– ఆయన మాటలను, అవి నా భావి జీవితానికి అమృతపు సోపానాలే అయినా, మన్నించ లేకపోయాను. ఉఁహూఁ... దేవుడికి ఏ మనిషీ అన్యాయం చేయలేదు.

నా అందం చూచి నన్ను ప్రేమించిన కృష్ణమూర్తిగారి దగ్గర నా కోరిక లీడేరలేవు... ఆయనకా శక్తి లేదు. కాలు క్రింద పెట్టకుండా జీవించిన నేను గుమాస్తా భార్యనయి పాముకు తినేదేమున్నది. అందమైన గతం ముందు పాపిష్టి భవిష్యత్తు ఎంత... వద్దు... నేననుభవించిందే నాకు నూరేళ్ళ పంట... ఇంకెందుకు కష్టాలు.

చక్రవర్తిగారు నా మీద కురిపించిన చల్లదనంలో, అకస్మాత్తుగా 'రాక్షసుడు' కనిపించాడు. విషం కుక్కుకొని వెన్నెలను కురిపించే కళ్ళంటే నాకు చచ్చేభయం... అందునా ఒకసారి వాటి రుచిని చూచినదాన్ని కనుక... ఎన్నిసార్లు ఆ కోరలతో కాట్లు వేయించుకోగలను? ఎన్నిసార్లు ఆ పంజా దెబ్బలను తినగలను?

అందుకే–

చిటికెడు 'ఎండ్రిన్'ను సీతాపతిరావుగారికి నయాపైసా ఇవ్వకుండా– స్వంతంచేసుకొని అమృతంలా సేవించాను.

ఎవ్వరి క్షమాపణలనూ నేను కోరదలుచుకోలేదు.

ఎవ్వరి సానుభూతినీ నేను కోరదలుచుకోలేదు.

ఎవ్వరి కంటినుండీ ఒక్క బొట్టు నీటిని కూడా ఆశించటం లేదు.

నాకు నేనుగా క్షణక్షణం చచ్చే ఈ మనుష్యుల మీదగా స్వేచ్ఛగా, హాయిగా బంధాలనన్నిటినీ త్రెంచుకొని ఎగిరి పోతున్నాను.

మరోసారి ఈ భూమ్మీద మనిషిగా– అందునా ఆడదానిగా పుట్టకుండా చేయమని మాత్రం భగవంతుని హృదయ పూర్వకంగా ప్రార్థిస్తున్నాను.

– మల్లిక."

* * *

అది గాజుపల్లకి– బంగారు పల్లకి కాదు: చెక్క పల్లకీ కాదు. మంచులా తెల్లగా, తాజమహల్ లా అందమయిన గాజుపల్లకీ చిన్న చిన్న గాజు పలకలతో చెక్కబడి వున్నదా మంచుపల్లకీ!

ఆమె– అధిష్ఠాత్రి– రాణి. ఆమెది అసమాన సౌందర్యం... సర్వ సౌందర్యం...

ఆమెతోపాటు ఆ పల్లకీ ఎక్కాలనుకున్న వారెవ్వరూ ఎక్కనేలేదు. ప్రతి గాజు ముక్కలోనూ ప్రతిఫలించిన ఆమె సౌందర్యం వాళ్ళను దిగ్భ్రాంతులను చేసింది. ఆమెను ఏలాలని వెళ్ళిన వారందరూ పల్లకీ బోయీలే అయ్యారు. వాళ్ళకా స్పృహలేదు. ఎప్పుడయినా స్పృహలోకి వచ్చి తమ స్థితికి కోపగించుకునేవారు. కాని, సౌందర్య ప్రలోభం వివశత్వం కలిగించేది... ఆ భ్రమలో ఆమెతోటి రాజ్యాల్నేలుదా మనుకున్నారు వాళ్ళు!

ఆ గాజుపల్లకీ, మానవ శరీరంలా ఎప్పుడో పగిలి పోతుంది– ఆ తరువాత దానికి అస్థిత్వమే లేదు.

పచ్చని తోరణాలతో, మంగళ వాయిద్యాలతో ఆమె... బంగారుపల్లకీ... గాజుపల్లకీ... మంచు పల్లకీ ఎందుకయింది? దాంట్లో ఆమె దేఁవుడు లేడేం?

– ఆమెను రాక్షసుడు దోచేశాడు; దేఁవుడు పరిత్యజించాడు.

అనంత కాలాల్లోకి, ఆకాశమార్గంలో వెళ్ళిపోతోంది గాజుపల్లకీ: అదుగో రాణి... మల్లిక!

# (సమాప్తం)

## పి. ఎస్. నారాయణ

# గాజు పల్లకీ

చీకటిలో.... పెనుతుఫాన్‌లో చిక్కుకుందో రైలు! దిక్కుతోచక అల్లాడి పోతున్న జనంలోంచి నలుగురు ఒక యింటిని చేరుకున్నారు. నలుగుర్లో మల్లిక సుమధుర మనోనాయిక. మిగతా ముగ్గురూ మగధీరులు....

మల్లికకు కన్ను చెదిరే అందముంది. గొప్ప మనసుంది. ఒకమాయగాడి దాడిలో వంచితగా మిగిలిన గతముంది. అందుకు చిహ్నంగా బిడ్డని కడుపుతో వుంది...మల్లిక కథ విన్న ముగ్గురూ తమ ఔదార్యాన్ని ప్రకటించుకున్నారు.

వెండి జలతారు తెరమీద నిన్ను మహారాణిని చేస్తాను...అందు కర్పించాలి నీ శరీర సంపద–అన్నాడు సినీ నిర్మాత – ఆ ముగ్గుర్లో ఒక విధాత... నీ బొమ్మ నా గుండెల్ని ఆక్రమించుకుంది...నీకోసం పడి ఛస్తానన్నాడు రెండో కథానాయకుడు విశ్వప్రేమికుడు. నీగతం నాకొద్దు. నిన్ను పెళ్లాడి, నీ బిడ్డకి తండ్రవుతాను అని ముందుకొచ్చాడు మహామనీషి – మూడో మనిషి.

తానెవరి గుండెల్లో కురిపించాలి పన్నీటి జల్లు? ఎవరి మనోవీధిలో తానవ్వాలి హరివిల్లు?

ఆమె ముందరున్నది ముద్దుమురిపేల ముత్యాల పల్లకీ, హాయి మంచు పల్లకీ, చిన్న కుదుపుకీ కాలి మోపుకీ ముక్కలయ్యే 'గాజు పల్లకీ'! మల్లిక ఎన్నిక మీ ముందుంచుతున్నాం – సుమధుర గీతికగా తెలుగు తొలి న్యూవేవ్ నవలికగా...

**తప్పక చదవండి!**

Wrapper Printed at Swatantra Art Printers, Vijayawada-520004.